
వీక్షణం

ఆర్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2006 57 రు. 10

- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌ల పై ఫోకస్
- తెలంగాణ అణచివేత చరిత్ర
- ఎన్నికల సర్వేలు ప్రజాభిప్రాయ సూచికలా ?
- పోలవరం వల్ల లాభమెవరికి ?
- ఐదు దశాబ్దాల క్రీడా వికాసం
- పాఠశాలల రేషనలైజేషన్ ఎందుకు ?



1. శ్రీ వి. హనుమంత రావు 2. శ్రీ ఎన్. వేణుగోపాల్ 3. శ్రీ సురవరం సుధాకర్ రెడ్డి 4. శ్రీ బి.వి. రాఘవులు 5. శ్రీ కొణతం దిలీప్ 6. శ్రీ కె.ఆర్. చౌదరి

వీక్షణం
ఆర్థిక, సామాజిక మాసపత్రిక
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వార్షిక చందా: రు.120   విడి ప్రతి : రు. 10

57 ఏప్రిల్ 2006

సంపాదకీయం

జలయజ్ఞంలో బలిపశువులు

ఎల్లంపల్లి ప్రాజెక్టు వ్యయ అంచనాలలో అవకతవకలు రాష్ట్రశాసనసభ బడ్జెట్ సమావేశాల సమయాన్ని విపరీతంగా కొల్లగొట్టాయి. ప్రాజెక్టు వ్యయ అంచనాలను రాత్రికి రాత్రి నాలుగువందల కోట్ల రూపాయలు పెంచి చూపించే కుంభకోణం జరిగిందని ప్రధాన ప్రతిపక్షం ఆరోపించగా, ఏ తప్పూ జరగలేదని అధికారపక్షం వాదించింది. ఇతర రాజకీయపక్షాలు మధ్యస్థంగా ఏదో ఒక వైఖరి తీసుకున్నాయి. ఫైళ్లు చూపించాలనే డిమాండ్‌పై చర్చ ఎడతెగకుండా సాగి, చివరికి ప్రతిపక్ష నాయకుడు మాటజారడంతో, దిక్కు మారి, కొలిక్కి వచ్చింది. ఇప్పటికి ప్రతిపక్షం ఓడినట్లు, అధికారపక్షం గెలిచినట్టు కనబడుతోంది.

కాని ఒకానొక ఎల్లంపల్లి ప్రాజెక్టు అంచనాలలో పొరపాట్లు జరిగాయా లేదా అనేది ప్రశ్న కాదు. ఈ సమస్య ద్వారా ఇంకా లోతయిన అంశాలను, ఇంకా వివరంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. రాజకీయ పక్షాలన్నీ ఆ లోతయిన అంశాలను పక్కన పెట్టి పైపై చిల్లర అంశాల మీద సిగపట్లు పట్టుకుంటున్నాయి. బహుశా ఆ లోతయిన అంశాలు ప్రజలదృష్టికి రాకుండా చేయడంలో అన్ని రాజకీయపక్షాలు తమ తమ పాత్రలు నవరసభరితంగా పోషిస్తున్న ఆసక్తికర నాటకం సాగుతున్నట్టుంది. నాటకం వాస్తవజీవితాన్ని మైమరపింపజేసినట్టుగా ఎల్లంపల్లి కుంభకోణపు భాగోతం అసలు మొత్తం జలయజ్ఞపు మహాదోపిడీపై ముసుగు కప్పుతున్నది.

పదిసంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురయిన నీటిపారుదలరంగాన్ని, వ్యవసాయరంగాన్ని మళ్లీ ప్రాధాన్యతా వేదిక మీదికి తేవడం అనే ప్రశంసనీయమైన, ప్రజోపయోగకరమైన బృహత్పథకం ఈ రాష్ట్రంలో కంట్రాక్టర్ల వ్యవస్థకు, తద్వారా కొందరు రాజకీయ నాయకులకు వేలాది కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని అప్పనంగా దోచిపెట్టే తెలివయిన ఎత్తుగడగా మారిపోయింది. నీళ్లున్నాయా లేవా, వస్తాయా రావా, ఏ పది పదిహేను ఏళ్లకయినా ప్రజలకు అందుతాయా లేదా అనే ప్రశ్నలతో సంబంధం లేకుండా కంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులివ్వడంతో ఈ ఎత్తుగడ ప్రారంభమయింది. ప్రపంచీకరణ క్రమంలో విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, ఫ్లైఓవర్లు అయిపోయి ఇప్పుడు నీటిపారుదల ప్రాజెక్టులు, కాలువలు నడుస్తున్నాయి. విదేశీ, స్వదేశీ నిర్మాణ సంస్థలు, ఆధునిక నిర్మాణ పరికరాలు, అంతర్జాతీయ బిడ్డింగులు - సరిగ్గా గత ప్రభుత్వ కాలంలో ఏయే శక్తులు ప్రజాధనాన్ని దండుకున్నాయో అవే శక్తులు ఇవాళ కూడ అదే పనిలో ఉన్నాయి. భాష మారినట్టు కనిపిస్తోంది.

ఈ పరిస్థితులలో అడగవలసింది ఈ నిర్మాణాలవసరమా అని. ఈ భారీ నిర్మాణాల బదులు, ఈ వ్యయంలో సగానికో, పావుకో స్థానిక, చిన్న నీటిపారుదల సౌకర్యాలు కల్పించవచ్చు గదా అని. స్థానిక, చిన్న నీటి పారుదల సౌకర్యాలు కల్పిస్తే స్థానిక ప్రజల శ్రమశక్తిని, సాంకేతిక నైపుణ్యాన్ని వాడుకుని, వారి అవసరాలను తీర్చగల నిర్మాణాలు సాగించవచ్చు గదా అని. అంటే అవసరాలు తీరడం, శ్రమశక్తి వినియోగానికి, స్థానిక వనరుల వినియోగానికి అవకాశం దొరకడం, ఆ క్రమంలో ఆ ప్రజల చైతన్య వికాసానికి అవకాశం దొరకడం జరుగుతుంది గదా అని.

కాని ఇవాళ్టి పాలకులకు కావలసింది అది కాదు. స్థానికుల అవసరాలు తీరినా తీరకపోయినా తమకు ముడుపులందడం వాళ్లకు చాలు. స్థానికుల శ్రమశక్తికన్న బహుళజాతి సంస్థల యంత్రాల వాడకం పెరగాలి. స్థానిక వనరులు బహుళజాతి సంస్థల బొక్కసాల్లోకి ప్రవహించాలి. ఏవన్నా ఒకటి రెండు కాసులు స్థానిక పాలకుల బొక్కసాల్లో జారిపడాలి. ప్రజల చైతన్య వికాసమా, అది వద్దే వద్దు! ❑

లోపలి పేజీల్లో...

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష సామాజిక, ఆర్థిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

వీక్షణం

ఆర్థిక, సామాజిక మాసపత్రిక

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040 - 55843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, ఆజామాబాద్, హైదరాబాద్.

సహాయ సంపాదకులు : కొణతం దిలీప్
డి.వి.రామకృష్ణారావు
సర్క్యులేషన్ మేనేజర్ : వై.రామచంద్రం
కంపోజింగ్ : కె.రమ
లే ఔట్ : పి.అనల

పాఠకుల వీక్షణం

వీక్షణం మార్చి 2006 సంచికలో ఆర్ఎల్ ప్రసాద్ రచన 'గీతవృత్తి పరిశీలన' చాలా బాగుంది. ఇదేవిధంగా అన్ని కులవృత్తుల గురించి వారి సామాజిక, ఆర్థిక పరిశీలనా వ్యాసాలు ప్రచురిస్తే బాగుంటుంది. ఎప్పుడో ఒక శతాబ్దం కింద సయ్యద్ సిరాజ్ ఉల్ హసన్ అనే సామాజిక శాస్త్రవేత్త 'ది కాస్ట్స్ అండ్ ట్రైబ్స్ ఆఫ్ ది నిజామ్స్ డొమినియన్స్' అనే సామాజిక గ్రంథం రాశారు. ఇప్పుడు కులాల గురించి, కులవృత్తుల గురించి చర్చ జరుగుతున్న సందర్భంలో, ఆ గ్రంథాన్ని ఆధారంగా పెట్టుకుని, ఆర్.ఎల్. ప్రసాద్ గారి పరిశోధనలాగా వ్యాసాలు ప్రచురిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- కె. వెంకటేశ్వర్లు

హైదరాబాద్

వీక్షణం చాలా రిచ్‌గా వస్తోంది. నాకు 1970లలో ఐసిఎస్ఎస్ఆర్ నడిపిన 'ప్రసారిత' పత్రిక గుర్తు వస్తోంది. అకడమిక్ పరిశోధనా వ్యాసాలకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణా వ్యాసాలకు వేదికగా వీక్షణం చాలా అవసరమైన స్పేస్‌లో ఉంది. ఈ స్పేస్‌ను కాపాడండి. రచనల రూపంలో కాని, అనువాదాల రూపంలోగాని నా సహకారం కావాలంటే అందజేస్తాను.

- ప్రొ. వాసిరెడ్డి భాస్కరరావు

హనుమకొండ

మార్చి నెల వీక్షణంలో రచయితలకు సూచన అనే ప్రకటన చదివి ఈ నాలుగు మాటలు సంపాదకులకు చెప్పాలని రాస్తున్నాను. ఇవాళ అనేక పత్రికలు తమ పత్రికల్లో అచ్చు వేసే రచనల్ని ముందుగా పరిశీలన జరిగాక ఆయా రచయిత (త్రు)లకు కనీస సమాచారం ఇవ్వడం అనేది చెయ్యాలి. అచ్చు వెయ్యనీ - వేసినా ఈ పనిని చేయటం తప్పక నిర్వహించాలి. ఎంతోమంది రచయితలకు ఇదొక చేదు అనుభవమే. అసలు తమ రచన అచ్చుకు ఆమోదం పొందిందో లేదో ఆయా రచయితలకు తెలిసే వీలులేకుండా పోయింది, ఇందుకు ఆయా పత్రికా సంపాదకుల పని విధానమే కారణం. దీన్ని తమ పరిగణనలోకి తీసుకోకపోవడం మూలంగా, తమ రచనలు సకాలంలో ఎక్కడో ఒకచోట వెలుగుచూడక పోతాయా అనే ప్రయత్నం రచయితలకు సహజంగా కలుగుతుంది. అందువలన ఒకే రచన రెండు పత్రికల్లో ముద్రించబడుతూ కనిపిస్తే సరే, ఒక్కోసారి ఏ ఒక్క పత్రిక కూడా అచ్చువేయక పోవచ్చు. అప్పుడు రచయిత మూడో ప్రయత్నం చేసే వీలుంటుందా ? కనుక సంపాదకులు తమ చేతికి రచనలు అందుకున్నాక వారంరోజుల్లో దాని పై రచయితలకు సమాచారం అందించే బాధ్యత వహిస్తే ఇద్దరికీ ఎంతో గౌరవప్రదంగా ఉంటుంది.

- సజ్జా వెంకటేశ్వర్లు

వేటపాలెం

వీక్షణం పత్రిక (సమీక్ష వెలువడినప్పటినుంచి) ప్రతీ సంచికా - అక్షరం వదలకుండా చదువుతున్నాను. అన్ని వ్యాసాలు - ప్రజానుకూల విశ్లేషణతో ఉంటున్నాయి. చాలా వ్యాసాల్లో ఇటీవల, కొంతకాలం క్రితం అని వుంటున్నది. అవకాశం వున్న మేరకు బ్రాకెట్లలో స్పష్టమైన తేదీ ఇస్తే బాగుంటుంది. కవర్ మీద విషయసూచిక కంటె - సామ్రాజ్యవాదంపై పోరాటం సాగించిన వారి ఫోటోలు వేస్తే బాగుంటుంది.

- డా. మానేపల్లి

ఎలమంచిలి

నా వ్యాసం 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అసమానతలు' పై ఎల్లారెడ్డిగారు వ్యాఖ్యానిస్తూ (వీక్షణం, మార్చి 2006) నా వ్యాసం తప్పుల తడకగా నడిచిందన్నారు. నా వ్యాసం ఆయన పూర్తిగా చదివి అర్థం చేసుకున్నారా అన్నది అనుమానమే. అందువలన ఆయన ఈ క్రింది అంశాలను పరిశీలించగలరు.

1. అన్ని జిల్లాలకు మానవ అభివృద్ధి సూచికలు తయారుచేయబడ్డాయి. అవి కాకి లెక్కలు కాదు. నేను వాటిని ఉపయోగించాను. తెలంగాణా వెనుకబడి ఉందని, ఇక జిల్లాల అభివృద్ధిపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని చెప్పాను.
2. తెలంగాణా వెనుకబడినతనానికి కారణం రాష్ట్ర ప్రభుత్వ విధానాలే. దానికి ప్రత్యేక వివరణ ఎందుకు ?
3. తెలంగాణాకు జరిగిన అన్యాయం గురించి ఎల్లారెడ్డిగారు రాశారు. అది నేను నా వ్యాసంలోనే చెప్పాను. వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి ఆటంకాలని నా వ్యాసం ముగించాను. అటువంటప్పుడు నేను తెలంగాణా ప్రజలకు వ్యతిరేకిని ఎలా అవుతాను?
4. అసలు సమస్య, తెలంగాణ విడిపోవడం వలన వేగంగా అభివృద్ధి చెందగలదా లేక క్రొత్త సమస్యలను ఎదుర్కొంటుందా? దాని గురించి ఎల్లారెడ్డిగారు ఏమీ చెప్పలేదు. చెపితే పాఠకులు సంతోషించేవారు.
5. నా వ్యాసం ఎలా అచ్చువేసారో అర్థం కావడం లేదని ఎల్లారెడ్డిగారు వాపోయారు. ఇది ప్రమాదకరమైన ఆలోచన. వ్యాసం ప్రచురించాలా లేదా అన్నది సంపాదకులు నిర్ణయిస్తారు గాని పాఠకులు కాదు. అలాగే ప్రత్యేక తెలంగాణాను వ్యతిరేకించే వారంతా తెలంగాణా ప్రజలకు వ్యతిరేకులు అనుకొనుట కేవలం భ్రమ.

- యిమ్మానేని సత్యసుందరం

మచిలీపట్నం

తమ వాదనను అన్ని కోణాల నుంచీ వివరించి, ఇతరుల వాదనల్లోని మంచి, చెడులను చెప్పి, వాటికంటే తన వాదన ఎలా శ్రేష్ఠమైనదో చెప్పటం ఉత్తమమైన పద్ధతి. ఎదుటివారి వాదనల్లోని లోపాలను ఎత్తిచూపి తన వాదన మంచిదనడం మధ్యస్థం. ఎదుటివారికి లేని అభిప్రాయాలను అంటగట్టి, వాటిని చెండాడి తనను సమర్థించుకోవడం అధమ పద్ధతి. ఫిబ్రవరి సంచికలో పి.రుక్మిణిగారు ఇంతకంటే అధమ పద్ధతిని కనిపెట్టారు. ఎవరికో అపోహలున్నాయంటూ కె.రవిబాబుగారికిగానీ, ఆయన కార్యదర్శిగా వున్న జనసాహితికి గానీ, లేని అభిప్రాయాలను అంటగట్టి, తమ 'విప్లవ అవగాహన (లేక ఆచరణ)' అన్నదాని డొల్లతనాన్ని కప్పి పుచ్చుకోవాలని ప్రయత్నించటమే అధమ పద్ధతి.

జీవితమంతా ఉన్నత విలువలు నిలబెట్టుకుంటూ వచ్చిన సీనియరు జర్నలిస్టు వి.హనుమంతరావుగారి సంపాదకత్వంలో వస్తున్న పత్రిక పేజీలు ఇలా ఖరాబు కావడమే అత్యంత విచారకరమైన విషయం.

బ్రిటిష్ వలస దోపిడీ అవసరాల కోసమూ, పరిపాలన నిర్వహణ కోసమూ భారతదేశంలో ప్రవేశపెట్టిన పెట్టుబడిదారీ సంబంధాలు, మెకాలే విద్యా విధానాల ఫలితంగా భారత ప్రజలలో జాతీయ, ప్రజాస్వామిక ఆకాంక్షలు తలయెత్తాయి. మాతృభాషలో విద్యాబోధన, వ్యవహారిక భాషావాదమూ ఈ ఆకాంక్షల వ్యక్తీకరణలే. ఆంధ్రదేశంలో, జాతీయోద్యమ కాలంలోనూ, ఆ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమకాలంలోనూ ఇవి ఒకే

ఉద్యమంగా ముందుకొచ్చాయి. తెలుగువారి సాంస్కృతిక జీవనంపై ప్రభావాన్ని పడవేశాయి. మాతృభాషా ఉద్యమానికి రవిబాబు ఆద్యుడు కాదు. అది ఏ ప్రాంతీయ ఆకాంక్షలను అణగార్చడానికో వచ్చినదీ కాదు. గత ఉద్యమ కొనసాగింపు గానే జనసాహితి తన పుట్టుక నుండీ మాతృభాషలో విద్యాబోధన జరగాలన్న విధానాన్నే అనుసరిస్తున్నది.

తెలుగుభాషలో విద్యాబోధన సాగాలని స్పష్టంగా ప్రకటించడానికి 35 సంవత్సరాల కాలం తీసుకున్న సంస్థను పల్లెత్తుమాట కూడా అనకుండా మిన్నకుండడంలో రుక్మిణిగారికున్న విప్లవ అవగాహన ఏమిటో ఆమే చెప్పాలి. ఇతరులపై అపోహలను వెదికే పని మాని, విషయ పరిజ్ఞానం పెంచుకునే కృషి చేస్తే పదుగురికీ ఉపయోగపడుతుంది.

అజ్ఞానానికి అవధులుండవంటారు. అందుకనే రెండున్నర జిల్లాల గురించి మాట్లాడుతున్నారు. ఈ రెండున్నర జిల్లాల ఆధిపత్య భాష అన్నది ప్రజల భాష కాదు. ఆ ప్రాంతానికి ప్రత్యేక నుడికారమూ, మాండలీకమూ ఉన్నాయి. మా గోఖలే కథల్లో, ఇటీవలి మొలకలపల్లి కోటేశ్వరరావు నవలలో, పడమటిగాలి నాటకంలో దాని సొబగులూ, సౌకుమార్యాలూ తెలుస్తాయి.

శ్రమ నుండే మానవుడు జన్మించాడు. ఆ శ్రమే భాష పుట్టుకకూ, అభివృద్ధికీ కారణం. సమాజం పురోగమిస్తున్న కొలదీ, మానవ జీవన వ్యవహారాలు విస్తృతమవుతున్న కొలదీ, వాటిని ప్రతిధ్వనించవలసిన భాషకూడా అభివృద్ధి చెందుతుంది. కనుకనే భూస్వామ్య సమాజం కంటే పెట్టుబడిదారీ సమాజపు భాషా అవసరాలు ఎక్కువగా ఉంటాయి. పరభాషా పదాలను యిముడ్చుకోవడం, శాస్త్ర విజ్ఞానం కోసం ప్రత్యేక పారిభాషిక పదకోశాలు రూపొందించుకోవడం, ఉన్న పదానికే నానార్థాలు యివ్వడం వంటి పద్ధతులతో భాష పెరుగుతున్న అవసరాలను తీర్చుకుంటుంది. శ్రీశ్రీ చెప్పిన 'తవ్వోడ' వంటి పదాలు ప్రజల శ్రమ జీవనాన్నుండి పుట్టి భాషను పరిపుష్టం చేస్తాయి.

శాస్త్ర విజ్ఞానం పెరిగేకొద్దీ భాషను ప్రామాణీకరించాల్సిన అవసరం వచ్చింది. ఉదా : వృక్షశాస్త్రంలో స్పీసిసు, ఫైలాల పేర్లకు లాటిన్ పదాలను వాడారు. యూరోపియన్ భాషలన్నీ వీటినే వాడుకున్నాయి. తమ మాతృభాషలో విద్య నేర్చుకున్నా, మరో భాషను అవసరం మేరకు నేర్చుకుంటే శాస్త్రీయ విజ్ఞాన వినిమయానికి ఆటంకం లేకుండా పోయింది. మొదట తెలుగులో పాఠ్యపుస్తకాలను తయారుచేసినప్పుడు ఈ లాటిన్ పదాలకు సమానార్థక సంస్కృత పదాలు వాడే పని చేశారు. ఇదెంత కృతకంగా తయారైందంటే శ్రీశ్రీ ఉదహరించినట్లు సిగ్నలుకు 'ధూమనిర్ధూమ తైల శకట గమనా గమన సూచిక' అన్న స్థాయికి చేరింది. తీవ్ర విమర్శలు రావటంతో, ఇప్పుడు లాటిను పదాలనూ వాడుతున్నారు. భారతీయ భాషలు కూడా ఈ పద్ధతినే అనుసరిస్తే, ఎక్కడకు వెళ్ళినా శాస్త్ర పరిజ్ఞానాన్ని అందుకోవటానికి ఇబ్బందులెదురవవు. ఫ్రెంచి, జర్మన్, స్పానిష్, రష్యన్, జపనీస్ భాషలన్నీ ఈ పద్ధతుల ద్వారానే తమ తమ భాషలను అభివృద్ధి పరచుకున్నాయి. ఇంగ్లీషు భాష విజ్ఞానానికి కిటికీ అయిందనడం ఈ రీత్యా అతిశయోక్తి.

ఇంత వివరణ ఎందుకంటే, భాషా ప్రామాణీకరణ భాషాభివృద్ధిలో భాగమేనని చెప్పటానికి. క్లాసికల్ లాంగ్వేజ్ అన్న ఇంగ్లీషు పదానికి ప్రాచీన భాష అని వాడి (రుక్మిణిగారు కూడా ఇదే వాడారు) తగవులాడుకుంటున్న స్థితి నేడు చూస్తున్నాం. ఇలాంటి స్థితి ఏర్పడినప్పుడు గతంలో వార్తాపత్రికల సంపాదకులు సంప్రదించుకుని ఒక పదాన్ని ఖాయపర్చి ఆ నిర్దిష్ట సందర్భంలో ఆ పదానికి నిర్దిష్ట అర్థమిదని తెలిపేవారు. ఇప్పటివారికి ఆ తీరికా లేదు. ఓపికా లేదు. బడ్జెట్ వివరాలు తెలుపుతూ బడ్జెటరీ లోటు, ఫిస్కల్ లోటు, రెవెన్యూ లోటులకు రకరకాల పదాలను నేడు వాడుతున్నారు. ఏది దేనికి వాడుతున్నారో తెలియక ఇంగ్లీషు పత్రిక చూడవలసి వస్తున్నది. కనుక భాషా వినిమయంలో ప్రామాణీకరణ అవసరమవుతుంది. అలా ప్రామాణీకరించే ప్రయత్నాలలో భాగంగా వినిమయంలోకి వచ్చిందే రుక్మిణిగారంటున్న రెండున్నర జిల్లాల ఆధిపత్య భాష .

ఉద్ఘాటించారు, ఉద్ఘోషించారు వంటి పదాలు ఇతర ప్రాంతాలలోనే కాదు ఆ రెండున్నర జిల్లాల్లో కూడా ప్రజల వాడుకలో ఉండవు. వారికి అర్థమూ కావు. ప్రామాణీకరించటంలో లోపాలు జరిగాయి. అవి కొన్ని సందర్భాలలో పైన పేర్కొన్నట్లుగా కృతకస్థాయికీ చేరాయి. ప్రాచీనతకు బదులుగా వాడవలసిన సరైన పదమేమిటో నాకు తట్టడం లేదు. తెలంగాణా నుడికారాన్నీ, తెలంగాణా వాక్య నిర్మాణాన్నీ తాను కూడా అనుసరించలేకపోతున్నానని రుక్మిణిగారు వాపోవలసిన అవసరం లేదు. దానికి బదులుగా ప్రామాణీకరణలోని లోపాలను సరిదిద్దుకుని, వివిధ ప్రాంతాల నుడికారాలను వినియోగించుకునే కృషి అవసరం.

ప్రామాణిక భాష అన్నది స్థిరబిందువు కాదు. అది నిరంతరం అభివృద్ధి చెందేది. అదేసమయంలో సమకాలీనంలో వాస్తవ ఉనికిని కలిగి వుండేది. వైవిధ్యభరితమైన స్థానిక భాషా పద సముదాయాలు ఆ భాష యొక్క సంపద. సమాజం ఎంత చలనశీలమైతే ఆ సంపద యొక్క వినిమయం అంతగా పెరుగుతుంది. భాష మరింత సుసంపన్నమవుతూ వుంటుంది.

ఇక ఆధిపత్య భాష గురించి. దీనిని సమర్థించుకునేందుకు స్టాలిన్, గూగీ వంటి మహామహులందరినీ పేర్కొన్నారు. పరాయి వలస పాలకులు పూర్తిగా పరాయిభాషను అధికార భాషగా రుద్దారు. వలసాధిపత్య స్వభావమే అధికార భాషలోనూ వ్యక్తమైంది. అయినప్పటికీ పాలితుల గురించి తెలుసుకోకుండా పాలన సాధ్యపడదని తెలుసుకున్న పాలకులు పాలితుల భాషలను కూడా ప్రామాణీకరించే ప్రయత్నం చేశారు. (బ్రౌన్ తెలుగు నిఘంటువు తయారీ దీనిలో భాగమే. వ్యక్తిగతంగా బ్రౌన్ కృషిని ఎంతగానైనా పొగడవచ్చు. వలస పాలన పరిధిలోనే ఆ కృషి సాగింది) "రవి అస్తమించని" బ్రిటిష్ సామ్రాజ్యంలో ఇంగ్లీష్‌కు ఆధిపత్య స్వభావం వచ్చింది అది పాలక భాష కావటం వలన, ఆ భాషలో తప్ప విజ్ఞాన సముపార్జనకు అవకాశాలు లేకుండా చేయటం వలన. వ్యవస్థకున్న ఆధిపత్యంలో భాగంగా, భాషను ఆధిపత్య సాధనాలలో ఒకటిగా వాడుకొనగా. దానిని భాషకే ఆధిపత్య స్వభావం ఉన్నట్లుగా రుక్మిణిగారు చెప్పటం, గూగీకి అన్యాయం చెయ్యటమే. ఇది పాత వాదనే. హిందీని దేశ అధికారభాషగా చెయ్యాలన్న వాదనను వ్యతిరేకించేవారు "హిందీ సామ్రాజ్యవాద"మంటూ నినదించారు. ఇది భాషోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు తోడ్పడుతుంది తప్ప మాతృభాషను నిరంతరం అభివృద్ధి పరచుకోవాల్సి ఉంటుందన్న, మాతృభాషలోనే సకల వ్యవహారాలూ నిర్వహించాలన్న సమగ్ర అవగాహనను ప్రజలకు అందించదు. భాషకు వర్గ స్వభావం ఉండదని స్టాలిన్ నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పారు.

ఈ సమగ్ర దృష్టి లోపించినందువల్లనే రుక్మిణిగారు అధికార భాష కావాలనడం అప్రజాస్వామిక మంటూనే ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించమని అడగకపోవడం అప్రజాస్వామికం అంటున్నారు.

(మిగతా 42వ పేజీలో)

చిదంబరానికి జేజేలు, సామాన్యులకు బేబేలు

వి. హనుమంతరావు

కేంద్రబడ్జెట్

అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు కూతవేటు దూరంలో వుండగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అటు సంపన్నులకు, ఇటు సామాన్యులకు "నొప్పింపక తానొవ్వక' అనే ధోరణిలో వుండడంలో ఆశ్చర్యపడాల్సినదేమీ లేదు. ప్రాథమిక సమస్యలను పక్కనపెట్టి, సామాన్యుల ఓట్లను ఆకర్షించే కేటాయింపులు చేసి ఒకపక్క, మరోపక్క నిజమైన ప్రోత్సాహకాలు ప్రకటించి, ఎన్నికల నిధులను విస్తారంగా రాబట్టుకోవడానికి కార్పొరేట్ రంగాన్ని సంతృప్తి పరిచే ధోరణి 2006-07 బడ్జెట్‌లో స్పష్టంగా కనుపిస్తుంది. ఆవిధంగా ఈ బడ్జెట్ కేవలం ఆదాయ వ్యయాల పట్టిక మాత్రమే కాదు; ఇదొక రాజకీయ బడ్జెట్. దేశ ఆర్థికపరిస్థితి మెరుగుపడిందనేది అక్షరాలా ఎంత నిజమో, సామాన్యుడు ఈ బడ్జెట్‌లో చేసిన కేటాయింపులతో బాగుపడతాడనేది అక్షరాలా అంతే పెద్ద అబద్ధం. ఆర్థికమంత్రి చిదంబరం దేశ ఆర్థికపరిస్థితిని చక్కగా మానేజ్ చేయటం వల్లనే దేశం ప్రగతిపథాన పయనిస్తోందని, ఆయన శక్తియుక్తులకు నీరాజనాలు పడుతున్నారు. అదెంత నిజమో, ఈకింద ఉదహరించిన కొద్ది గణాంకాలు తెలియజేస్తాయి.

- పన్ను బకాయిలు రూ. 1,11,107 కోట్లు ; ఇందులో పదికోట్ల రూపాయలపైన పన్ను బకాయిలన్నీ 852 కేసుల్లో ఇరుక్కున్న బాకీ రు. 71,116 కోట్లు. అంటే మొత్తం బకాయిల్లో సగంపైన (64 శాతం) కేవలం 852 మంది నుంచే రావాల్సివుందంటే ఎంత పెద్ద చేపలు వలలో పడకుండా తప్పించుకుంటున్నాయో, ఆర్థికమంత్రి ఎంత సమర్థంగా ఆర్థికశాఖను నడిపిస్తున్నారో తెలుస్తుంది.
- ప్రోత్సాహకాలు, మినహాయింపులు, తగ్గింపులు, వాయిదాల రద్దుల వల్ల ఒక్క 2004-05 సంవత్సరంలోనే ప్రభుత్వం రు.1,58,661 కోట్లు ఆదాయం కోల్పోయింది. ఈ మినహాయింపులు రద్దు చేయాలని కేల్కర్ కమిటీ, పార్థసారథి షోయ్ కమిటీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ నలహాలిచ్చాయి. కాని ఈ నలహాలు చెత్తబుట్టలోకి చేరాయి.
- బ్యాంకులకు సంపన్నులు ఇవ్వతేలిన మొండిబాకీలు రు. లక్ష కోట్లు.
- 648 ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన సమయంలో పూర్తి చేయలేకపోవటం వల్ల, వేసుకొన్న అంచనాకు మించి ఖర్చు చేయటం వల్ల పెరిగిన ఖర్చు రు. 26820 కోట్లు.
- వ్యవసాయానికిస్తున్న సబ్సిడీల పెరుగుదల మీద దాడి చేయని పాలకులు, అర్థశాస్త్రవేత్తలు లేరు. (సబ్సిడీ సుమారు 46వేల కోట్లు) కాని ఈ సబ్సిడీలో అత్యధికభాగం గోదాములు, ప్రొక్యూర్‌మెంటు మీద అవుతున్న ఖర్చు. అలాగే కోట్ల రూపాయల ఎరువుల సబ్సిడీలు కూడా ఎరువుల కంపెనీలకే ముడుతున్నాయి.
- గత సంవత్సరం బడ్జెట్‌లో సునామీ బాధితుల సహాయార్థం పదివేలకోట్లు కేటాయిస్తే ఖర్చు చేసింది కేవలం రు. 950 కోట్లు. బడ్జెట్‌కు ఏమైనా పవిత్రత వుందా చిదంబరంజీ ?
- అలాగే విద్య కోసం కొత్తగా సెస్ విధించి, ఆ వసూళ్ళను విద్యాభివృద్ధికి పూర్తిగా ఖర్చు చేయకుండా జనరల్ బడ్జెట్ పులుసులో పడేశారు.
- జిడిపి ఎనిమిది శాతం పెరుగుతుందని గెంతులేస్తున్నారు. కాని ఖనిజాలు, వ్యవసాయం లాంటి రంగాల పెరుగుదల అయిదు శాతానికి లోపే ; వ్యవసాయమైతే 2.3 శాతం మాత్రమే. ఇది కూడా చిదంబరం సామర్థ్యం వల్లనేనా ?
- దేశంలో 18-35 మధ్య వయసున్న గల యువతీయువకులు 25 కోట్లమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుతెన్నులు చూస్తుంటే, నంవత్సరంలో నూరురోజుల ఉపాధి పథకం కింద ఎంతమందికి ఉపాధి కల్పిస్తున్నారండీ?
- జిడిపిలో సేవల రంగం వాటా 50 శాతంపైనే, కాని ఆ రంగం నుంచి వచ్చే పన్ను అనండి, యూజర్ ఛార్జీల నుండి 13.5 శాతం మాత్రమే.

ఇలా ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. ఇవన్నీ ఆర్థికమంత్రికి తెలియవనుకోలేం. బహుశా మీకు తెలియకపోవచ్చు. చిదంబరం సామర్థ్యం అపారం. కాని ఆ సామర్థ్యం మన ఖజానాకు నష్టం కలిగిస్తుందనేది, కార్పొరేట్ రంగానికి, సంపన్నులకు లాభాలు తెచ్చిపెడుతుందనేది, సామాన్యుని నెత్తిన శఠగోపం పెడుతుందనేదే మనం గమనించాల్సిన విషయం.

బడ్జెట్ లోటు, ద్రవ్యలోటు, ఆదాయ వ్యయాలెంత అనేలాంటి విషయాల గురించి దినపత్రికల్లో చదివే వుంటారు. కాబట్టి వాటి జోలికి పోవడం లేదు. అయితే, జిడిపి పెరుగుదల, సెన్సెక్స్ పెరుగుదల లాంటి విషయాల ఆధారంగా ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని అంటున్నారు కాబట్టి, వాటిని కాస్త తడిమి చూడాలనిపిస్తుంది. జిడిపి పెరుగుదల కలిగించే ఆనందం అటు

పాలకులకు, ఇటు ఉన్నతాదాయవర్గాలకు మాత్రమే పరిమితమైంది. డెబ్బై శాతం ప్రజలు నివసించే గ్రామీణ ప్రాంతాల్లో అదేమిటో కూడా వారికి తెలియదు. పట్టణాల్లో ఉన్నతోద్యోగులు, సి.ఇ.వో.ల జీతాలు 1.5 శాతం చొప్పున పెరుగుతున్నాయి. ప్రపంచంలో ఇంత వేగంగా జీతాలు పెరిగిన దేశం మరొకటి లేదు ఐ.ఐ.ఎమ్ గ్రాడ్యుయేట్ రోజుకు రు.5000 చొప్పున 365 రోజులు సంపాదిస్తే ఏడాదిలో నూరురోజులకు మాత్రమే రోజుకు రు.50లు ఇచ్చి ఏదో విప్లవం తెచ్చేసినంత హడావుడి చేస్తోంది. అందుచేత జిడిపి పెరుగుదల ఆరు, ఏడు శాతం నుంచి ఎనిమిది శాతానికి పెరిగినా, రేపు పదిశాతానికి పెరుగుతుందన్నా, వారికి అదో బ్రహ్మపదార్థంగానే వుండిపోతోంది. నిర్లిప్తంగానే ఉండిపోతున్నారు. ఈ సంవత్సరం జిడిపి ఎనిమిది శాతం పెరగవచ్చు కాని పదవ ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాల సగటు ఏడు శాతం మాత్రమే. ఈ సంవత్సరంలో పదవ ప్రణాళిక ముగుస్తుంది. పదవ ప్రణాళిక లక్ష్యం ఎనిమిది శాతం. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే పెట్టుబడుల పెరుగుదల రేటు 40 శాతం వుండాలని ఆర్థిక శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇపుడు 31 శాతం మాత్రమే వుంది. ఇది సాధ్యమవుతుందా? జిడిపి పెరుగుదల రేటులో మరో తిరకాసు వుంది. జిడిపిలో వ్యవసాయం, పరిశ్రమ రంగాల శాతం ఎంత వుందో, సేవల రంగం నుంచి ఆదాయం అంతే వుంది. ఆ రంగమే ముందుకు పోతోంది. మొదటి రెండు రంగాల పెరుగుదలే నిజమైన పెరుగుదలను సూచిస్తాయి. సేవల రంగం కాదు. కాగా జిడిపి పెరుగుదల వాపే కాని బలుపు కాదు. అలాకాక సేవల రంగం సుమారుగా ప్రయివేటు రంగంలో వుంది. అలాంటప్పుడు జిడిపి పెరుగుదల అంతా తన మెహర్బానీగా ప్రభుత్వం టాంటాం చేసుకుంటుందెందుకు? అలాగే సెన్సెక్స్ పదివేలు దాటడంలో అది ఆర్థికశాఖ వృద్ధికి సూచనగా ప్రభుత్వం సంతృప్తిని వ్యక్తం చేయడం విడ్డూరం. సెన్సెక్స్ అనేది 30 కంపెనీల షేర్ల మార్కెట్ లావాదేవీల మీద ఆధారపడిన సూచి. అంటే ప్రభుత్వ దృష్టిలో దేశ భవిష్యత్తును 30 కంపెనీల షేర్ల విలువ నిర్ధారిస్తుందా?

ఈ వ్యాసం రాస్తుండగా ఒక మిత్రుడు వచ్చినపుడు జిడిపి ప్రస్తావన వచ్చింది. మన దేశం అభివృద్ధిని కొలవడానికి మన సొంత ఆర్థిక కొలబద్దలు ఎందుకు రూపొందించుకోకూడదు ? జిడిపి దారినే ఎందుకు ప్రయాణించాలి? బాగా అభివృద్ధి చెందిన దేశాలు, దారిద్ర్యాన్ని అదుపులో పెట్టిన చిన్న దేశాలకు ఆ కొలబద్ద వర్తిస్తుందేమోకాని భారతదేశం లాంటి విశాల దేశానికి అది వర్తించదేమో అని అన్నాడు. వివిధ స్థాయిల్లో అభివృద్ధి చెందిన, చెందని రాష్ట్రాలు, వివిధ వర్గాల మధ్య అంతరాలు, ఒక పక్క కోట్లు సంపాదించేవారు, మరొకపక్క పేదరికపు రేఖ కింద నివసించేవారు - ఇలా ఎత్తుపల్లాలున్న ఆర్థిక వ్యవస్థ. ఆ అంతరాలను గమనంలోకి తీసుకునే కొలబద్ద వేరే ఉండాలంటాడు. విదేశీ సంస్థలు ఈ దేశంలో పెట్టుబడులు పెట్టి, పరిశ్రమలు స్థాపించి చుట్టుపక్కదేశాలకు ఎగుమతి చేస్తుంటే, ఆ ఉత్పత్తుల విలువ మన జిడిపిలో ఎందుకు కలపాలి? అది మన దేశ సంపద కాదు కదా! జిడిపిని తలసరి ఆదాయంగా మార్చినపుడు ఆ అంకె ఎంత విడ్డూరంగానో వుంటుంది. ఉదాహరణకు మన రాష్ట్రం సగటున తలసరి ఆదాయం సుమారు రు.20,000 పైనే చెప్పినట్లు ఒకపక్క కోట్లకు పడగలెత్తిన వారు, మరోపక్క పొద్దున తింటే సాయంత్రం పస్తులుండే దేశంలో సగటు ఆదాయం లెక్కేమిటి ? అందులోనూ తామరాకు మీద నీటి బొట్టులా వుండే సెన్సెక్స్ దేశాభివృద్ధికి దిక్సూచా? పాలకుల ఆలోచనలు ఎంత పతనస్థాయికి చేరుకొన్నాయి! బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్ మార్గంలో భారత ప్రభుత్వం పయనిస్తున్నట్లుది. ఆమె విధానాలనే ఆదర్శంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లుంది. ఆమె ఏమైందో మనందరికీ తెలుసు కదా!


వ్యవసాయం :

బడ్జెట్ గణాంకాల ప్రకారం ప్రస్తుతం వ్యవసాయరంగం పెరుగుదల 0.7 శాతం నుండి 2005-06లో 2.3 శాతానికి చేరుకుంది. ఈ పెరుగుదల కూడా వ్యవసాయ శాఖ మెహర్బానీ ఏమీకాదు. వర్షాలు బాగా కురవడం వల్లనే అనేది విదితం. ఈ శాతం నాలుగుకు పెరిగితేనే, జిడిపి 10 శాతం పెరుగుదల సాధ్యం కాదని ఆర్థికమంత్రే అంటున్నారు. ఈ నాలుగు శాతం పెరగడానికి కూడా ఒక షరతు వుంది. వ్యవసాయంలో పెట్టుబడులు పెరక్కపోతే స్థిరంగా ఆ నాలుగు శాతం కూడా సాధ్యం కాదు. 2.3 శాతం పెరుగుదల సాధించామని గొప్పగా డప్పు కొట్టుకుంటున్నారు కాని, జనాభా కూడా సుమారుగా ఆ శాతం మేరకు పెరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకుంటే, ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉందన్నమాట.

ఉద్యోగాలు :

నిరుద్యోగ భూతం 25 కోట్ల మంది యువతను వెన్నాడుతుంటే, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీల్లో నాలుగుకోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే, ఉన్న నిరుద్యోగులు చాలదన్నట్లు శ్రమజీవుల సంఖ్య పెరుగుతూంటే చిదంబరం బడ్జెట్లో, నూరురోజుల ఉపాధి పథకం తప్ప వారి గురించిన ఒక్కమాట కూడా లేదు. ఆ పథకం కూడా నెత్తిన తట్టపెట్టుకొని మోసేవారికే పరిమితమైంది. విద్యావంతులైన యువతీయువకులేమి కావాలి? ఐ.టీ. రంగం గురించి లేనిపోని ఆశలు కల్పిస్తున్నారు. ఆ రంగం వ్యవసాయ వ్యవహారాల గురించి కేంద్రం ఏర్పాటు చేసిన కమీషన్ అధ్యక్షులు ఎం.ఎస్.స్వామినాథన్ ప్రభుత్వానికి చేసిన సిఫార్సుల్లో వెంటనే రుణభారం తగ్గించాలని, వడ్డీ రేటు నాలుగుశాతం వుండాలని, ధరల స్థిరీకరణకు ఒక నిధి ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలాంటి ప్రాథమిక మార్పులు తీసుకొని రావాలంటే కొంత సమయం కావాలని ప్రభుత్వం అంటే అర్థం చేసుకోవచ్చు. కాని కార్పొరేట్ రంగం ముద్దుబిడ్డ చిదంబరం తన ఉపన్యాసంలో దాని ఊసు కూడా ఎత్తలేదు. వ్యవసాయానికి ఎత్తెత్తు పీటలు వేసుకుంటున్నారు. ఇదేనా? అలాగే వ్యవసాయం మీద ఆదాయం పన్ను విధించే విషయం 1975లో కె.ఎన్.రాజ్

కమిటీ సిఫార్సు చేసినప్పటి నుంచి చర్చల్లో నానుతూనే ఉంది. దానిగురించి ప్రస్తావన వస్తే, అది రాష్ట్రాలకు సంబంధించిన విషయమని, రాష్ట్రాలే నిర్ణయించాలని కేంద్రం తప్పించు కొంటూంది. ఏ పంట ఎంత పండించాలో ఆ పంటల ధర ఎంత ఉండాలో, ఎరువుల మీద ఎంత సబ్సిడీ ఉండాలో, ఎగుమతి చేయవచ్చునో లేదో అనే విషయాలన్నింటి మీద కేంద్రం నిర్ణయాలు చేయడం లేదు? ఎన్ని విషయాల మీద కేంద్రం రాష్ట్రాల మెడలు వంచి నిర్ణయాలు తీసుకోవడం లేదూ? అందులోనూ దీనిమీద నిర్ణయం ఆదాయ వనరులను పెంచుకోవడానికి కూడా తోడ్పడుతోంది కదా. ఈ కోణం నుంచయినా ఆర్థిక మంత్రి స్పందించే నిర్ణయాన్ని వేగిరపరచాలి. ఇకపోతే భూసంస్కరణల సమస్య రావణాసురుని కాష్టంలా కాలుతూనేవుంది. ఈ సంస్కరణలు అమలుపరిస్తే గ్రామీణ ప్రజల ఆదాయం పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. పారిశ్రామిక ఉత్పత్తులకు మార్కెట్ ఏర్పడుతోంది. సరే, రైతులు ఉత్పత్తి చేస్తారు ఫుడ్ కార్పొరేషన్ తిండి గింజలను సేకరిస్తుంది. వాటికి గిట్టుబాటు ధరను నిర్ణయించడానికి గింజుకునే ప్రభుత్వం, తానే నిర్ణయించిన కనీస ధరకన్నా తక్కువ రేటుకు విదేశాలకు ఎగుమతి చేస్తుందా? (గత ఏడు సంవత్సరాల్లో మొదటిసారిగా దిగుమతి చేసుకోవాల్సిన దుర్గతి పట్టింది.) రెండో మూడో సంవత్సరాల క్రితం ఆరుకోట్ల టన్నుల ఆహారధాన్యాల నిల్వలు పేరుకుపోయాయని గోలగోల చేసిన ప్రభుత్వం ఇపుడు తిండి గింజల కనీస నిల్వలు లేవని గోధుమలను దిగుమతి చేసుకొంటుందా? చిదంబరం ఎంత సమర్థవంతంగా పని చేస్తున్నాడో చూశారా?



ఇప్పటివరకూ ఉపాధి కల్పించిన వారి సంఖ్య మొత్తం శ్రమజీవుల్లో 0.2 శాతానికి మించలేదంటే, ఈ సంఖ్య ఎన్ని వందల, వేల రెట్లు పెరిగినా అందరికీ ఉపాధి కల్పిస్తుందా ? కార్మిక సంస్కరణల పేరుతో ఉన్నవారి ఉద్యోగాలనే హరిస్తుండగా, ఆ సంస్కరణలు సత్వరం అమలు జరపాలని, ఇటు కార్పొరేట్ రంగం, అటు ప్రపంచబ్యాంకు ప్రభుత్వం నెత్తిన ఎక్కి సవారీ చేస్తుంటే యువతకు భవిష్యత్తు వుందని నమ్మబలకడం వారిని వంచించడమే అవుతుంది. కార్మికుల విషయానికొస్తే కార్పొరేట్ రంగం కార్మికులకు చెల్లించే మొత్తం ఉత్పత్తి విలువలో 00-01లో 9.54 శాతం నుండి 2004-05లో 8.13 శాతానికి పడిపోయిందని, అందువల్ల ఒక్క 2004-05 లోనే కార్పొరేట్ రంగానికి రు. 127 కోట్లు లభించాయని, ఇలా పెరిగిన మొత్తం ఆ ఏడాది కార్పొరేట్ సంస్థల లాభాల్లో 0.53 శాతం అని 'బిజినెస్ స్టాండర్డ్' పత్రిక ప్రచురించిన ఒక అధ్యయనం తెలియచేస్తోంది. కార్పొరేట్ రంగం కార్మికుల మీద ఎందుకు కత్తి దూస్తుందో ఈ అధ్యయనం వెల్లడి చేస్తుంది. ఆ కార్పొరేట్‌రంగం కొమ్ము కాస్తున్న చిదంబరం బడ్జెట్ ఉపన్యాసంలో కార్మికుల పరిస్థితుల గురించి పల్లెత్తు మాట ఎందుకు అనలేదో తెలుస్తూనే ఉంది. కనీస ఉమ్మడి కార్యక్రమం అమలు పరిచే తీరు ఇదన్నమాట. పెరుగుదల అనండి, అభివృద్ధి అనండి, పెట్టుబడి ఆధారితం మాత్రమేకాక కార్మిక శక్తి ఆధారితం కావాలని నేనటం లేదు. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రకారం విధానాలు కార్మికులకు ఉపాధి కల్పించేవిగా, అసమానతలను తగ్గించేవిగా ఉన్నపుడే ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, అలాంటి విధానమే పేదలను ఉద్ధరిస్తుందని పేర్కొంది.

కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థలు చిదంబరం బడ్జెట్‌కు జేజేలు ఎందుకు చెబుతున్నాయో, పై విశ్లేషణ తేటతెల్లం చేస్తుంది. తూర్పు ఆసియా దేశాలను కూడా 90వ దశకంలో ఇవే బహుళజాతి సంస్థలు భేష్ అంటే భేష్ అన్నాయి. కాని 1997లో టాపేరం లేచిపోయింది. ఏషియన్ టైగర్స్ అంటూ కొన్నాళ్ళు మోతమోగిపోయింది. ఇపుడు ఆ మాటే వినరావడం లేదు. చిదంబరం భవిష్యత్తు మరోలా వుండబోదు.

చిదంబరం అభివృద్ధి శంఖాన్ని గట్టిగా ఊదటం వెనుక నున్న చిదంబర రహస్యం ఏమంటే ఆర్థిక పరిస్థితి ఆయన చెబుతున్నంత పాలు, తేనె వ్యవహారంగా లేదు. ఎట్టిపరిస్థితుల్లోనూ వాయిదా వేయలేని ఖర్చులు మూడు లక్షల కోట్లు తినేస్తున్నాయి. రక్షణ రు.89,000, పోలీసు రు.13,680, పింఛన్లు రు.21,312, సేవలు రు.11,779, వడ్డీ చెల్లింపులు రు.1,39,823, సబ్సిడీలు 46,215 (అన్నీ కోట్ల రూపాయలు) మొత్తం 3,21,809 కోట్లు. ఇది మన రెవెన్యూ ఆదాయంలో 75 శాతం. విదేశీ రుణాలు లక్షా ఇరవైనాలుగు వేల కోట్లు. దేశంలో చేసే అప్పులు అదనం. అప్పు చేయనిదే అడుగు ముందుకు వేయలేని స్థితి. ఇంకెక్కడి అభివృద్ధి? ❑

చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. అంటే ఏ నెల సంచిక ఆ నెల మొదటి వారానికల్లా పాఠకులకు చేరుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారం లోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు. మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

- సర్క్యులేషన్ మేనేజర్

కేంద్రబడ్జెట్ 2006-07

ఎన్.శ్రీదేవి

కేంద్ర ఆర్థికమంత్రి 28 ఫిబ్రవరి 2006న 2006-07 ఆర్థిక సంవత్సరానికి గాను, ఆర్థిక బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రతిపాదించారు. వివరాల్లోకి వెళితే రైతులకు 7శాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు, గ్రామీణ ఉపాధికి రు.11,700 కోట్లు, గ్రామీణ ఆరోగ్యానికి రు.8207 కోట్లు, వృద్ధాప్య పింఛన్ల పెంపు, మౌలిక రంగాలకు భారీగా కేటాయింపులు, బడుగు వర్గ బాలికలకు ప్రత్యేక డిపాజిట్ స్కీమ్ - ఇలా సాగింది ఆయన ప్రసంగం.

ఇక ఆదాయ సమీకరణ విషయానికొస్తే - ఆదాయం పన్నుల్లో (వ్యక్తిగత, కార్పోరేట్) మార్పులేదు. అనేక వస్తువుల మీద కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలను తగ్గించారు. ఇందులో ఆశ్చర్యపడవలసిన విషయం ఏమీలేదు. ప్రతి ఏడాది జరుగుతున్న తంతే ఇది. సర్వీసు టాక్స్ రేట్ పెంచడం, ఇంకొన్ని సర్వీసులను పన్ను పరిధిలోనికి తేవడం కూడా ఆకస్మిక చర్యకాదు. ఎటొచ్చి ఈ పన్ను పరిధిని పన్నురేటును ఉన్న ఫళంగా 10శాతం నుండి 12శాతం పెంచడం ప్రజలకు ఊపిరి ఆడని పరిస్థితి.

ఈ ఆదాయ వ్యయాల ప్రతిపాదన మధ్యనున్న వ్యత్యాసమే రెవిన్యూలోటు, ద్రవ్యలోటు వగైరా. 2006-07 సంవత్సరానికి గాను రెవిన్యూ లోటును రు.84,727 కోట్లుగాను, ద్రవ్యలోటు రు.1,48,686 కోట్లగాను అంచనావేశారు. ఈ రెండూ జి.డి.పి.లో 2.1 శాతం, 3.8శాతంగాను ఉంటుందని కూడా అంచనా వేశారు.

రెవిన్యూ లోటును, ద్రవ్యలోటును క్రమంగా తగ్గించగల్గుతున్నామని కేంద్రమంత్రి సంతోషం వ్యక్తం చేశారు కూడా. ప్రస్తుత సంవత్సరంలో ఈ రెండింటిని అంకెల్లోనూ, జి.డి.పి.లోనూ, వీటి శాతంలోనూ కూడా తగ్గించినట్లు పేర్కొన్నారు. దీనికి కారణం తమ ఆర్థిక క్రమశిక్షణ అని అన్నారు. ఈ సందర్భంగా ఈ అపరచాణుక్యుని కౌశలంపై ఉత్సుకత కలిగినవారికి ఇంకొన్ని వివరాలు

పట్టిక - 2 రెవెన్యూ ఖర్చు : బడ్జెట్ - సరిచూసిన అంచనాలు 2005-06 (రు.కోట్లలో)

		బడ్జెట్ అంచనా 2005-06	సరిచూసిన అంచనా 05-06	పెరుగుదల/ తగ్గుదల	పెరుగుదల/ తగ్గుదల శాతం
1	2	3	4	5	6
	రెవెన్యూ ఖర్చు (ఎ+ బి+సి+డి+ఇ+)	**446512.10**	**440295.14**	**-6216.96**	**-1.39**
ఎ	సాధారణ సేవలు	223697.99	221188.46	-25.9.53	-1.12
బి	సామాజిక సేవలు	31713.67	34512.27	2798.60	8.82
సి	ఆర్థిక సేవలు	108266.67	107876.16	-390.51	-0.36
డి	సహాయనిధి	80053.02	73926.79	-6126.23	-7.65
ఇ	కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయనిధి	2780.75	2791.46	10.71	0.39
	కాపిటల్ ఖర్చు (ఎ+ బి+సి+డి+)	**62180.03**	**56993.59**	**-5186.44**	**-8.34**
ఎ	సాధారణ సేవలు	37716.91	35945.21	-1771.70	-4.70
బి	సామాజిక సేవలు	762.57	811.82	49.25	6.46
సి	ఆర్థిక సేవలు	23352.91	19962.83	-3390.08	-14.52
డి	కేంద్రపాలిత ప్రాంతాలపై ఖర్చు	347.64	273.73	-73.91	-21.26
	మొత్తం రెవెన్యూ, కాపిటల్ ఖర్చు	**508692.13**	**497288.73**	**-11403.40**	**-2.24**
	రుణాలు, అడ్వాన్సులు	**5651.67**	**11416.64**	**5764.97**	**102.00**
	రెవెన్యూ ఖర్చు + కాపిటల్ ఖర్చు + రుణాలు, అడ్వాన్సులు	**514343.80**	**508705.37**	**-5638.43**	**99376**
	ద్రవ్యలోటు	**151144.00**	**146175.00**	**-4969.00**	**-3.29**
	రెవెన్యూ వసూళ్లు	**351200.00**	**348474.00**	**-2726.00**	**-0.78**
	రుణాల వసూళ్లు	**12000.00**	**14056.00**	**2056.00**	**17.13**
	మొత్తం ఖర్చు	**514344.00**	**508705.00**	**-5639.00**	**-1010**

మూలం : వ్యయ బడ్జెట్, సంపుటి 1, భారత ప్రభుత్వం, 2006-07

పట్టిక - 1 బడ్జెట్ - సరిచూసిన అంచనాలు 2005-06 : రెవిన్యూ ఖాతా (రు.కోట్లు)

	మొత్తం రెవెన్యూ వసూళ్లు	మొత్తం రెవెన్యూ ఖర్చు	రెవెన్యూ లోటు
(1)	(2)	(3)	(4)
2005-06 (బడ్జెట్ అంచనా)	351200	446512	95312
2005-06 (సరిచూసిన అంచనా)	348474	440295	91821
తేడా	2726	6217	3491
బడ్జెట్ అంచనా మార్పు శాతం	0.77	1.39	3.66
2006-07 (బడ్జెట్ అంచనా)	403465	488192	84727

(మూలం : బడ్జెట్ : ఆదాయం, వ్యయాలు సంపుటి 1, భారత ప్రభుత్వం, 2006-07)

తెలుసుకోవాలనిపించడం సహజం. కొన్ని ముఖ్యమైన వివరాలను పట్టికలలో పొందుపరచడమైనది.

రెవెన్యూ ఆదాయంలో తగ్గుదల కంటే రెవెన్యూ ఖర్చులో తగ్గుదల ఎక్కువ ఉన్నందున రెవెన్యూ లోటును బడ్జెట్ ప్రతిపాదన (రు.95,312 కోట్లు) కంటే సవరించిన ప్రతిపాదన (రు.91,821 కోట్లు) తక్కువగా కనిపిస్తోంది. (పట్టిక 1)

స్థూలంగా చూస్తే జనరల్ సర్వీస్‌లోను, ఎకనామిక్ సర్వీస్‌లోను రెవెన్యూ ఖర్చు ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలకన్నా సవరించిన అంచనాల్లో తక్కువగా ఉంది (పట్టిక 2) కేంద్రం నుండి వచ్చే గ్రాంట్లలోనూ ఈ తగ్గింపు భారీగా కనబడుతుంది. క్యాపిటల్ వ్యయంలోనూ ఇదే తీరు. (కాని సాంఘిక సర్వీసుల్లో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. అభిలషణీయమే కదా!)

రెవెన్యూ ఖర్చు తగ్గించడం అన్నది హర్షించదగ్గ విషయం అయినా ఏయే విషయాల్లో ఖర్చు తగ్గిస్తే లోటు తగ్గించుకో గలుగుతున్నాం అన్నది ప్రశ్న.

రెవెన్యూ పద్దులోని వివరాలు:

ఇంకొన్ని వివరాల్లోకెళితే ఏయే విషయాల్లో రెవెన్యూ ఖర్చు తగ్గించారు (పట్టిక 3 ఆరవ కాలమ్ వరకు) ఏయే విషయాల్లో రెవెన్యూ

పట్టిక - 3 రెవెన్యూ ఖర్చు: బడ్జెట్ - సరిచూసిన అంచనాలు 2005 - 06

1	2	3*	4*	5*	6*	7*	8*	9*
ఎ.	సాధారణ సేవలు	133944.86	130031.86	3913	2.92	139822.6	104.39	107.53
	1. వడ్డీ చెల్లింపులు	133944.86	130031.86	3913	2.92	139822.6	104.39	107.53
బి.	సామాజిక సేవలు	**12106.86**	**10801.86**	**1305.53**	**10.78**	**12771.03**	**105.49**	**118.24**
	1 సాంకేతిక విద్య	1570.71	1390.83	179.88	11.45	1681.39	107.05	120.89
	2 క్రీడలు, యువజన సేవలు	426.68	395.13	31.55	7.39	551.02	129.14	139.45
	3 కళ - సంస్కృతి	734.02	614.79	119.23	16.24	712.08	97.01	115.82
	4 వైద్యం - ప్రజారోగ్యం	3389.61	3238.58	151.03	4.46	4018.97	118.57	124.10
	5 నీళ్లు - పారిశుధ్యం	2197.46	2120.96	76.5	3.48	2451.08	111.54	115.56
	6 హౌసింగ్	3075.2	2991.45	83.75	2.72	3112.93	101.23	104.06
	7 పట్టణాభివృద్ధి	713.18	49.59	663.59	93.05	243.56	34.15	491.15
సి	ఆర్థిక సేవలు	**73262.58**	**68497.86**	**4764.72**	**6.50**	**79643.47**	**108.71**	**116.27**
	1 వ్యవసాయ, అనుబంధ సేవలు	39080.68	36490.86	2589.82	6.63	39714.76	101.62	108.83
	2 ప్రత్యేక కార్యక్రమాలకు	8744.84	8741.88	2.96	0.03	10396.58	118.89	118.93
	3 నీటి పారుదల, వరద నివారణ	409.56	376.91	32.26	7.97	436.63	106.61	115.84
	4 రవాణా	12679.83	12493.57	186.26	1.47	16640.49	131.24	133.19
	5 సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం	7782.46	6991.72	790.74	10.16	8954.85	115.06	128.08
	6 సాధారణ ఆర్థిక సేవలు	4565.21	3402.92	1162.29	25.46	3500.16	76.67	102.86
డి	సహాయనిధి - విరాళాలు	**80053.02**	**73926.79**	**6126.23**	**7.65**	**86273.5**	**107.77**	**116.70**
	రాష్ట్రప్రభుత్వాలకు సహాయనిధి	77274.53	70971.14	6303.39	8.16	83097.66	107.54	117.09
ఇ	మొత్తం (ఎ+ బి+సి+డి)	**299367.32**	**283257.84**	**16109.48**	**65.38**	**318510.6**	**106.39**	**112.45**

3* బడ్జెట్ అంచనా 2005-2006 4* సరిచూసిన అంచనా 2005-2006 5* బడ్జెట్ తగ్గుదల (కాలమ్ 3-4) 6* తగ్గుదల శాతం కాలమ్5/ కాలమ్3
7* బడ్జెట్ అంచనా 2006-2007 8* కాలమ్ 7 : కాలమ్ 3 శాతం 9* బ.అం. 2006-07 : స.అం. 2005-2006 శాతం

పట్టిక - 4

రెవెన్యూ ఖర్చు : బడ్జెట్, సరిచూసిన అంచనాలు 2005-06								
1	2	3	4	5	6	7	8	9
ఎ	సాధారణ సేవలు	**41128.27**	**42531.74**	**1403.47**	**3.41**	**45526.44**	**110.69**	**107.04**
	1 రాష్ట్ర విభాగాలు	1996.31	2097.08	100.77	5.05	2407.38	120.59	114.80
	2 పన్ను వసూళ్లు	2986.05	3054.47	68.42	2.29	3385.16	113.37	110.83
	3 ఇతర ద్రవ్యసేవలు	-20.06	155.49	175.55	-875.12	58.85	-293.37	37.85
	4 పరిపాలనా సేవలు	16738.51	17130.08	391.57	2.34	18454.76	110.25	107.73
	5 పింఛన్, సంగీతం, సాధారణ సేవలు	19427.46	20094.62	667.16	3.43	21220.29	109.23	105.60
బి	సామాజిక సేవలు	**18387.39**	**22395.81**	**4008.42**	**21.80**	**25983.5**	**141.31**	**116.02**
	1 విద్య	13138.21	13342.03	203.82	1.55	18670.26	142.11	139.94
	2 కుటుంబ సంక్షేమం	2272.07	2964.45	692.38	30.47	4018.62	176.87	135.56
	3 సమాచార విస్తరణ	243.78	246.94	3.16	1.30	254.13	104.25	102.91
	4 ఎస్సి, ఎస్టీ, బీసీల సంక్షేమం	148.16	164.45	16.29	10.99	228.95	154.53	139.22
	5 శ్రామిక ఉపాధి శాఖ	1152.53	1232.82	80.29	6.97	1372.24	119.06	111.31
	6 సామాజిక భద్రత సంక్షేమం	1356.76	2917.68	1560.92	115.05	1337.9	98.61	45.85
	7 ప్రకృతి వైపరీత్యాలు, పునరావాసం	75.88	1527.44	1451.56	1912.97	101.4	133.63	6.64
సి	ఆర్థిక సేవలు	**30702.29**	**34952.37**	**4250.08**	**13.48**	**35219.27**	**114.71**	**100.76**
	1 గ్రామీణ అభివృద్ధి	11358.88	14107.63	2748.75	24.20	15508.45	136.53	109.93
	2 పరిశ్రమలు, ఖనిజాలు	16287.48	17033.66	746.18	4.58	16409.45	100.75	96.34
	3 కమ్యూనికేషన్	3055.93	3811.08	755.15	24.71	3301	108.03	86.63
డి	మొత్తం ((ఎ+ బి+సి)	**90217.95**	**99879.92**	**9661.97**	**10.71**	**106729.21**	**118.30**	**106.86**

3* బడ్జెట్ అంచనా 2005-2006 4* సరిచూసిన అంచనా 2005-2006 5* పెరుగుదల పరిమాణం(కాలమ్ 3-4) 6* పెరుగుదలశాతం కాలమ్5/ కాలమ్3
7* బడ్జెట్ అంచనా 2006-2007 8* కాలమ్ 7 : కాలమ్ 3 శాతం 9* బ.అం. 2006-07 : స.అం. 2005-2006 శాతం

ఖర్చు పెంచారు. (పట్టిక 4) అన్న విషయాలు తెలుస్తాయి. సాంఘిక సేవల విభాగంలో పట్టణాభివృద్ధి విషయం తీసుకుంటే బడ్జెట్ సవరించిన అంచనాల మధ్య అంతరం, అదే తగ్గుదల 93శాతం కాగా, సాంకేతిక విద్యలో 11.45 శాతం. కళలు, సాంస్కృతిక అంశాల్లో 16 శాతం ఉంది. ఆర్థిక సేవారంగంలో కూడా వీటి అంతరం 5 శాతం మించి ఉంది (ప్రత్యేక కార్యక్రమాలు, రవాణా మినహాయిస్తే). రాష్ట్రాలకొచ్చే కేంద్ర గ్రాంటుల్లో అంతరం 8 శాతం. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

అయితే ఇదే విభాగాల్లో కొన్ని సర్వీసులపై బడ్జెట్ అంచనాలకన్నా సవరించిన అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో కొన్నింటిని పట్టిక 4 (కాలమ్ 6 వరకు)లో చూడవచ్చు. వీటిలో ఈ అంతరాన్ని ఎక్కువగా చూపిస్తున్న అంశం ప్రకృతి వైపరీత్యాలు, పునరావాసం - ఇది తప్పనిసరి ఖర్చు. ఆ తర్వాత సామాజిక భద్రత, కుటుంబసంక్షేమం, గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ మొదలగునవి. పెట్టుబడి వ్యయంతో అంతరాలు బడ్జెట్, సవరించిన అంచనాల మధ్య అంతరాలు పెట్టుబడి వ్యయంలో కూడా చూడవచ్చు. బడ్జెట్ అంచనాల కంటే సవరించిన అంచనాలు తక్కువగా ఉన్న పద్దులు ఏవంటే పబ్లిక్ వర్క్స్ (14 శాతం), విద్య, క్రీడలు, కళలు (31 శాతం) హౌసింగ్ (దాదాపు 7 శాతం), పట్టణాభివృద్ధి (22 శాతం), బిసి ఎస్సీ, ఎస్టీ సంక్షేమం (25 శాతం), ఆర్థిక సేవారంగంలో సవరించిన అంచనాలు తక్కువగా ఉన్న పద్దులు ఏమంటే వ్యవసాయం, అనుబంధరంగాలు (42 శాతం), ఆహార నిల్వలు, గిడ్డంగులు (33 శాతం), ప్రత్యేక కార్యక్రమాలు (19 శాతం), సాధారణ ఆర్థిక సేవలు (56 శాతం)- ఇవీ మచ్చుకు కొన్ని.

రెవెన్యూ, పెట్టుబడుల పద్దులక్రింద ఇన్ని వ్యత్యాసాలు చూపిన ప్రభుత్వం రుణాల మంజూరీల జాబితాలో ఉన్న పెక్కు పద్దులకు బడ్జెట్ అంచనాల్లోకన్నా సవరించిన అంచనాల్లో ఎక్కువ చూపించింది. ఉదాహరణకు పట్టణాభివృద్ధికి రుణాల మంజూరీ బడ్జెట్ అంచనాల్లోకంటే సవరించిన అంచనాల్లో 264 శాతం ఎక్కువ. అలాగే వ్యవసాయం, అనుబంధరంగ సేవలు 63శాతం, రాష్ట్రాలకు రుణాలు 2,612 శాతం (బడ్జెట్ అంచనాలు రు.178.77 కోట్లు, ఖర్చు రు.4848.97 కోట్లు) ఎక్కువ.

ముగింపు:

పైన ఉదహరించిన విషయాల ఆధారంగా చూస్తే కేంద్ర ప్రభుత్వానికి బడ్జెట్ కంట్రోల్ లేదని తెలుస్తోంది. ఇంతేసి అంతరాలు ఉండగా రెవెన్యూ లోటును, ద్రవ్యలోటును మదించామని సంతోషపడడం దేశానికి ఏ పరిస్థితుల్లోను శ్రేయస్కరం కాదు.

పట్టిక 3, 4ల చివరి మూడు కాలమ్స్ 2006-07 బడ్జెట్ అంచనాలను, 2005-06 సంవత్సర బడ్జెట్, సవరించిన అంచనాలతో పోల్చి చూచి అంతరాన్ని లెక్కించడం గమనించి విశ్లేషించుకోవచ్చు. ❑

బడ్జెట్ బడాయిలు

వి. హనుమంతరావు

ఇవాళ 19 వ తేదీ మార్చి 2006. గత నెల 20 వ తేదిన రాష్ట్ర ఆర్థికమంత్రి రోశయ్య బడ్జెట్ ప్రవేశపెట్టారు. నెలరోజులైనా ఒక్క మంత్రిత్వశాఖ డిమాండుకైనా ఆమోదం లభించకపోవడం మాట అటుంచి, చర్చ కూడా ప్రారంభం కాకపోవటం అత్యంత బాధ్యతారాహిత్యం, శోచనీయం. సాధారణ చర్చ మాత్రం జరిగింది. ఈ లెక్కన సుమారుగా అన్నీ డిమాండ్లు గిలెటిన్ అవుతాయి. ఇది ఈ సంవత్సరంలోనే కాదు, గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతూనే వస్తోంది. దీనికి ప్రధాన ప్రతి పక్షాలైన టిడిపి, టిఆర్ఎస్‌లు పూర్తి బాధ్యత వహించాలి. ప్రభుత్వానికి, మంత్రులకు ఇది సంతోషకరమైన పరిణామం. తమ తమ మంత్రిత్వ శాఖలపై విమర్శలను ఎదుర్కొనక్కర్లేదు. మంత్రులకు అటువంటి అవకాశాన్ని ప్రతిపక్షాలు ఎందుకు ఇస్తున్నాయో తెలియదు. గత కొద్ది సంవత్సరాల అనుభవాన్ని అధ్యయనం చేస్తే, సాధారణచర్చ, ఆ చర్చలో లంబాచౌడా ఉపన్యాసాలతో ప్రతిపక్షాలు సంతృప్తి చెందినట్లనిపిస్తోంది. ఇదే చాలుననుకుంటే బడ్జెట్ సమావేశం ఇన్నాళ్లు జరగనక్కర్లేదు. ఒకవారం రోజుల్లో ముగించేయవచ్చు. ఇదే ప్రతిపక్షాల అభిమతమా? బలప్రదర్శనలు, తిట్ల పురాణాల కోసమే ఈ సమావేశాలు జరుగుతున్నాయా? శాసనసభలో ప్రజలవాణి వినిపించటం లేదు. ప్రతిపక్షాల అరుపులు, పెడబొబ్బలే వినిపిస్తున్నాయి. ఇందుకోసం ఒక్కొక్క శాసనసభ్యుడిమీద నెలకు 40 వేలు ప్రజల డబ్బు ఖర్చు చేయాలా? డబ్బు నష్టమే కాదు... తమ సమస్యలను సభలో ప్రస్తావించి, అవసరమైతే ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టి, నిలదీసి, తమ సమస్యలను పరిష్కరించుకొనే అవకాశాన్ని ప్రజలు కోల్పోతున్నారు. పార్లమెంటులో లాగే, వివిధ మంత్రిత్వశాఖల డిమాండ్లను పార్లమెంటరి కమిటీల్లో చర్చించే పద్ధతి ప్రవేశ పెట్టడం కాస్త మంచిదేమో ఆలోచించాలి.

రాష్ట్ర బడ్జెట్

బడ్జెట్

బడ్జెట్ గురించి చర్చించేముందు ఒకటి రెండు విషయాలు తెలుసుకోవాలి. కేటాయింపులు చూచి మురిసి పోకూడదు. అవి ఘనంగానే వుంటాయి. ఆ కేటాయింపులు పూర్తిగా ఖర్చు చేశారా అనేదే ముఖ్యం. బడ్జెట్లో కేటాయింపులు కేవలం అంచనాలు మాత్రమే. అనుకొన్న ఆదాయం ఏ కారణం వల్లనైతేనేమి రాకపోవచ్చు. అనుకోని ఆదాయం రావచ్చు. ఖర్చు విషయంలోనూ అంతే. అందుచేతనే చేసిన కేటాయింపుకు వాస్తవంగా అయిదు పది శాతం అటో ఇటో వుండే అవకాశం వుంటుందని ఆర్థికశాఖ అధికారులు అంటారు. ఈ వాదన సబబుగానే వుందనుకొందాం. కాని ఆ శాతం దాటితే మాత్రం అది ఆలోచించాల్సిన విషయం. అయితే పాలకులు కేటాయింపులను కావాలనే ఎక్కువగా చూపించి మేం మీ కోసం ఎంత ఎక్కువ కేటాయించామో చూచారా' అని ప్రజలను బురిడీ కొట్టించడానికి ప్రయత్నించే సందర్భాలుంటాయని గుర్తుంచుకోవాలి. ఇది మొదటి విషయం.

ఈ కేటాయింపుల స్థూల అంకెలు చూచి, ఆ కేటాయింపులు ప్రతి సంవత్సరం పెరగటం చూచి, బాగానే పెరుగుతున్నాయనే అభిప్రాయానికి రాకూడదు. ఉదాహరణకు 2003-04 లో ప్రణాళికలో గ్రామీణాభివృద్ధికి రు.774 కోట్లు ఖర్చు చూపించి 2004-05లో రు.78 కోట్లు కేటాయింపు చూచి మురిసిపోతే పొరపాటవుతుంది. ఎందుచేతనంటే, మొత్తం ప్రణాళిక ఖర్చుకూడా అవే సంవత్సరాల్లో రు.10,028 కోట్ల నుండి రు.13,291 కోట్లకు పెరిగింది. అంటే 2003-04 లో ప్రతి నూరు రూపాయల్లో రు.7.72లు ఖర్చుచేయగా, 2004-05 లో రు.6.01 మాత్రమే ఖర్చు అవుతుంది. స్థూల అంకెల్లో పెరిగినట్లు కనుపిస్తోంది కాని వాస్తవంలో తగ్గిందన్నమాట. ఈ గణాంకాల ఆటలో మీరు చిక్కుకోకూడదు. ఇది రెండవ విషయం.

ఈ పెరుగుదలలు నిజమైన పెరుగుదలలు కావు. అంకెల్లో కనుపించే పెరుగుదలమాత్రమే ఎందుచేతనంటే ధరలు పెరుగుతాయి. ఉదాహరణకు ఒక వస్తువు తయారు చేయడానికి నూరు రూపాయలు ఖర్చు అవుతుందనుకుందాం. కాని ఆ సంవత్సరంలో ఆ వస్తువు తయారు చేయడానికి అవసరమయ్యే ముడిసరుకుల విలువ పెరిగినా, లేకపోతే కార్మికుల జీతాలు పెరిగినా, ఆ వస్తువు ధర కూడా పెరుగుతుంది కదా. వస్తువు అదే కాని ధర పెరుగుతుంది. అలాగే ప్రభుత్వం అమలు పరచే కార్యక్రమం అదే కాని అమలుకు అయ్యే ఖర్చు ధరల పెరుగుదల వల్ల కేటాయింపు పెరిగినట్లు కనపడుతుంది. ఇది మూడో విషయం.

ఆర్థికమంత్రి ప్రవేశపెట్టింది 2006-07 సంవత్సరానికి బడ్జెట్. ఇది అంచనాల బడ్జెట్. ఈ బడ్జెట్‌లో జనరల్‌గా మూడు అంకెలుంటాయి. 2004-05 లో వాస్తవంగా ఆదాయ, వ్యయాలు, 2005-06లో సవరించిన అంచనాలు, 06-07లో అంచనాలు. చేసిన కేటాయింపులు పూర్తిగా ఖర్చుచేయలేకపోవటం ఆనవాయితిగా వస్తోంది కాబట్టి 2004-05లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు బడ్జెట్‌లో ఇంత ఖర్చు చేయబోతున్నాం అనే అంచనాతో, ఆ సంవత్సరంలో వాస్తవంగా ఎంత ఖర్చు అయిందో 2006-07 బడ్జెట్ పుస్తకాల్లో వుంటుంది కాబట్టి, ఆ రెండు గణాంకాలను పోలిస్తే ప్రభుత్వం సత్తా ఏమిటో తెలుస్తుంది. అదే సమయంలో అంతకు ముందు సంవత్సరంలో (03-04) అప్పటి ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో అనేదానితో కూడా పోల్చి చూస్తే, ఆ ప్రభుత్వం కన్నా, మేమేదో ఘనంగా ఖర్చు చేస్తాం అనే ఆర్థిక మంత్రి చెప్పిన విషయం ఆచరణలో అమలు జరిగిందా

మొదట ఆదాయం గురించి చూద్దాం. 2003-04, 2004-05 సంవత్సరాల్లో ఆదాయంను పోల్చి చూడగా -

పట్టిక -1 (శాతం)

సం.	రాష్ట్రసొంత పన్ను ఆదాయం	రాష్ట్రసొంత ఆదాయం	కేంద్రం నుంచి	మొత్తం ఆదాయం
2003-04	7.64	9.63	5.23	14.86
2004-05	8.15	10.03	4.38	14.41

అనే విషయం కూడా తెలుస్తుంది. ఈ జాగ్రత్తలను పాటించి బడ్జెట్ అధ్యయనం చేయాలి.

పట్టిక 1 ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం తన సొంత వనరులను పెంచుకోవటంలో గత ప్రభుత్వం కన్నా మెరుగ్గానే ఆదాయాన్ని జమ చేసుకొంది. అయితే మొత్తం రెవిన్యూ ఆదాయం 14.86 శాతం నుండి 14.41 కు తగ్గిందంటే, అది కేంద్రం నుంచి వచ్చిన ఆదాయం 5.23 శాతం నుంచి 4.38 కు తగ్గటం అందుకు కారణం. ఇపుడు ఖర్చు గురించి తెలుసుకుందాం.

పట్టిక 2 ప్రకారం గత ప్రభుత్వంకన్నా ఈ ప్రభుత్వం ఖర్చు తగ్గించుకుని ఎక్కువ ఖర్చు పెట్టుబడి పద్దు కింద చేసిందని తెలుస్తుంది. కాబట్టి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేద్దామా? ఆగండి. ఖర్చు తగ్గటానికి అనేక కారణాలుంటాయి. బొక్కాసంలో నిధులు లేక గాని, సామాజిక సంక్షేమ పథకాల కింది ఖర్చుపై కోత విధించడంవల్ల గాని కేంద్రం నుంచి నిధులు రాకపోవటం వల్లగాని, వసూలు చేయాల్సిన పన్నులు వసూలు చేయకపోవటం వల్ల గాని - ఇలా అనేక కారణాలుంటాయి. ఇంకా లోతుగా అధ్యయనం చేస్తేనే అసలు కారణమేమిటో తెలుస్తుంది. ఇపుడో 2004-05 సంవత్సరంలో అంటే ప్రస్తుత ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఏడాదిలో వివిధ పద్దులకు చేసిన కేటాయింపులు, వాస్తవంగా ఖర్చుచేసినదెంత అనే వివరాలు చూడండి.

(శాతం)

పట్టిక - 2

సంవత్సరం	మొత్తం ఖర్చులో	
	రెవిన్యూఖర్చు	పెట్టుబడి ఖర్చు
2003-04	87.53	12.47
2004-05	85.26	14.74

- మొత్తం రెవిన్యూ ఖర్చులో సామాజిక సేవలు పద్దుకింద ఖర్చు బడ్జెట్ అంచనా 33.79 శాతం (రు.11,542 కోట్లు) అయితే వాస్తవ ఖర్చు 33.47 శాతం (10,480 కోట్లు) అంచనాకన్నా 10 శాతం తగ్గింది.

2004-05 బడ్జెట్ ఆదాయవ్యయాలు

అంచనాలు, వాస్తవాలు

ఆదాయాలు :	బ.అం.	వాస్తవం
పన్నులు, సుంకాలు	23,320	22,313
	(70.06)	(71.61)
పన్నేతర ఆదాయం	4,003	3,775
	(12.44)	(13.06)
ఇందులో కేంద్రం నుంచి	6,056	6,058
రాష్ట్రం పన్నులు	17,264	20,223
ఇందులో భూమి శిస్తు	126	128
అమ్మకం పన్ను	11,242	11,043
ఎక్సైంజ్ పన్ను	2,477	2,093
ఇతరాలు	3,418	3,088
గ్రాంట్లు	4,858	2,681
	(15.10)	(9.33)
వ్యయాలు :		
అభివృద్ధి ఖర్చు	20,159	17,676
	(57.95)	(56.46)
అభివృద్ధేతర ఖర్చు	13,993	13,631
	(40.97)	(43.54)
ఇందులో అసలు,	7,470	7,091
వడ్డీ చెల్లింపులు	(21.87)	(22.65)
పరిపాలనా వ్యయం	2,028	1,957
	(5.94)	(6.25)
పన్ను వసూళ్లకు ఖర్చు	500	480
	(1.46)	(1.53)
ఇతర ఖర్చులు	3,995	4102
	(11.70)	13.11)

(ఆధారం: బడ్జెట్ ఇన్ బ్రీఫ్ 2004-05, 2006-07 ఇతరవివరాలు కూడా చూడండి.)

- 2004-05 ప్రణాళిక రెవిన్యూ పద్దు కింద లోటు అంచనా రు.1,979 కోట్లు రాగా, వాస్తవం రు.2,558 కోట్లు అంచనాకు వాస్తవానికి తేడా 30 శాతం.

- 2004-05 ప్రణాళిక మొత్తం కేటాయింపు రూ. 13291 కోట్లు అయితే వాస్తవంగా చేసిన ఖర్చు రు.11,457 కోట్లు (86 శాతం) ప్రణాళికలలో వ్యవసాయం, తత్సంబంధిత శాఖల కేటాయింపు రూ. 1542, ఖర్చు 1382: నీటి పారుదల కేటాయింపు రు.4,222 ఖర్చు రూ 3444 సమాజ సేవల కేటాయింపు రు.3632, ఖర్చు రు.3,427 విద్యుచ్ఛక్తి రు.2,283, ఖర్చు రు.2,096 రవాణా రు.843, ఖర్చు 627; ఇతరాలు (పరిశ్రమలు, సాధారణ, ఆర్థిక సేవలు వగైరా) రు.769 ఖర్చు 481 (అన్నీ కోట్ల రూపాయలలో).

- పెట్టుబడి పద్దు ఖర్చు అంచనా రు.6,188 కోట్లు కాగా వాస్తవంగా రు.5,414 కోట్లే ఖర్చుచేశారు.

- తెలుగుదేశం పాలన కాలంలో నగటున ప్రతి సంవత్సరం ఎనిమిదివేల కోట్లు అదనంగా అప్పుతెస్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ఎనిమిదివేల కోట్లు చొప్పున రుణభారాన్ని పెంచు కుంటూ వచ్చింది.

(మిగతా 22వ పేజీలో)

ఆంధ్రప్రదేశ్ చరిత్ర అణచివేత చరిత్రే

|యం.కోదండరామ్|

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగంగా తెలంగాణ అభివృద్ధి సాధ్యమేనని, అభివృద్ధి కొరకు కొట్లాడటమే మంచిదని ఈ మధ్యన కొందరంటున్నారు. ఇప్పట్లో ఎట్లాగూ తెలంగాణ వచ్చేటట్టు లేదు కనుక అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వంతోని కొట్లాడటమే మంచిదని వంత పాడేవాళ్లు కూడా తయారైండ్రు. ఈరకంగా మట్లాడుతున్న వాళ్ళకు అభివృద్ధి గురించి కానీ, ఆర్థికవ్యవస్థ గురించి కానీ అవగాహన లేదు.

అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తిని పెంచడమే కాదు. జీవన ప్రమాణాలను పెంచడం. నిండైన జీవితాన్ని పొందడానికి కావలసిన పరిస్థితులను కల్పించడం. ఈ రకంగా అభివృద్ధిని సాధించాలంటే నిర్ణయాధికారంలో భాగస్వామ్యం ఉండాలి. జీవన ప్రమాణాలను పక్కనబెట్టి కేవలం ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నా దాన్ని సాధించడానికైనా వనరులపై పూర్తి నిర్ణయాధికారం ఉండాలి. నిర్ణయాధికారం లేకనే తెలంగాణ వెనుకబడి పోయింది.

తెలంగాణకు నిర్ణయాధికారం లేకపోవడానికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ, ఆర్థిక వ్యవస్థే ప్రధానమైన ఆటంకం. ఆంధ్రప్రదేశ్ రాజకీయ, ఆర్థిక వ్యవస్థ అన్ని ప్రాంతాలు సమష్టిగా రూపొందించుకున్నది కాదు. పెద్ద మనుషుల ఒప్పందంలో తెలంగాణకు కూడా విధాన రూపకల్పనలో సమాన భాగస్వామ్యం కల్పించడానికి తీసుకోవలసిన చర్యలను రాసినారు. కానీ ఆ ఒప్పందాన్ని గట్టిగా అమలు చేయలేదు. అమలు చేసి ఉంటే పరిస్థితి ఇంకొక విధంగా ఉండేది. పెద్దమనుషుల ఒప్పందం వలన ఏర్పడిన నియమాలు, వ్యవస్థలు పనిచేయకపోవడం వలన తెలంగాణకు అన్యాయం జరిగింది.

50వ పడిలో ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌పై కాళోజీ గారు చెప్పిన రెండున్నర జిల్లాల రెండున్నర శాతం ప్రజల ఆధిపత్యం పెంపొందింది. ఆంధ్రప్రదేశ్‌పై ఈ వర్గం ఆధిపత్యం విస్తరించే క్రమంలోనే తెలంగాణ తన అస్తిత్వాన్ని, వనరులను కోల్పోయింది. అయితే ఈ అధికారం చారిత్రక క్రమంలోనే సంక్రమించింది. కోస్తాంధ్ర సామాజిక- ఆర్థిక పరిణామాలే అందుకు కారణమయ్యాయి. గోదావరి నదిపై 1853లో ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించగా, అదే సంవత్సరం కృష్ణానదిపై కూడా విజయవాడ వద్ద ఆనకట్టను కట్టారు. వీటికింద సుమారు 20 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చింది. ఈ ప్రాజెక్టుల ఫలితంగా వరి, చెరుకు, పొగాకు, మిర్చి వంటి వాణిజ్య పంటలు కూడా విస్తరించాయి. అయితే వాణిజ్య పంటల వలన, సాగునీటి సౌకర్యం వలన దానంతట అదే సామాజిక మార్పు రాదు. అందుకుగాను మానవస్వభావం మారాలి. మనిషి ఆలోచనల్లో మార్పు రావాలి. వ్యాపార సంస్కృతిని అలవర్చుకున్న మనిషి రావాలి. ఈ రకమైన వ్యాపార సంస్కృతిని సంస్కరణోద్యమాలు పెంచాయి. వ్యాప్తి చేశాయి. వ్యాపార సంస్కృతిని అలవర్చుకున్న మనిషి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా బతుకుతుంటాడు. వాణిజ్యపంటలకు అవకాశం, వాటిని సాగుచేయడానికి కావలసిన నీటి సౌకర్యం, వాణిజ్య అవకాశాలను వాడుకొని ఎదగాలన్న తపనగల మనిషి ఈ మూడు అంశాల కలయికతోనే కోస్తాంధ్రలో ఆర్థిక ఉత్పత్తి పెరిగింది. బలమైన వ్యాపారవర్గం, ధనికరైతాంగం ఎదిగాయి.

నూతన సామాజిక దృక్పథం కూడా బాగా బలపడింది. ఈ వర్గం బలోపేతమై రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను శాసిస్తున్నది. తన ఆర్థిక సమస్యలను వ్యక్తీకరించగల సంఘాలను, సంస్థలను ఏర్పాటు చేసుకొన్నది. సంఘటితంగా మద్రాసు నుండి వేరు కావడానికి కృషి చేసింది. ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటుకు బాటలు వేసింది. తాను సమకూర్చుకున్న పెట్టుబడితో పత్రికలను నెలకొల్పగలిగింది. సినిమాలను తీయగలిగింది. ప్రచురణాలయాలను ఏర్పాటు చేసుకొన్నది. సమాజంలోని సమస్యలకు తన దృక్పథం నుండి పరిష్కారం చూపగల స్థితికి చేరుకున్నది. ఆ బలంతోనే వివిధ పబ్లిక్‌రంగ సంస్థలపైన ఆధిపత్యాన్ని నెలకొల్ప గలిగింది. ఆ ఆధిపత్యంతోనే అభివృద్ధిని నిర్వచించింది. ఆ అభివృద్ధి పథకాలను రూపొందించి అమలులోకి తేగలిగింది.

తెలంగాణ చరిత్ర క్రమం వేరు. ఈ ప్రాంతానికి పోరాట ప్రతిపత్తి మాత్రమే ఉన్నది. విద్యావకాశాలు చాలా ఆలస్యంగా వచ్చినాయి. నిరంకుశ రాజ్య వ్యవస్థ వలన సంస్కరణోద్యమాలు రాలేదు. వాణిజ్యపంటలు ప్రవేశించినా అవి అంతగా విస్తరించలేదు. అయితే 1930ల తరువాత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల వలన వర్తక, వాణిజ్య రంగాలలోను, పారిశ్రామిక రంగంలోను సంపన్నవర్గం తలెత్తింది. అయితే దేశవిభజన తరువాత పాకిస్తాన్ తరలిపోయిన వాళ్ళు కొందరైతే, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలలో స్థిరపడిన వారు మరికొందరు. మిగిలిన కొందరికి పౌరసమాజాన్ని పెంపొందించగల సైద్ధాంతికశక్తి గాని, ఆర్థిక శక్తి గానీ సమకూర్చుకో లేకపోయారు. ఈ పరిణామాల వలన పోరాటాలను అల్లుకొని వచ్చిన వ్యవస్థలు కూలిపోయాయి. కొత్తగా పౌరసమాజం రూపొందలేదు.

మొత్తంగా ప్రభుత్వ ప్రణాళికావ్యయంలో ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక నాటికి 30 శాతం సాగునీటి రంగం పైన ఖర్చు చేశారు. ఇందులో 90 శాతం నిధులను భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి ఉపయోగించారు. ఆ తరువాత నీటిపారుదలకు కేటాయింపులు తగ్గినాయి. ఈ విధానాల వలన చెరువులు క్షీణించాయి. భారీ ప్రాజెక్టుల

వలన కేవలం కోస్తాంధ్రకే లాభం కలిగింది. దీనికితోడు హరితవిప్లవం ఫలితంగా విస్తరించిన వరి తదితర వాణిజ్య పంటలకు మాత్రమే మద్దతు ధరనిచ్చింది. రెండు రూపాయలకు కిలోబియ్యం పథకం ప్రవేశపెట్టడంతో వడ్లకు గిరాకీ మరింతగా పెరిగింది. ఈ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడమే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పత్రికలు తమ కర్తవ్యంగా ఎంచుకున్నాయి. 'రేగడి విత్తులు' వంటి నవలలు కూడా ఈ వ్యవసాయాన్ని ఆదర్శంగా చూపాయి. తెలంగాణలో చేసే వ్యవసాయాన్ని సంప్రదాయకమైన, పురాతనమైన వ్యవసాయంగా చిత్రీకరించాయి. అటు ఆర్థికపరమైన ఒత్తిడి, ఇటు పత్రికలు, ప్రభుత్వ సంస్థల ప్రచార ఫలితంగా తెలంగాణలో నిలకడగా సాగిన వ్యవసాయ పద్ధతులు నిర్లక్ష్యానికి లోనయ్యాయి.

కోస్తాంధ్రను అనుకరించే క్రమం ఈ పరిస్థితిలో మొదలైంది. బావులు లోతుచేసి, అవీ అడుగంటడంతో బోర్లు వేసి వరి పండించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. అది సాధ్యం కాని చోట పత్తి, చెరుకు, మిర్చి, పొగాకు వేస్తున్నారు. ఈ పంటల సాగుకు బావులు తవ్వడంతో రైతుల రుణభారం పెరిగింది. వరుస కరువుల వలన పంటలు పోయి అప్పులు తీర్చలేకపోయారు. బ్యాంకుల్లో, కో-ఆపరేటివ్ సంస్థల్లో కొత్తగా అప్పు పుట్టక ప్రైవేటు డీలర్ల పైన, వడ్డీ వ్యాపారస్తుల పైన ఆధారపడక తప్పలేదు. ఈ వర్తకులు నకిలీ విత్తనాలను, మందులను అంటగట్టి రైతుజీవితంతో చెలగాటమాడుతున్నారు. ఈ నష్టాలను తట్టుకోలేక భూములు అమ్ముకొని వలస పోతున్నారు.

ఇది ఇట్లా ఉంటే హరిత విప్లవంతో వచ్చిన డబ్బుతో కోస్తాంధ్రలో సంపద పెరిగింది. ఆ సంపదను కంపెనీల ఏర్పాటుకు ఉపయోగించడమే కాక వివిధ రకాల వ్యాపారాలలో పెట్టుబడిగా పెట్టారు. కాలేజీలను, ఆసుపత్రులను నెలకొల్పారు. రవాణా, విద్యుత్తు, రియల్ ఎస్టేట్ రంగాలలోకి కూడా ఈ పెట్టుబడి ప్రవేశించింది. ఈ పెట్టుబడులకు అవకాశాన్ని కల్పించడానికి ఎన్టీఆర్ ప్రభుత్వం ఎన్నో విధానాలను ప్రవేశపెట్టింది. ప్రైవేటు బస్సులను ఆర్టీసీ అద్దెకు తీసుకోవడం, ప్రైవేటు కాలేజీలను, ప్రైవేటు ఆసుపత్రులను అనుమతించడం ఎన్టీఆర్ కాలంలోనే మొదలైంది. చంద్రబాబు ప్రైవేటు పెట్టుబడులకు అవకాశాలను పెంచాడు. మొత్తం ప్రభుత్వ వనరులలో పెట్టుబడులు పెట్టడానికి కావలసిన సౌకర్యాలను కల్పించాడు.

ఈ మొత్తం పరిణామాల వలన తెలంగాణ ఆర్థిక ఉత్పత్తి క్రమంలో తన స్థానాన్ని పూర్తిగా కోల్పోయింది. చదువుకునే అవకాశాలు తగ్గిపోయాయి. ఉద్యోగావకాశాలు పోయాయి. ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదు. ప్రైవేటురంగంలోకి రానివ్వలేదు. వ్యవసాయం కృంగిపోయింది. ప్రభుత్వ పెట్టుబడులను పూర్తిగా ప్రైవేటురంగానికి మళ్ళించడం వలన ఉపాధిని కల్పించగల రీతిలో ప్రభుత్వ సాయం రాలేదు. కనుక వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు కలుగలేదు. బతకపోవడం తప్ప బతకడానికి వేరొక మార్గం లేదు.

ఉత్పత్తినుండి వెలివేయడబడటమే కాదు. తెలంగాణ ప్రాంతంలో వచ్చిన మిగులు కూడా వివిధరూపాల్లో తరలిపోతున్నది. గత్యంతరం లేక ప్రైవేటు కాలేజీలలో చదువుకోదలుచుకుంటే కార్పోరేట్ కాలేజీకి పోక తప్పదు. కార్పోరేట్ ఆసుపత్రులు కూడా ఈ మిగులు తరలింపు సాధనాలే. ఇట్లాంటి తరలింపులో ఆధిపత్యం మరింత విస్తరిస్తున్నది.

మన పత్రికలు తదితర సాహితీ, సాంస్కృతిక సాధనాలు ఈ పరిణామాలను ఎత్తిచూపడం లేదు. పైపెచ్చు తెలంగాణ మాదిరిగా కోస్తాంధ్రలోను వెనుకబడిన ప్రాంతాలున్నాయని కొందరు సాక్ష్యాలు చూపించే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు తెలంగాణ కూడా గత 50 సంవత్సరాలుగా అభివృద్ధిని సాధించిందని నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు.

అయితే పత్రికలు తదితర సాహితీ సంస్థలపై కోస్తాంధ్రకు ఉన్న పట్టు వలన రాష్ట్ర చరిత్రను, ఆర్థిక పరిస్థితులను వివరించే క్రమంలో తెలంగాణ ప్రత్యేకతలను విస్మరించారు. పాఠ్యపుస్తకాలలో తెలంగాణ ప్రస్తావన లేదు. రాజకీయోద్యమ చరిత్ర రాస్తే తెలంగాణ ఊసే ఉండదు. తెలంగాణలో తెలుగే మాట్లాడరన్న అభిప్రాయం బలంగానే ఉన్నది. అంతే తప్ప తెలంగాణను అర్థం చేసుకునే ప్రయత్నమే చేయలేదు. కాశ్మీర్ నుండి కంబోడియా దాకా దేని గురించైనా మాట్లాడగల ప్రజాస్వామ్యవాదులు కూడా తెలంగాణ సమస్యకు మూలాలను చూసేందుకు కృషిచేయలేదు. ఈ పరిస్థితిలో కోస్తాంధ్రలో మాట్లాడే భాషే తెలుగుభాషగా, కోస్తాంధ్ర చరిత్రే ఆంధ్రప్రదేశ్ చరిత్రగా పెంపొందింది. ఆంధ్రప్రదేశ్ అనే అస్థిత్వంలో తెలంగాణ లేదు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాష పూర్తిగా అణచివేయబడినాయి.

పెద్దమనుషుల ఒప్పందం తెలంగాణ వనరులపైన అధికారాన్ని, విధాన నిర్ణయంలో భాగస్వామ్యాన్ని కల్పించింది. అయితే అది అమలు కాలేదు. అవి అమలై ఉంటే తెలంగాణ పరిస్థితి బాగుండేది. తత్ఫలితంగా పరిపాలనా యంత్రాంగం పైన, రాజకీయ వ్యవస్థపైన కోస్తాంధ్ర సంపన్నవర్గాల ఆధిపత్యం వ్యవస్థితమై పోయింది. తెలంగాణ క్రమంగా విధాన నిర్ణయంలో భాగస్వామ్యాన్ని కోల్పోయింది.

కనుక 50 సంవత్సరాల క్రమంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలో స్థానాన్ని, సాంస్కృతిక అస్థిత్వాన్ని, విధాన నిర్ణయంలో భాగస్వామ్యాన్ని కోల్పోయింది. ఉమ్మడిరాష్ట్రంలో తెలంగాణ అణచివేయబడింది. వెలివేయబడింది. ఆంధ్రప్రదేశ్ అనబడు జైలులో తెలంగాణ బందీ అయింది. ఈ బందీఖానా నుండి విముక్తి చెందకుండా తెలంగాణ అభివృద్ధి చెందదు.

ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత రూపం ఆర్థిక, సామాజిక అస్థిత్వం తెలంగాణను అణచివేయడం వల్లనే రూపొందింది. ఈ అణచివేత లేకుండా ఉండి ఉంటే 50 సంవత్సరాల చరిత్రక్రమం ఇంకొకరూపంలో సాగేది. ఇతరేతర అణచివేతలు లేవని కాదు. కులపరమైన, లింగపరమైన, జాతిపరమైన అణచివేతలూ ఉన్నాయి. కానీ వాటి పరిష్కారం తెలంగాణ విముక్తి చెందినప్పుడే సాధ్యం. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ పాలకవర్గ స్వభావాన్ని తెలంగాణపైనున్న ఆధిపత్యం వలన రూపొందింది. ఈ సంబంధం తెగిపోకుండా మిగతా ఆధిపత్య సంబంధాలను విచ్ఛిన్నం చేయడం సాధ్యం కాదు. కనుక 50 సంవత్సరాల చరిత్రను తిరుగరాయవలసిన అవసరం ఉన్నది. ❑

విశాఖ స్టీల్ ప్లాంట్ : అభివృద్ధి పథకమా? అభివృద్ధా?

డా.ముదునూరి భారతి

విశ్లేషణ

(గత సంచిక తరువాయి)

ఉక్కు కర్మాగార నిర్మాణం సమయంలో, అంటే 1986 వ సంవత్సరం జాతీయ రహదారికి ప్రక్కన ఉత్తరాన ఉన్న ఈ గ్రామాన్ని అక్కడి నుండి తీసివేసి రహదారికి దక్షిణాన 1 కి.మీ. లోపలగా అగనంపూడి 3లో ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఎ3 కాలనీలో ప్రతి కుటుంబానికి కులాల వారిగా ఇంటి స్థలం (25 సెంట్లు), రు.10,000 ఖరీదు చేసే సిమెంటు, ఇనుము, రు.2,500 నగదు సబ్సిడి ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ఇచ్చినది చాలా చిన్న మొత్తం అవటంతో ప్రతి కుటుంబం రు.30,000 వరకూ అప్పుచేసి ఒక గది, ముందు వసారా, వంటగదిగా ఉపయోగపడే, వెనుక వసారా వచ్చేటట్లుగా ఒక చిన్న ఇల్లు కట్టుకున్నారు. పది చాకలి కుటుంబాలకు ఒక చిన్న కాలువ ప్రక్కగా గ్రామం మొదటలో ఒకేచోట ఇచ్చారు. కాలనీ ముఖద్వారం నుండి వచ్చే రోడ్డుమీద గ్రామ పెద్ద రెండు అంతస్తుల ఇల్లు కట్టడంతో ఇదే రహదారిగా మారింది. మిగతా వాళ్ళు 4 వరుసలలో ఇళ్లు కట్టుకున్నారు. దీనికి వెనుకగా ఒక రచ్చబండ, రామాలయం ఉన్నాయి. గ్రామంలో ప్రభుత్వం కల్పించిన ముఖ్య వసతులు రెంటిని పేర్కొనవలసి ఉంది. అన్ని ఇళ్ళకు కరెంటు సదుపాయం, మంచి నీటి కొరత లేకుండా బోరు పంపుల సదుపాయం.. ఈ కాలనీ ఏర్పడిన 10 సంవత్సరాల తరువాత కూడా ఇది ఉక్కు కర్మాగారానికి చెందుతుందా లేక ప్రభుత్వానికి చెందుతుందా అనే విషయంలో సందిగ్ధత ఉండటంతో ఈ కాలనీకి కావలసిన రోజువారీ పనులు, రిపేరు పనులు జరగటం లేదు.

అభివృద్ధి పథకాల ద్వారా అభివృద్ధి సాధ్యమౌతుందనే భావజాలం ప్రభావంతో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించినపుడు, వ్యవసాయ సంబంధాలు ధ్వంసమై పోయి మార్కెట్టుకి సంబంధించిన కొత్త సంబంధాలు ఏర్పడుతున్న సందర్భంలో గ్రామంలో ఎటువంటి వారు కొత్త వ్యవస్థలో భాగమవగలిగారు? ఎవరు అవలేకపోయారు? దానికి కారణాలు ఏమిటి? అని చూస్తే కొన్ని విషయాలు గ్రహించవచ్చును.

కొత్త వ్యవస్థలో ఇమిడిపోలేని వాళ్ళలో ముఖ్యంగా చెప్పుకోవలసినది వ్యవసాయకూలీలు, చిన్న, సన్నకారు రైతులు. పాత వ్యవస్థ ధ్వంసమైపోవడంతో వీరికి పొలాలు పోయి వ్యవసాయ సంబంధాలు పోయాయి. కొత్తవ్యవస్థలో ఉపాధి దొరకకపోవటం, రోజువారీ కూలీపనులు కూడా దొరకకపోవడంతో దీనిలో ఇమడలేకపోయారు. సన్నకారు రైతులలో కొందరు వేరే ఉపాధి లేకపోవడంతో ప్రతి ఒక్క కుటుంబానికి ఇచ్చిన ఆర్ కార్డు సహాయంతో భవిష్యత్తులో తమ పిల్లలకైనా ఉక్కు కర్మాగారంలో ఉపాధి దొరుకుతుంది అనే ఆశతో రు.20,000 అప్పు చేసి వారిని ఐ.ఐ.టి. ట్రైనింగ్ చేయించారు. కాని ఉక్కు కర్మాగారంలో 1992 లోనే రిక్రూట్‌మెంటు ఆపివేసిన కారణంగా వీరంతా నిరుద్యోగులుగా మిగిలిపోయారు. అత్యవసర పరిస్థితులలో వీరు ఈ ఆర్ కార్డులను అమ్మకానికి పెట్టడం, అక్కడి కాంట్రాక్టర్లు, వారి బంధువులు ఈ కార్డును కొనుక్కోవడం కూడ జరిగింది.

రెండవ రకం కుటుంబాలు పరోక్షంగా వ్యవసాయ సంబంధాలు ఉన్నవారు, ఉదాహరణగా కమ్మరి, కుమ్మరి, వడ్రంగి వగైరాలు. వీరుకూడా తమకున్న నైపుణ్యం కొత్త వ్యవస్థకి పనికి రాకపోవడంతో ఇక్కడ ఇమడలేకపోయారు. వీరికి తోడు వ్యవసాయ కుటుంబాలకు ఇంటిలో అవసరమైన చిల్లర పనులు చేసే పని మనుషులు కూడా ఈ నేపథ్యంలో ఇమడలేకపోయారు. వీళ్ల ప్రతిరోజు రోడ్డు దగ్గరకు కాని, కర్మాగారం గేటు దగ్గరకు గాని వెళ్ళి పనికై ఎదురు చూడటం, దొరకక పోతే మళ్ళీ మరునాడు ఇలాగే ఎదురుచూస్తూ ఉంటారు.

మూడవరకం వ్యక్తులు గ్రామంలోని వ్యవసాయ సంబంధాలు చేస్తూనే గ్రామం బయట ఉండే మార్కెట్టుతో సంబంధాలు ఏర్పరుచుకున్న కుటుంబాలు. వీరు చాకలి, టైలరు లాంటివాళ్ళు. కొంతవరకు చదువుకొన్నవాళ్ళు క్వారీలలో లారీకి పనిచేసేవాళ్ళు, పాత వ్యవసాయ సంబంధాలు విధ్వంసం అయిపోయినా కూడా వారికి అప్పటికే మార్కెట్టుతో ఉన్న సంబంధాలు బలపరచుకొని కొత్త వ్యవస్థలో ఇమిడిపోయారు.

ఇక్కడ స్త్రీల సంగతి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పాతవ్యవస్థలో స్త్రీలు తమ పొలాలలో పని చేయటమే కాక వ్యవసాయ కూలీలుగా, ఇంటి పనులలో నైపుణ్యతతో కూడిన చిల్లర పనులు చేసే పనివాళ్ళుగా వ్యవస్థలో వీరికొక స్వతంత్ర హోదా ఉండేది. కొత్త కాలనీకి వచ్చిన తరువాత తాము చేస్తున్న వ్యవసాయ సంబంధిత పనులు పోవడంతో సమాజానికి భారమైపోయారు. పోచికోలు కబుర్లతో కాలక్షేపం చేస్తారని, పనులు లేకపోవడంతో తిని పడుకుంటారనీ, ఏ చిన్న కారణమో పట్టుకుని ప్రక్కఇంటి ఆడవాళ్ళతో పోట్లాడుతారని, పిల్లల్ని కనడమొక్కటే వాళ్లకు తెలిసినవని అని హీనంగా చూడబడతారు. ఒక్కమాటలో

చెప్పాలంటే వీరి స్థితి 'విశ్రాంతి దొరకని పనుల' నుండి 'విశ్రాంతే తప్ప దొరకని పనులు'గా మారిందని చెప్పకోవచ్చు. చాకలి కుటుంబాలలో స్త్రీలను మినహాయించి మిగతా కుటుంబాల స్త్రీలు కొత్త వ్యవస్థలో భాగమవలేకపోయారు.

క్లుప్తంగా చెప్పకోవాలంటే ఉక్కు కర్మాగారం నెలకొల్పే క్రమంలో భూమి ప్రాధాన్యంగా ఉండే పాత వ్యవస్థలో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని వ్యవసాయ సంబంధాలలో భాగమయిపోయిన కుటుంబాలు ఈ భూములు పోవడంతో ఈ సంబంధాలు ధ్వంసమైపోయి కొత్తవి ఏర్పడలేని సందర్భంలో ఈ కొత్త వ్యవస్థలో ఇమిడిపోలేకపోయారు. ఇంకా కొన్ని కుటుంబాలు పాత వ్యవస్థలో ఉంటూనే గ్రామం బయట ఉండే డబ్బు ప్రాధాన్య వ్యవస్థతో సంబంధాలు పెంచుకోవడంతో పాత సంబంధాలు ధ్వంసమైపోయినా డబ్బు ప్రాధాన్య సంబంధాలను బలపరచుకొని కొత్తవ్యవస్థలో భాగమవగలిగారు. మొదట దానికి ఉదాహరణగా వ్యవసాయకూలీలు, చిన్న, సన్నకారు రైతులు, స్త్రీలు అనుకుంటే రెండవదానికి చాకలి, టైలర్‌లను చెప్పకోవచ్చు. మనం ముందు చెప్పకున్నట్లుగా ఒక 'మొత్తం'లో వృద్ధి మాత్రమే సాధ్యమని అభివృద్ధి సాధ్యం కాదని అనుకున్నాం. రెండవ భాగంలో కూడా మార్పులు వచ్చి తిరిగి కొత్త సంబంధాలు ఏర్పడలేని అభివృద్ధి సాధ్యం అనుకుంటే మిగిలిపోయిన వారిని పునర్‌వ్యవస్థీకరించే పద్ధతులు ఆలోచించవలసి వస్తుంది.

ఈ నిర్వాసితులకు అవసరమైన పునరావాస, పునర్‌నిర్మాణ సదుపాయాలు ఎవరు సమకూర్చాలి? ప్రభుత్వమా లేక ఉక్కు కర్మాగారమా లేక వ్యక్తులేనా అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ఉక్కు కర్మాగారం తన నిర్మాణావసరాలకోసం (స్థలం కోసం) ఒక వ్యవస్థనే తోసివేసింది కాబట్టి, పైన చెప్పిన సదుపాయాలకు నైతిక బాధ్యత ఉక్కు కర్మాగారానికే ఇవ్వవలసిఉంటుంది. తాను ప్రభుత్వ సహాయంతో కొన్ని సదుపాయాలు మాత్రమే (పునరావాస కాలనీలు కట్టడం, ఇంటి స్థలం, ఇల్లు కట్టుకోవడానికి అప్పు సహాయం లాంటివి) ఇవ్వడం సాధ్యమనీ, శాశ్వత ఉపాధిలాంటి సదుపాయాలు అందరికీ తాము ఇవ్వలేమనీ, అవి మార్కెట్టు అవసరాల ప్రాధాన్యతతో సమకూరాలని ప్రతిపాదించవచ్చును. మార్కెట్టు ద్వారా సంబంధాలు పునర్‌నిర్మాణం జరిగే సమాజంలో ఎవరు ఈ సదుపాయాలు చేస్తారు అనే ప్రశ్నకి ప్రాముఖ్యత ఉండదు. కాని మనలాంటి సమాజంలో మార్కెట్టుకి అటువంటి శక్తి, సామర్థ్యాలు లేనపుడు ఎవరో ఒకరు బాధ్యత తీసుకొనవలసి ఉంటుంది. ఏ అభివృద్ధి పథకం ద్వారా సమాజంలో విధ్వంసం జరిగిందో, దానికే పునర్ నిర్మాణ బాధ్యత ఇవ్వవలసి ఉంటుంది. ఉక్కు కర్మాగారం ఆ బాధ్యతని తీసుకోనపుడు, మార్కెట్టుకి చేయగలిగిన శక్తి లేనపుడు, పునరావాస కాలనీలో చాలామంది - ముఖ్యంగా పాతగ్రామంలో భూమితో కూడిన వ్యవసాయ సంబంధాలు ఉన్నవాళ్ళు - పనికోసం రోడ్డు దగ్గర, ఫ్యాక్టరీ గేటు దగ్గర ఎప్పుడైనా పని దొరకక పోతుందా అనే ఆశతో ఎదురు చూసే మిగులుసైన్యంగా మిగిలిపోతారు. ఇంకొక విషయం ఈ బాధ్యత ఎవరికి ఉంటుంది అనే ప్రశ్నతోపాటు ఎటువంటి ఉపాధుల ద్వారా సామాజిక నిర్మాణం జరిగి కొత్త సంబంధాలు ఏర్పడే అవకాశం ఉంటుందో అటువంటి కార్యక్రమాలను అమలు చేయడం అవసరమౌతుంది.

మేము సర్వే చేసిన పునరావాస కాలనీ, వారి నిర్వాసిత గ్రామం జాతీయ రహదారికి రెండువక్కలా అతి దగ్గరలోనే ఉంటాయి. భవిష్యత్‌లో చేయబోయే కర్మాగార విస్తరణ అవసరాల రీత్యా ప్రస్తుత అవసరాలకు మించి, అనేక గ్రామాలను ఖాళీ చేయించి ముళ్ళ తీగెల కంచెతో రక్షణ కల్పించుకొని ఏ పనికి ఉపయోగించకుండా వదలివేయబడ్డ భూములు ఒకవైపు, ఈ గ్రామాలనుండి నిర్వాసితులైన కారణంగా వ్యవసాయపు పనులు చేయగలిగిన సమర్థత ఉండి కూడా ఖాళీగా ఉండే నిర్వాసిత ప్రజలు మరొకవైపు మనకు కన్పిస్తారు. ఈ రకంగా ఉత్పత్తికి కావలసిన భూమి, శ్రమ చేసే ప్రజలు విడిపోవటం ద్వారా మనం ఎంచుకున్న అభివృద్ధి మార్గానికి ఉండే వికృత రూపం కనిపిస్తుంది. ఉపయోగానికి రాకుండా వృథా అయిపోతున్న ఈ భూమిని శ్రమ చేసే ప్రజలను ఒక చోట చేర్చి, అవసరమైన సంస్థాగత మార్పులు చేసి వారి సమర్థతని ఉపయోగించుకోగలిగిన ఉపాధులను, డైరీ లేక పౌల్ట్రీలాంటివి ఎంచుకొనవచ్చును. వీటిద్వారా ఉత్పత్తులు చేయగలిగితే వీటికి కావలసిన మార్కెట్టు అప్పటికి అక్కడ ఉంది కాబట్టి కొత్త ఆర్థిక వ్యవస్థలో భాగమై కొత్త సంబంధాలు ఏర్పడగలిగే అవకాశం ఉంటుంది.

అభివృద్ధి పథకాల నిర్మాణం కారణంగా నిర్వాసితులైన కుటుంబాలు కొత్త వ్యవస్థలో ఇమిడిపోలేని సందర్భంలో 'అభివృద్ధి పథకాల ద్వారా అభివృద్ధి' సాధ్యమనే భావజాలం సమాజంలో సందిగ్ధతకి లోనవుతుంది. ఈ సమయంలో ఒక్కొక్క కుటుంబం ఒక్కొక్క ప్రత్యేకతని ప్రకటిస్తుంది. ఆ కుటుంబాలు ఎటువంటి ప్రత్యేకతని ప్రకటిస్తాయి? ఈ ప్రత్యేకతకి నిర్వాసిత కుటుంబాల పునర్ వ్యవస్థీకరణకి ఉండే సంబంధం ఏమిటి? అనే అవగాహన చాలా అవసరమౌతుంది. ఆ కుటుంబాలు ఏ పరిస్థితులలో కొత్త వ్యవస్థలో భాగం అవటం కాని, అవకపోవటం కాని జరుగుతుంది అనే సమాచారం మనకు అభివృద్ధిమీద అవగాహనను పెంచటానికి ఉపయోగపడవచ్చును. ఈ ఊహతో కొన్ని కుటుంబాల నమూనా అధ్యయనం చేయడం జరిగింది. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

1. సన్నకారు రైతు :

సూరిబాబు అనే సన్నకారు రైతుకు పాత గ్రామంలో 2 ఎకరాల మెట్టపొలం ఉండేది. దీనిమీద పండించిన పంట తన కుటుంబ అవసరాలకు సరిపోయేది. గ్రామంలో మెజారిటీ కులానికి చెందటంతో తనకు కావలసిన సామాజిక భద్రత ఉండేది. ఇతడు నివసించిన ఇల్లు పూరిగుడిసె అయినా కూడా ఇంటి చుట్టూ

చాలా ఖాళీస్థలం ఉండటంతో రెండు ఆవులను పెంచుకుని లీటరు ఐదురూపాయిలకు గ్రామంలోనే అమ్ముకొనేవాడు. అతను తన పొలం మీద పనిచేసి రాగులు, సజ్జలు, పెసలు వగైరా పంటలు పండించి కుటుంబ అవసరాలకు వాడుకునేవాడు. పంటలు పండించడానికి అదనంగా అవసరమైన శ్రమకోసం గ్రామంలోని బంధువుల సహాయం తీసుకునేవాడు. తన పొలంలో పండించిన పంటలో సంప్రదాయం ప్రకారం చాకలికి, మంగలికి పది కుంచాలు, సంక్రాంతి, దసరా, దీపావళి లాంటి పండుగలకు వాళ్ళకు భోజనాలు పెట్టటానికి ఉంచుకుని మిగిలినవి తన అవసరాలకు ఉపయోగించుకునేవాడు. మెట్టపొలాల మీద వచ్చే దిగుబడిని గురించి నమ్మకం లేకపోవడంతో గ్రామానికి వచ్చే లారీలకు రాళ్ళు ఎత్తే కూలీపని కూడ చేయడంతో వారానికి వచ్చే వందరూపాయిలతో ఇంటికి కొనవలసిన బట్టలు, ఉప్పు, నూనె లాంటి అవసరాలకు ఖర్చుచేసేవాడు. ఇంటిలో అనుకోకుండా వచ్చే అత్యవసర సంఘటనలకు అంటే పుట్టుకకి, చావుకి, పెండ్లి, రోగం లాంటి వాటికి కావలసిన డబ్బు సహాయం తన కులస్థుడైన గ్రామపెద్ద వడ్డీలేకుండా తొందరగా తీర్చివేయాలని షరతు పెట్టి ఇచ్చేవాడు. తన కుటుంబ అవసరాలకు సరిపడా పంటలు పండించుకోవడం, దీనికి తోడు తనకు గ్రామపెద్ద సహాయం ఉంటుందనే నమ్మకం అతనికొక భద్రతాభావాన్ని కలిగించేది. ఇతని కుటుంబంలో స్త్రీలు ఇంటిని సరిదిద్దుకోవటం, వంట చెయ్యటం ఒక కి.మీ. దూరం నుండి నీళ్ళు మొయ్యటం, వంటచెరకు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు మొదలైనవి పొలం నుండి తెచ్చుకోవటం లాంటి పనులేకాక రోజువారీ వ్యవసాయ కూలీపనులకు కూడా వెళ్ళేవారు. వీరిలో వరకట్న ఆచారం లేదు.

ఉక్కు కర్మాగారం నిర్మాణం మొదలుపెట్టినపుడు తమ పొలాలు తీసివేసుకుని రు.3000 నష్టపరిహారం ఇస్తే, దీనిలో సగం డబ్బు భోజన అవసరాలకు, మిగతాది ఇల్లుకట్టడానికి ఉపయోగించుకున్నాడు. కాలనీలో అందరికీ ఇచ్చినట్లుగా ఇల్లు కట్టుకోవటానికి అప్పుగా రు.10,000 సహాయం దొరికినా, దీనిని ఇంతవరకూ కాలనీలో ఎవరూ తీర్చకపోవడంతో ఇతను కూడా తీర్చలేదు. ఈ డబ్బు సరిపోకపోవడంతో అగనంపూడిలో (అంటే కాలనీ బయట) ఉండే వాళ్ళ దగ్గర మరో రు.30,000 ఎక్కువ వడ్డీకి అప్పుచేసి ఒకే గది ఉండే సిమెంటు ఇల్లు, ముందు వెనక వసారాలు పెట్టుకున్నారు. ఈ ఒకే గదితోనే రైతు, భార్య, తల్లి, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు సభ్యులందరూ సర్దుకోవాలి. ఇతని కుటుంబానికి ఒక ఆర్ కార్డు ఇచ్చినప్పటికీ మొదటలో ఉద్యోగం దొరకక, తరువాతి కాలంలో ఇతని వయస్సు అయిపోవడంతో స్టీల్ ప్లాంటులో ఉద్యోగం రాక ఆర్ కార్డు ఉపయోగం లేకపోయింది. తనకొక శాశ్వత ఉపాధిలేకపోవడంతో ఉక్కు కర్మాగారంలో ఏతావాతా దొరికే కన్‌స్ట్రక్షన్ పనులలో మాత్రమే అవకాశం ఉండటంతో ఉపాధి గ్యారంటీ లేకపోయింది. ఇతనికి నెలకు 15 రోజులు మాత్రమే పని దొరుకుతూ ఉండటంతో మిగతా రోజులు చాలా ఇబ్బందిగా ఉండేది. అందుచేత ఇతని భార్య, తల్లి కూడా దొరికినపుడల్లా రోజు కూలీ పనికి వెడతారు. ఈ కాలనీలో కూడా ఆవును పెట్టుకున్నప్పటికీ ఇంటి చుట్టూ ఖాళీస్థలం కాని ఆవుకు కావలసిన గడ్డికాని లేకపోవడంతో పెద్దగా ఉపయోగం లేకపోయింది. పాతగ్రామంలా కాకుండా ఇక్కడ ప్రతీదీ డబ్బుతో కొనుక్కోవాలి. ఈ కాలనీలో ఒక మంచి ఏమిటంటే ఇంటి ముందే బోరింగు పంపు ఉండటంతో స్త్రీలు మంచినీటి కొరకు చాలా దూరం నడవవలసిన అవసరం లేకపోయింది. మిగతా నిర్వాసిత కుటుంబాలను చూచి తన పెద్దకొడుకుని, తన శక్తికి మించిన పనైనా కూడా ఐ.టి.ఐ. కోర్సులో రు.10,000 అప్పుచేసి చేర్పించాడు. అదిగాక ప్రతి సంవత్సరం ఫీజులకు రు.4,000, జేబు ఖర్చుకు ఇంకా కొంత డబ్బు కావలసి రావటంతో, కొడుకు చదువుకి తీసుకున్న పాత బాకీ తీర్చకుండానే, మళ్ళీ అప్పు చేయడంతో ఇది కుటుంబ ఆదాయం మీద పెద్ద భారమైపోయింది. పాతగ్రామంలో పొలం పనులు చేసే ఆడవాళ్ళకు ఈ కాలనీలో అటువంటి పనులేవీ దొరకక పోవడంతో ఖాళీగా ఉండిపోయారు.

ఈ కాలనీలో వీరి జీవితం మెరుగు పడాలంటే అతని సలహా ఏమిటని అడిగితే, తమలాంటి కుటుంబాలకు నికరాదాయం వచ్చే స్థిరమైన ఉపాధి దొరికినట్లైతే ఆర్థిక ఇబ్బందులు ఉండవనే అభిప్రాయం వెలిబుచ్చాడు. సన్నకారు రైతుగా ఉండే ఇతను భూములను పోగొట్టుకొని కాలనీలో పునరావాసం పొందినప్పటికీ నికరాదాయం వచ్చే స్థిరమైన ఉద్యోగం లేకపోవటం దీనికి తోడుగా తాను తీర్చలేని అప్పుచేసి కొడుకును టెక్నికల్ కోర్సుకి పంపించటం, ఆర్ కార్డు ఉన్నప్పటికీ ఉద్యోగావకాశాలు తనకు, తన కొడుకుకి కూడ లేకపోవటంతో ఈ కుటుంబం కొత్త వ్యవస్థలో ఇమడలేకపోయింది.

2. నూకాలమ్మ

గ్రామంలో ఉన్న ఒకే ఒక మంగలి కుటుంబానికి చెందిన ఈమె తన భర్త, కొడుకుతో ఒక పూరి గుడిసెలో నివసిస్తూ ఉండేది. వీరికి పొలం లేకపోవడం, భర్తకి ఆరోగ్యం సరిగా లేక పూర్తిగా పనిచేయలేకపోవటం, కొడుకు గ్రామంలో మంగలిపని చేసి సంపాదించినది కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో, తానే ముందుకు వచ్చి గ్రామంలోని రైతు కుటుంబాలలో చిల్లర పనులన్నీ చేసి వారి దగ్గర నుండి సహాయం పొంది తనకొక ఆధారం కల్పించుకొంది. ఈ కుటుంబాలలో ఉన్న ముగ్గురు ఎవరికి వారే కష్టపడి సంపాదించవలసి రావడంతో వీరి మధ్య సంబంధాలు నాజూకుగా ఉండి, గ్రామంలో ఊహించని ఏ కొత్త మార్పులు వచ్చినా వీరి ఆర్థిక పరిస్థితి దెబ్బతినేది. ఈమె మంగలి కులానికి చెందటం వలన స్త్రీలు, పిల్లలకు అవసరమయ్యే అనేక పనులలో నైపుణ్యం సంపాదించింది. ఈ కారణంగా గ్రామంలోని రైతుల ఇంటిలోపలికి వెళ్ళి స్త్రీలతో కలువటానికి అర్హత సంపాదించింది.

ఒంటికి నూనె మర్దన చెయ్యడం, తలస్నానం చేయించటం, ప్రసవ సమయంలో అవసరమయ్యే సాయం చెయ్యడం, పుట్టిన పిల్లకి బొడ్డు కొయ్యటం, పదవ రోజున తల్లికి, పిల్లకి పురిటి స్నానం చేయించటం, చంటిపిల్లకు నిప్పుల వేడితో పొట్టకాపడం పెట్టడం, ప్రత్యేకంగా స్నానం చేయించడం లాంటి సేవలెన్నో చేసేది. ఈ సేవలకు ప్రతిగా రూ. 40 లేక 50 ఒక పాతచీర, అప్పుడప్పుడు బియ్యం, పప్పులు, కూరగాయలు ఇచ్చేవారు. తల్లి, పిల్ల సంరక్షణకి సంబంధించిన ఈ పనులే కాకుండా రైతుల ఇంట్లో మిగతా చిల్లర పనులు - ఇంటి బూజులు దులపడం, పెరడుని ఊడ్చి కల్లాపి జల్లటం, పేడతో అలకటం, బియ్యం, పప్పులు బాగుచేయడం, శుభకార్యాలకు పనులు చేసిపెట్టడం లాంటివి - చేసిపెట్టడం మూలన వారు ఇచ్చే బియ్యం, పప్పులు వగైరాలతో తన భోజనానికి ఇబ్బంది పడేది కాదు. ఇవన్నీ కాకుండా సాయంకాలం పూట రామాయణంలో పాటలు పాడటం, నీతి కథలు చెప్పడం లాంటివి చేసి గ్రామంలో వినోదాన్ని, కాలక్షేపాన్ని ఇచ్చేది. ఈమె గ్రామంలోని ఇంటింటికి ఏవో కొన్ని సేవలు చేయడం, ప్రతిగా వారు ఇచ్చే వస్తువులతో గడపడంతో ఈమె రైతుకుటుంబాల మీద ఆధారపడి జీవనం సాగించేది. ఈ సేవలే కాక, గ్రామంలో వినోదాన్ని అందించి నీతిని బోధించే మనిషిగా కమ్యూనిటీలో ఒక గుర్తింపు పొందింది.

కొత్త కాలనీలో ఈమె కుటుంబంలో అనేక మార్పులు రావటం, భర్త చనిపోవటం, కొడుకు పెండ్లి చేసుకుని విడిగా వెళ్ళిపోవటంతో ఈమెకు కొత్త జీవితం మొదలయింది. ఇంటి స్థలం ఇచ్చినా కూడా, పక్కా ఇల్లు కట్టుకునేందుకు తీసుకున్న అప్పు ఇంకా తీరలేదు. తమకు ఆర్ కార్డు ఇచ్చినా కూడ, కొడుకుకి చదువులేకపోవడంతో స్టీలు ఫ్యాక్టరీలో ఉద్యోగం రాలేదు. అందుచేత అతను అగనంపూడి జంక్షన్‌లో చిన్న మంగలి షాపు పెట్టుకుని వారానికి సంపాదించే రూ. 50 లేక 100 వారి కుటుంబానికే సరిపోక ఈమెకు సహాయం చేసే స్థితిలో లేకపోవడంతో, తన కష్టం మీదే ఆధారపడి జీవించవలసిన పరిస్థితి వచ్చింది. కాని ఈ కొత్తకాలనీలో పాత ఆచారాలు, సంప్రదాయాలు లేకపోవడంతో ఈమె చేయగలిగిన పనికి విలువలేకపోయింది. ఆస్పత్రులు, ముఖ్యంగా మెటర్నిటీ ఆస్పత్రులు రావటం, చంటి పిల్లలకు ప్రత్యేకంగా నూనెలు, సబ్బులు, షాంపూలు లాంటివి మార్కెట్టులో రావడంతో తల్లి, పిల్లల సంరక్షణ కోసం ఈమె పూర్వం చేసిన పనులకు ఇప్పటి కొత్తకాలనీలో స్థానం లేకపోయింది. ఇవన్నీ కాక పెడీక్యూర్, మానిక్యూర్, హెయిర్ డ్రస్సింగ్, మసాజ్‌సెంటర్ లాంటి ఫ్యాన్సీపేర్లతో రూపుమార్చేసుకుని వీటికి దుకాణాలు రావడంతో ఈమె స్థానం పూర్తిగా పోయింది. పూర్వం లాగానే కొంతమంది ఇళ్ళలో సహాయంగా చిల్లరపనులు చేసినా కూడా, వారు కూడా నిర్వాసిత సమస్యలనెదుర్కొనవలసి రావడంతో, మునుపటిలాగా డబ్బు కాని, వస్తువులు కాని ఇచ్చే ఆర్థిక పరిస్థితి వారికి లేకపోయింది. ఈ కారణంగా తనకు తానుగా తన శ్రమమీదే ఆధారపడి బతికే పరిస్థితి లేకపోవడం, తన కొడుకు కూడా తనకు సహాయం అందించే స్థితిలో లేకపోవడంతో ఈమె బ్రతుకు దుర్భరమైపోయింది. తన బ్రతుకుకి ఒక ఆధారం కావాలంటే ఏం చెయ్యాలో ఆమెకు తెలియదు. తనకు తల్లి, పిల్లల సంరక్షణకు కావలసిన సాంప్రదాయ సేవలలో నైపుణ్యం చాలా ఉందనీ, ఇంటి పనులలో సహాయం చేసే సమర్థత ఉందనీ, కష్టపడే మనస్తత్వం ఉందనీ, అందరినీ ఆహ్లాదపరిచే జ్ఞానం ఉందనీ, కాని ఇవన్నీ కొత్త వ్యవస్థలో పనికి రాకుండా పోయాయనీ, ఈ వ్యవస్థకి పనికి వచ్చే పనులలో నైపుణ్యం సంపాదించి దాని ద్వారా డబ్బు సంపాదించే శక్తి తనకు లేదని చెబుతుంది.

స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం వలన నిర్వాసితులయ్యే క్రమంలో ఈమెలాంటివాళ్ళు తమ నివాస స్థానాన్నే కాక, తమకున్న నైపుణ్యం ద్వారా గ్రామంలో ఏర్పరుచుకున్న సంబంధాలు కూడా కోల్పోవటం ఒక ఎత్తు అయితే, పునరావాస కాలనీలో తమ నిపుణత పనికిరానిదైపోయి, కొత్త నైపుణ్యం సాధించి దాని ద్వారా కొత్త సంబంధాలు ఏర్పరచుకునే సామర్థ్యం వీరికి లేకపోవటం మరో ఎత్తు. ఈమె జీవితం అభివృద్ధి మూలంగా విధ్వంసమే కాని పునర్‌నిర్మాణం జరుగని స్థితికి గొప్ప ఉదాహరణ. కొత్త వ్యవస్థలో స్థానం సంపాదించలేక ఎందుకూ పనికిరాని వాళ్ళుగా మిగిలిపోయిన వారికి ఈమె ప్రతినిధిగా చూడవచ్చును.

3. చిన్నోడు (చాకలి)

గ్రామంలో ఉన్న 10 చాకలి కుటుంబాలలో ఇతని కుటుంబం ఒకటి. 10 కుటుంబాలు దగ్గర బంధువులవడం మూలన వీరందరూ తొమ్మిది ఎకరాల మెట్టపొలంలో సమష్టిగా సజ్జలు, రాగులు,పెసలు, కొంచెం మోతాదులో పండించినా వారి అవసరాలకు సరిపోయేవి. ఇది కాకుండ తమ కులవృత్తిని అనుసరిస్తూ గ్రామంలోని రైతుకుటుంబాలలో మాసిన బట్టలు ఉతికే పనికూడా చేసేవారు. వీరు గ్రామంలోనే పనులు చేయడం తో ఆగిపోకుండా, గ్రామం బయట ఉన్న సింధియా, పెద్దమడక లాంటి టౌన్‌షిప్పులలో కూడ చాకలి పని చేసేవారు. అంటే వీరు గ్రామంలోపలే వ్యవసాయం ఇతర పనులలో కుదించుకుపోకుండా గ్రామంబయటి పట్టణాలలో కూడా చాకలి పని చేసేవారు.

నేను చూచిన చాకలి కుటుంబం ఈ పది కుటుంబాలలో ఒకటి. ఈ కుటుంబం గ్రామంలో చేసిన సేవల నిమిత్తం ఏడాదికొకసారి కోతల సమయంలో బియ్యం, కొంచెం సజ్జలు, కొంచెం రాగులు కలిపి ప్రతి చాకలి కుటుంబానికి 5 కుంచాల చొప్పున కూలీకి బదులుగా ఇచ్చేవారు. కోతల సమయంలో మిగిలిపోయిన తాలు బియ్యం కూడా వీరి భాగంలోకే. ఇతని భార్య పొలం పనులలోనూ చాకలి పనులలో కూడా భాగం పంచుకునేది. గ్రామం బయట పట్టణంలో చేసిన చాకలి పనికి డబ్బు రూపేణా వచ్చిన రొక్కాన్ని తన ఇంటికి అవసరమైన బట్టలు, నూనెలాంటివి మార్కెట్టులో కొనడానికి ఉపయోగించేవాడు. ఇతనికి అత్యవసర పరిస్థితులొచ్చినపుడు కావలసిన ధనసహాయం గ్రామపెద్ద దగ్గర తాకట్టు పెట్టకుండానే పొందగలిగేవాడు. చాకలి

10 వ తరగతి వరకు చదువుకున్నాడు కాని పరీక్షల్లో చాలా సార్లు ఫెయిల్ అయి ఇంక చదవలేక ఆపేసాడు.

వీరు రెండు విరుద్ధమైన ఆర్థిక వ్యవస్థలు - సంవత్సరమంతా చేసిన పనికి ప్రతిఫలంగా చివరలో సంవత్సరానికొకసారి ధాన్యం రూపంలో ఇచ్చే ఆనవాయితీ ఉండేది ఒకటయితే తమ పనికి ప్రతిఫలంగా ఏరోజు కారోజు, స్థిరంగా ఉండే రేట్లతో, డబ్బు రూపంలో ఇచ్చేది మరొకటి - వీటిలో ఒకే సమయంలో భాగమవటంతో వీరి జీవన విధానం మిగతావారి కంటే భిన్నంగా ఉండేది. ఇటువంటి కుటుంబాలలో అనిశ్చిత పరిస్థితుల ప్రభావం తక్కువగా ఉండటమే కాక భూమితో సంబంధాలు కొంత వరకు బలహీనపడ్డాయి. బయటి ప్రపంచంలో మెరుగైన అవకాశాల కోసం వెతకటం ప్రారంభించాడు. సరిగా ఈ సమయంలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం మొదలు పెట్టడం, దానికి కావలసిన భూమి కోసం గ్రామాన్ని ఖాళీ చేయించడంతో, తప్పనిసరిగా ఇతను నిర్వాసితులకు ఏర్పాటు చేసిన కొత్తకాలనీకి వచ్చి స్థిరపడ్డాడు.

ఈ కాలనీకి వచ్చిన కొత్తలో ఒక సంవత్సర కాలం పాటు చాకలి పనిమీదే పూర్తిగా ఆధారపడ్డాడు. ఆ తరువాత ఆర్ కార్డు ఉండటం, 10 వ తరగతి వరకు చదివిన చదువు ఆధారంగా, లంచాలు ఏమీ ఇవ్వకుండానే, స్టీలు ఫ్యాక్టరీలో కళాసీగా పెర్మనెంటు ఉద్యోగం వచ్చింది. ఇతనికి నెలకి రు.6,000 జీతం వస్తుంది.

వీరికి ఉమ్మడిగా ఇచ్చిన నష్టపరిహారాన్ని చాకలి కుటుంబాలన్నీ కలిసి పంచుకున్నాయి. అందరితో సమానంగా ఇతను కూడా అప్పుచేసి సిమెంటు ఇల్లు కట్టుకున్నాడు. ఈ ఇంటికి కరెంటు ఉండటంతో ఇంట్లో లైట్లు, సీలింగ్ ఫాను, రేడియో, ఇంకా కుర్చీలు, మంచాలు, పరుపులు లాంటి ఫర్నీచర్ కూడా ఉన్నాయి. ఇతని భార్య ఇంటి పనులన్నీ చేసుకుని దగ్గరలోనే ఉన్న గాజువాకలో పనిచేసి సంపాదించిన డబ్బుని ఇంటికి కావలసిన ఉపకరణాలను చేకూర్చటానికి వాడుతుంది. ఇతనికి ఇద్దరు పిల్లలు, మొదటి పిల్ల డాక్టరు సదుపాయం లేక ఏడాది వయస్సులోనే మరణించింది. పది సంవత్సరాల వయస్సున్న రెండవ కొడుకు స్కూలుకివెడుతూ ఉండటంతో కులవృత్తికి సంబంధించిన మెళకువలు నేర్చుకోలేదు. కొత్తకాలనీలో 10 చాకలి కుటుంబాలకు ఇంటి స్థలాలు ఒకే చోట చిన్నవాగు పక్కగా ఉన్నా కూడ పూర్వం ఉన్న సమష్టి జీవనం పోయి, ప్రతి కుటుంబం ఎవరి శ్రమ మీద వాళ్ళు ఆధారపడే స్థితివచ్చింది. అత్యవసర సమయంలో డబ్బు కావలసి వచ్చినపుడు అగనంపూడి బ్రాహ్మణుల దగ్గర ఏదైనా సామాను తాకట్టు పెడితేనే అప్పు దొరుకుతుంది. ఈ కాలనీలో స్థిరపడి 10 సంవత్సరాలు అయిపోవడం, నెలకి ఇంత అని జీతం, అన్ని సదుపాయాలు ఉన్న పక్కాఇల్లు, సాయంగా ఉండే కుటుంబం లాంటివన్నీ ఉన్నా కూడా ఇతను స్టీలు ఫ్యాక్టరీలో పనిచేసే మిగతా వర్కర్స్‌తో కలిసిపోకుండా తమ చాకలి వృత్తిపరంగానే అతని ఆలోచనలు, సంబంధాలు ఉంచుకున్నాడు. దానికి నిదర్శనం కాలనీ అభివృద్ధి కొరకు సలహాలు ఇవ్వమంటే బట్టలు సులభంగా ఉతికేందుకు మంచి దోభి ఘాట్, దీనికి అంతరాయం లేకుండా మంచి సదుపాయం కావాలని చెప్పాడు.

పాతగ్రామంలో వ్యవసాయం, చాకలి వృత్తి ద్వారా ఆదాయం ఉన్నప్పటికి రైతుకుటుంబాల మీద ఆధారపడే స్థితి ఉండేది. కొత్తకాలనీలో నెలసరి జీతం వచ్చే ఉద్యోగం, చాకలి వృత్తి ద్వారా వచ్చే భార్య సంపాదన తోడవడంతో ఆర్థికంగా కుటుంబం బలపడింది. ఇతరుల మీద ఆధారపడే గుణంపోయి, తన జీవితానికి తానే యజమానిగా మారిపోవడంతో ఈ కుటుంబం కొత్త వ్యవస్థలో సులభంగా ఇమిడిపోగలిగింది.

4. రాము (టైలర్) :

ఈ టైలర్ మెజారిటీ కులానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టాడు. ఈ కుటుంబానికి ఉన్న మూడు ఎకరాల మెట్ట పొలంలో ఇతని అన్నదమ్ములందరూ కలిసి వరి, రాగి, సజ్జలు లాంటి పంటలు పండించి తామే వాడుకునేవారు. ఒకవేళ సజ్జలు ఎక్కువగా పండితే గ్రామానికి వచ్చే వ్యాపారికి అమ్మేవారు. గ్రామంలో ఉన్నప్పుడు వీరికి దేనికీ కొరత అనిపించేది కాదు. కాలం గడిచేకొద్దీ అన్నదమ్ముల పెండ్లి అవటం, వారికి పిల్లలు కలగడంతో పొలం మీద వచ్చే దిగుబడి పైన ఆధారపడే సభ్యుల సంఖ్య పెరగడంతో కుటుంబంలో ఆహార ధాన్యాల కొరత కనిపించ సాగింది. పంటలు వర్షాధారమవడం, తాము చేసిన శ్రమమీద ఆధారపడకపోవటం, అంచనాలు తప్పు అవటం లాంటి కారణాల మూలాన దిగుబడి స్థిరంగా లేక తాము తగిన ప్లాన్లు వేసుకో వడానికీ, వాటిని అమలు చేసే విధానాలు రూపొందించే వీలుగాని ఉండేదికాదు.

కుటుంబ పెద్దలు అనేక కారణాలు - తరతరాలుగా వస్తున్న భూమి, భూమికారణంగా సామాజిక భద్రత, పంటలు పండించటానికి ఇక్కడి వాతావరణంలో హెచ్చు తగ్గులు, తమకు బాగా తెలుసని - చూపించి భూమిని అమ్మడానికి అంగీకరించలేదు. ఇతను ఏడవతరగతి వరకు చదవుకొన్న కారణంగా, వ్యవసాయాన్ని అన్నదమ్ములకిచ్చివేసి తాను ఒక టైలర్‌ని ఆశ్రయించి టైలరింగు దూకాణంలో అటెండెంటుగా చేరిపోయాడు. టైలర్‌కి ప్రత్యేకంగా ఫీజుల రూపంలో ఏమీ కట్టకపోయినా, షాపు శుభ్రం చేయడం, కుట్టుమిషన్లు తుడిచి నూనె వెయ్యడం, మిషను సూదిలో దారం ఎక్కించడం, దుకాణానికి వచ్చే కస్టమర్లతో మంచి సంబంధాలు ఉంచుకోవడం లాంటి ఎన్నో చిల్లర పనులు చేసిపెట్టేవాడు. కొంతకాలంలో బట్టలు కుట్టే నైపుణ్యం కూడా సంపాదించుకున్నాడు. ఈ కారణంగా టైలరు మాస్టరు ఇతనికి ఆదర్శప్రాయుడయ్యాడు.

1980లో స్టీలు ప్లాంటు అవసరాల కోసం వీరి గ్రామాన్ని ఖాళీ చేయించి వీరందరినీ పునరావాస కాలనీలకు తరలించి అగనంపూడిలో ఎ3 కాలనీలో స్థిరపరిచారు. ఇతను తన అన్నదమ్ములతో ఇక్కడికి వచ్చి, పక్కపక్కనే ఒకే వరుసలో ఉన్న ఇంటి స్థలాలు తీసుకుని, అందరూ ఉమ్మడిగా లక్ష రూపాయలు

అప్పుచేసి పక్కా ఇళ్ళు కట్టుకున్నారు. తనవాటాకి వచ్చిన ఇంటిలో ముందు భాగంలో ఉండే వసారాని టైలర్ దుకాణంగా మార్చుకున్నాడు. జాకెట్టు కుట్టడానికి రు.6, ప్యాంటు షర్టుకి కలిపి రు.50 తీసుకుంటాననీ, సూట్ కూడా కుట్టగలననీ దానికి రు.200 తీసుకుంటానని చెప్పాడు. తాను కూడా ఒక కుర్రాడిని దుకాణంలో అటెండెంటుగా పెట్టుకుని కుట్టుపని నేర్పుతున్నాననీ తన ఇంటిలోనే ఉంచుకుని తిండిపెట్టి బట్టలుపెట్టి నెలకు రు.100 చేతి ఖర్చుకి ఇస్తానని చెప్పాడు. ఐ.టి.ఐ. విద్యార్థులు, స్కూలు పిల్లలు, ట్రక్కు డ్రైవర్లు- క్లీనర్లు, స్టీలు ప్లాంటు ఉద్యోగులు ఉండటంతో డిమాండు ఎక్కువగా ఉండటం, ఈ ప్రాంతంలో ఇతనొక్కడే టైలర్ అవటంతో అతి తక్కువ కాలంలోనే ఇక్కడ నిలదొక్కుకున్నాడు. తన ఆదాయంతో తన ఇంటికొరకు తీసుకున్న అప్పుతీర్చివేయగలిగాడు. పండుగ దినాలలోనే కాక మిగతా సమయాలలో కూడా డిమాండ్ ఎక్కువగా ఉండటం మూలన తను పని చేసే సమయం పెంచటం, చిన్న పనులకు అంటే చేతితో వేసే కుట్లకు భార్య సహాయం తీసుకోవడం, ముందస్తుగా ప్లానువేసుకుని దానిప్రకారం పనిని ఆర్గనైజు చేసుకుని ఎక్కువ డబ్బు సంపాదించటమే కాకుండా దుకాణాన్ని మరింత పెద్దది చేసుకున్నాడు. గత తొమ్మిది సంవత్సరాలలో దాచుకున్న డబ్బుతో నాలుగు కుట్టుమిషన్లు, ఒక కాజాలు కుట్టేమిషను, చీర అంచులు కుట్టే జిగ్‌జాగ్ మిషన్ ఒకటి కొనుక్కున్నాడు. దుకాణంలో టేబుల్ ఫాన్, చిన్న టెలివిజన్ సెట్ కూడా పెట్టుకున్నాడు.

ఇతనికి ఇద్దరు పిల్లలు, రెండోక్లాసు చదువుతున్న ఏడు సంవత్సరాల అమ్మాయి, పదకొండు నెలల అబ్బాయి ఉన్నారు. ఇతని భార్య పెద్దగా చదువుకోనప్పటికీ దుకాణంలో కావలసిన చేతి పనులు చేసిపెడుతుంది. ఈమెకు తన భర్త ఈ టైలరింగు దుకాణం నడపడం, అందులో ఉండే ఆదాయంలో హెచ్చు తగ్గుల కారణంగా అంత సంతృప్తి పడదు. స్టీలు ప్లాంటులో తన భర్తకి ఉద్యోగం వస్తే బాగుంటుందని భావిస్తుంది. కాని దానికి లంచం రూపంలో ప్రస్తుతం లెక్కల ప్రకారం రూ. 20,000 ఇవ్వటం తమకు చేతకాక పోవడంతో ఉద్యోగం సంపాదించటం అసాధ్యమని కూడా ఆమెకు తెలుసు. టైలర్ మాత్రం తన పనిలో ఎక్కువ డిమాండు - ఎక్కువ శ్రమ - ఎక్కువ ఆదాయానికి దారితీస్తాయని తెలిసి దానికి సరిపడా ప్లాను ప్రకారం పనిచేయగలిగితే ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చుననే విషయం తెలియటం వలన ఈ టైలర్ వృత్తితో చాలా సంతృప్తిగా ఉన్నాడు. విశాఖ పట్టణంలో జగదాంబ సెంటర్‌లో ఎప్పటికైనా డిజైనరు బట్టల దుకాణం పెట్టాలనేది ఇతని కోరిక. దీనికి సరిపడ శ్రమ చేయడానికి ఇతను సిద్ధమే కాని తన కోరికను తీర్చుకునే మార్గమేమిటో తెలియకపోవడంతో అన్నిటికి దేముడిమీద భారం వేసానని చెప్పాడు.

గ్రామంలో వ్యవసాయం మీదే ఆధారపడకుండా బయటి ప్రపంచంతో సంబంధాలు పెట్టుకొని టైలర్ వృత్తి నేర్చుకున్న కారణంగా కొత్తకాలనీకి వచ్చిన తరువాత తనకు అప్పటికే ఉన్న ప్రావీణ్యం ఆధారంగా సులభంగా స్థిరపడగలిగాడు. దానికి తోడు తన పనికి ఎక్కువగా డిమాండ్ ఉండడంతో తన శ్రమని ఎక్కువ చేసి దానికనుగుణంగా ఎక్కువ ఆదాయం సంపాదించడంతో కొత్త ఆర్థిక వ్యవస్థలో సులభంగా భాగమవగలిగాడు.

అభివృద్ధి పథకాల ద్వారా అభివృద్ధి సాధ్యమనే భావజాలం ఆధారంగా విశాఖపట్టణం ఉక్కు కర్మాగారపు నిర్మాణం జరిగింది. ఆ ప్రక్రియలో కొంత స్టీలు ఉత్పత్తులు, ఒక కొత్త టౌన్‌షిప్ ఇత్యాది వృద్ధిని సూచించే మార్పులు వచ్చాయి. కాని స్టీలు ప్లాంట్ వలన భూమి, భూమి చుట్టూ తిరిగే సామాజిక సంబంధాలు కల ప్రజానీకానికి స్టీల్‌ప్లాంట్ ఒక విధ్వంసం చేసింది. అటు భూమి లేక ఇటు కొత్త వ్యవస్థలో భాగమూ కాలేక విధ్వంస జీవితాన్ని అనుభవిస్తున్న ప్రజలు అనేకమంది ఉన్నారు. మనం నిర్వాసిత కాలనీలకు వెడితే కనిపించే దృశ్యం గత 30 సంవత్సరాల కాలంలో పునర్ నిర్మాణం జరుగకుండా అంటే అభివృద్ధికి నోచుకోని ప్రజాజీవితం. ఇక్కడ గమనించవలసిన విషయం ఏ పథకం వలన ప్రజాజీవితం విధ్వంసమైందో ఆ పథకంలో భాగంగా పునర్‌నిర్మాణం చేపట్టకపోతే పథకాలు పథకాలుగానే మిగిలిపోతాయి. ప్రజలు రాబోయే అభివృద్ధి గురించి ఎదురుచూస్తూనే ఉంటారు. ❑

(14 వ పేజీ తరువాయి)

- సామాజిక సేవల రంగంలో సాధారణ, సాంకేతిక విద్యల కోసం రు.5,340 కోట్లకు గాను రు.4,471 కోట్లు; వైద్యం ఆరోగ్యం, కుటుంబసంక్షేమం కోసం 1,640 కోట్లకు గాను రు.1,487 కోట్లు; మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్యం కోసం రు.809 కోట్లకు గాను రు.720 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు.
- ప్రణాళికలో నీటి పారుదల రంగానికి ఎలా కేటాయింపును ఖర్చుచేయలేకపోయిందో, అలాగే బడ్జెట్ కేటాయింపు రూ. 5964 కోట్లకుగాను ఖర్చుచేసింది రూ. 5230 కోట్లు మాత్రమే.
- బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బి.సి సంక్షేమం కోసం చేసిన కేటాయింపులో రు.1,268 కోట్లు తక్కువ ఖర్చు అయింది. (11.13శాతం)

బడ్జెట్ మొత్తంగా చూస్తే రెవిన్యూ పద్దుకింద ఆదాయం రు.32,181 కోట్లు అంచనావేస్తే వాస్తవంలో రు.28,749.50 కోట్లు ఖర్చు అంచనా రు.34,15,154 అయితే వాస్తవంగా రు.31307.34 కోట్లు ఖర్చయింది.

పాఠం :

ముద్ద అంకెలు చూచి మూర్ఛపోనవసరం లేదు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు ఎంతవరకూ వాస్తవ రూపం దాల్చాయో 20-08-09 బడ్జెట్ వరకు ఆగండి. ❑

ఐదు దశాబ్దాల క్రీడా వికాసం

జిఎస్.రాంమోహన్

క్రీడలకు దాదాపుగా మానవసమాజానికున్నంత చరిత్ర ఉంది. సమాజంతో పాటుగా ఇవి కూడా రూపాంతరం చెందుతూ వచ్చాయి. శారీరక దారుఢ్యం, మానసిక వికాసం క్రీడల లక్ష్యాలని చాలామంది చెపుతూ వుంటారు. స్థూలంగా అది సరైనదే. కాకపోతే అంతకంటే ప్రధానమైన లక్ష్యం అవి మానవసంబంధాలను మెరుగుపరుస్తాయి. ఇతరులతో కలిసి మెలగడమెలాగ అనేదానికి చిన్నప్పటినుంచే బీజాలు వేస్తాయి. వ్యక్తిలో సమష్టితత్వాన్ని పెంపొందిస్తాయి అనేంత పెద్ద మాట కాకపోయినా కొంతమందితో కలిసి ఒక పనిలో పాలుపంచుకోవడం వల్ల సమష్టి స్ఫూర్తినైతే ఎంతో కొంత ప్రోది చేస్తాయి అని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. తోటిమనిషి గురించి చుట్టుపక్కల వాతావరణం గురించి అవగాహన కలిపిస్తాయి. కలిసి ఆనందించడం, కలిసి భావావేశాల్ని వంచుకోవడం అనేవి ప్రధానమైన ప్రయోజనాలు. మనిషి తోటిమనిషితో కాకుండా యంత్రంతో క్రీడలాడుకునే (వీడియో గేమ్స్) సంస్కృతి పెచ్చరిల్లుతున్న ప్రస్తుత వాతావరణంలో ఈ అంశం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి వస్తున్నది. నేటి యువత ఇతరత్రా రంగాల్లో ఎంత ముందంజలో వున్నా మానవసంబంధాల దగ్గరకు వచ్చేనరికి కాసింత బేలగా తయారవుతున్నారనే, ఒకింత యాంత్రికంగా ఆలోచిస్తున్నారనే భావన ఒకటి వుంది. చాలా చిన్నచిన్న సమస్యలనే పెను సంక్షోభాలుగా భావించి ఆత్మహత్యలకు పాల్పడేంత అర్భకత్వం పెరుగుతోందనే వాదన సైతం ఉంది. మాట్లాడుకునే, పోట్లాడుకునే వాతావరణం లేకుండా ఎవరి చదువు వారు చదువుకుని ఎవరి ఇళ్లలో వారు ఎవరి యంత్రాలతో వారు గేమ్స్ ఆడుకుంటూ ఆనందించే పోకడల ప్రభావం షాపింగ్‌మాల్స్ కమ్ స్కూల్స్ ప్రభావం ఇందులో ఎంత అనేదానిపై అధ్యయనం జరగాల్సే ఉంది. క్రీడాస్ఫూర్తి కొరవడడం ఇందులో భాగస్వామ్యమైన అంశం. ఏతా వాతా చెప్పొచ్చేదేమిటంటే క్రీడలను సామాజిక గమనానికి విడిగా చూడలేం. సమాజంతో పాటు ఇవి కూడా రైలు పట్టాల్లాగా సమాంతరంగా ప్రయాణిస్తుంటాయి. ఒక రకంగా వీటిని సామాజిక మార్పులకు ప్రమాణాలుగా తీసుకోవచ్చు. కాకపోతే ఇవి నేరుగా ప్రత్యక్షప్రమాణాలుగా ఉండకపోవచ్చు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలు అనగానే కోడి రామ్మూర్తి, దండమూడి రాజగోపాలరావు, పిచ్చయ్య, బాసిత్ అలీ వంటి పేర్లు వినిపించేవి. ఇవాళ సానియా మీర్జా, వివిఎస్ లక్ష్మణ్, కోనేరు హంపి వంటి పేర్లు వినిపిస్తున్నాయి. ముఖేశ్‌కుమార్, గోపీచంద్, కరణం మల్లీశ్వరి, అజారుద్దీన్ తదితర పేర్లు ఇపుడిపుడే పాతబడుతున్నాయి. ఈ కొత్త పేర్లూ వాళ్లు ఆడుతున్న ఆటలూ వాటికవే రాష్ట్రంలో క్రీడాపరిణామాల గురించి చాలావిషయాలను తెలియజేస్తాయి.

50వ పడిలో ఆంధ్రప్రదేశ్

గ్రామీణాంధ్ర పట్టణాంధ్రగా మారుతున్న తరుణాన క్రీడలకూ ఆ లక్షణం అంటింది. బార్బర్ షాపులు బ్యూటీపార్లర్లుగా మారినట్టుగానే ఒకప్పటి హనుమాన్, భీమా వ్యాయామశాలలు-తాలింఖానాలు స్టేఫిట్, హీమ్యాన్ జిమ్‌ల అవతారమెత్తాయి. విజయనగరం సంగడిరాళ్లు నీ అండ్ జెర్కులకు లోనయ్యాయి. కబడ్డీలు, ఖోఖోలు, కుస్తీలు క్రికెట్, టెన్నిస్, చెస్‌లకు దారిచ్చి వాటివెనుక నుంచి అప్పుడప్పుడూ నిక్కి చూసే ప్రయత్నం చేస్తున్నాయి. ఒకప్పుడు అద్భుత క్రీడానైపుణ్యం వెలికి తీసిన జెడ్పీ స్కూళ్ల విశాల క్రీడామైదానాలు ఇవాల్టి పరిణామాలను కళ్లు విశాలం చేసుకుని మరీ చూస్తున్నాయి ఆశ్చర్యంగా. మట్టిలోంచి మాణిక్యాలు వచ్చే పరిస్థితి కనుమరుగవుతున్నది. కులపరంగా, వర్గపరంగా లోతట్టున వున్నవారు ముఖ్యంగా పల్లెవాసులు పైకెదిగే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఎగుమతికి అవకాశాలున్న పంటల్లాగే ఎగుమతికి అవకాశాలున్న క్రీడలకు ప్రాధాన్యం అమితంగా పెరిగింది. ''ప్రొఫెషనలిజం' అనేపదం క్రీడల్లోనూ తారక మంత్రంగా మారింది. మూడు నాలుగేళ్ల నుంచే అన్ని వసతులతో ఏదో ఒక క్రీడలో పూర్తి స్థాయి శిక్షణ పొందితే మినహా ఉన్నత ప్రమాణాలను అందుకునే స్థితి లేకుండా పోయింది. అంటే హైస్కూల్ స్థాయిలో 'ఈ కుర్రాడు లేదా అమ్మాయిలో స్పార్క్ వుంది, ప్రోత్సహిస్తే ఎదుగుతారు' అని ఏ పిఇటినో గుర్తిస్తే వారు పైకి రావడం వంటి పరిస్థితులు ఇవాళ సన్నగిల్లాయి. ఆటల కంటే ముందు పాలనలో ఈ మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ప్రాథమిక స్థాయిలో క్రీడలకు బడ్జెట్ కేటాయింపులను అమాంతంగా కుదించేస్తున్న ప్రభుత్వం అదే సమయంలో కొన్ని విభాగాల్లో అంతర్జాతీయ స్థాయిలో టోర్నీలాడిన క్రీడాకారులకు అంతే అమాంతంగా లక్షల కొద్దీ కుమ్మరించడానికి సిద్ధంగా ఉండడం దీనికి నిదర్శనం. ఇదికూడా క్రీడలను పల్లెవాసులకు దూరం చేస్తున్నది. మరోవైపు కొంతమంది పట్టణ వాసులు అంతర్జాతీయ క్రీడాప్రమాణాలకు ఎదిగేలా చేసింది. కొన్ని క్రీడల్లో రాష్ట్ర యువత అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునే సానుకూల ఫలితాన్నీ చూపింది. ఆయా ఆటల్లో అత్యాధునిక మౌలిక వసతులు, శిక్షణా పద్ధతులు మన ముంగిటికి వచ్చాయి. ఇది నాణేనికి మరో కోణం.

సమాజం మార్కెట్ స్వామ్యం వైపుగా పయనిస్తున్న క్రమం, పట్టణ స్వామ్యం వైపుగా పయనిస్తున్న క్రమం క్రీడల ప్రస్థానంలోనూ కీలకంగా కనిపిస్తుంది. మార్కెట్ విధానాలతో పాటే ప్రచారం, ధనప్రవాహం వాటితో పాటే వాటికి సంబంధించిన క్రీడలూ...ఈ క్రమం ఒక రకంగా అనివార్యమైనది. వ్యాపార యుగానికి అవసరమైన విలువలే క్రీడల్లోనూ చోటుచేసుకోవడం ముఖ్య పరిణామం. ఫలితమే ముఖ్యం- మార్గం కాదు అనే విధానం ఇపుడు మన రాష్ట్రంలోనూ కనపిస్తున్నది. అవి డోప్ వ్యవహారాలు కావచ్చు, ఇతర రాష్ట్రాల, జిల్లాల క్రీడాకారులను అరువు తెచ్చుకుని ఫలితాలు సాధించాలని యత్నించడం కావచ్చు. ఇక టీవీ గ్లామర్ సంగతి చెప్పనక్కర్లేదు. అసలు క్రీడాచరిత్ర గురించి మాట్లాడుకునేటప్పుడు టీవీ విస్ఫోటనానికి ముందు, తరువాత అని మాట్లాడుకోవాల్సిన పరిస్థితి ఇవాళ నెలకొంది. ఎంత ప్రతిభ ఉన్నదనేది మాత్రమే కాదు, నీ ప్రతిభను ఎంతగా ప్రచారం చేసుకోగలవు - అందుకవసరమైన దినుసులు నీ దగ్గర ఏమేం ఉన్నాయి అనేది ప్రధానమైన విషయంగా మారింది. ఒక క్రీడ కారణంగా క్రీడాకారులకు పేరుప్రఖ్యాతులు రావడమనే దశనుంచి క్రీడాకారులను మస్కట్లుగా మార్చుకుని వారికొచ్చిన పేరుప్రఖ్యాతులను చూపి ముఖ్యంగా ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడే డబ్బును ఎరగాచూపి ఆయా క్రీడలకు ప్రచారం కల్పించే పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కముక్కలో క్రీడల కంటే క్రీడాకారులు పెద్దవాళ్లైపోయిన పరిస్థితిని మనమివాళ చూస్తున్నాం. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇవాళ వీస్తున్న గాలి ఇది.

స్థూలంగా ఆంధ్ర ప్రదేశ్ సమాజం ఈ యాభై ఏళ్లలో ఏఏ పాత విలువలను వదిలించుకుని ఏఏ కొత్త విలువలను వంటబట్టించుకున్నదో దాదాపుగా వాటినే క్రీడలూ ఆవహించుకున్నాయి. ఒక్కముక్కలో యువతకు స్ఫూర్తిగా మహాత్మాగాంధీ ఎంతో కొంత నిలిచివున్న కాలానికి ఆ స్థానాన్ని బిల్ గేట్స్ ఆక్రమించిన కాలానికి వచ్చిన మార్పులివి. ఇందులో ప్రతికూలమైన విషయాలూ వున్నాయి. సానుకూల అభివృద్ధీ వుంది. కాకపోతే ప్రతి అభివృద్ధికీ ఒక సామాజిక కోణమున్నట్టే ఇందులోనూ దీనికి సంబంధించిన నిర్దిష్ట లక్షణాలు దాగి ఉన్నాయి.

ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ గ్రామసీమల్లో చాలా క్రీడలుండేవి. ఇప్పటికీ కొన్ని చోట్ల ఉన్నాయి కానీ చాలాభాగం 'నాగరికత' మాటున మరుగున పడి వాటి ఉనికి కోల్పోతున్నాయి. గోలీలాట, బెచ్చాలాట, చిల్లాకోటి (కర్రా బిళ్ల లేదా చిర్రగోనె), వామనగుంతలు (ఓనగుంటలు), కోతికొమ్మచ్చి, దాగుడుమూతలు, ఉప్పు మూటలు, ఎండావానా, బండా నేలా, బారాకట్ట (అష్టాచెమ్మ), వైకుంఠపాళీ, అచ్చనగాయలు, పులిజూదం, ఈత వంటి అనేకానేక ఆటలు ప్రాచుర్యంలో ఉండేవి. ఇవి పూర్తిగా మన బాల్యపు గ్రామీణ క్రీడలు. కాలక్షేపంతో పాటు మానసిక వికాసానికి, ప్రకృతితో సహజీవనానికి అవసరమైన దినుసులు వీటిలో ఉన్నాయి. ఉదాహరణకు కోతికొమ్మచ్చి, ఈత లాంటివి ప్రకృతితో సహజీవనం చేయడానికి, అత్యవసరమైన సమయాల్లో అదే ప్రకృతిని ఎదుర్కొని ప్రాణాలు కాపాడుకోవడానికి అవసరమైన నైపుణ్యాన్ని అందిస్తాయి. కబడ్డీ, కుస్తీల్లాంటివి శారీరక దారుఢ్యాన్ని , పోరాటపటిమను పెంపొందిస్తాయి. పులిజూదం లాంటివి తార్కికశక్తిని, విశ్లేషణా నైపుణ్యాన్ని పెంపొందిస్తాయి. వైకుంఠపాళీ వంటివి జీవనగమనాన్ని తాత్వికంగా వివరిస్తాయి. ఒక్కోదానికి ఒక్కోరకమైన శక్తి వుంది. ఆటల్లో కూడా పెద్దగీత చిన్నగీత వ్యవహారం వచ్చేశాక ఈ చిన్నగీతల్లో నడవడం చిన్నతనంగా మారింది. వీటిని దాటి ఒక్క అడుగు ముందుకొస్తే పాఠశాల స్థాయిలో ఫుట్‌బాల్, వాలీబాల్, కోకో, హాకీ, బాల్ బ్యాడ్‌మింటన్, షటిల్, పరుగుపందాలు, ఇంకొంచెం ముందుకు వస్తే చదరంగం, షటిల్, క్రికెట్ వంటివి ప్రాచుర్యంలో ఉన్నాయి. టెన్నిస్ అప్పటికీ ఇప్పటికీ పూర్తిగా అర్బన్ క్రీడే. అత్యంత ఖర్చుతో కూడుకున్న క్రీడ. 'టెన్నిస్ క్రీడాకారులకు బాగా నజరానాలిచ్చి ప్రోత్సహిస్తున్నారు కదా, మరి అందరికీ ఈ అవకాశం అందేలా పాఠశాలస్థాయినుంచే ప్రోత్సహించవచ్చు కదా' అని ఆర్థికమంత్రిని కనుక మనం ప్రశ్నిస్తే ఆయనకు గుండెపోటు రావడం ఖాయం. అంత ఖరీదైన క్రీడ. చదరంగం లాగా ఫుట్‌బాల్ లాగా 'ఓస్ దానిదేముంది' అనలేరు. సరే! ఆర్థిక సామాజిక నమూనాతో పాటుగా అనివార్యంగా మారిన ఈ క్రీడాంతరాలను కాసేపు పక్కన బెట్టి ఆంధ్రప్రదేశ్ క్రీడాచరిత్రలోకి నేరుగా అడుగుపెడదాం.

పరిశీలన సౌలభ్యం కోసం ఆంధ్రప్రదేశ్ క్రీడాచరిత్రను మూడు భాగాలుగా విభజించుకోవచ్చు. మొదటిది రాష్ట్రం ఏర్పాటు దశ నుంచి 1980 వరకూ. అంటే రాష్ట్రం నిలదొక్కుకునే దశ, క్రీడలపై తగినంత దృష్టి పెట్టలేని దశ. ఆటలను ఆటలుగానే చూసిన దశ. 80 నుంచి 1995 వరకూ రెండో దశ. ఇది క్రీడలపై సర్కారు వారు ఒకింత దృష్టి సారించిన దశ. క్రీడలపై మార్కెట్ క్రీనీడలు అపుడపుడే అలుముకుంటున్న దశ. మూడోది 95 నుంచి నేటివరకూ. ఒకరకంగా ఇది మన హైటెక్ నాయుడుగారి హయాంకు పర్యాయపదమైన కాలం. క్రీడలు హైటెక్ సొబగులద్దుకున్న కాలం. క్రీడావసతులు కేంద్రీకృతమైన కాలం. మార్కెట్ విశ్వరూప సందర్శనా శకం. ఇపుడు తొలినాళ్లలో ఇక్కడ క్రీడల పరిస్థితి ఎలాగుండేది అనేది ముందుగా చూద్దాం.

బూట్లులేని ఫుట్‌బాలర్లు

తొలిదశ(1956-1980)

ఆంధ్రప్రదేశ్ రూపొందే నాటికి మనదగ్గర అత్యంత ప్రాచుర్యం పొందిన క్రీడావిభాగాలు వ్యాయామక్రీడలైన కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్. వాటితో పాటే ఫుట్‌బాల్ . అప్పటికి వ్యాయామక్రీడల్లో దండమూడి రాజగోపాలరావు, కామినేని ఈశ్వరరావు దిగ్గజాలుగా వెలుగొందుతున్నారు. శిఖర స్థాయిలో ఉన్నారు. వారికంటే ముందు ఆ విభాగంలో తిరుగులేని వ్యక్తిగా వున్న కోడి రామ్మూర్తి పంతులు పేరైతే అప్పటికే లెజెండరీగా మారిపోయింది. ఆ మాటకొస్తే ఆంధ్రుల ఆధునిక క్రీడాచరిత్రను

చర్చించుకునేప్పుడు ఆదియందు కోడిరామ్మూర్తి యుండెను అనే వాక్యంతో మొదలు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఆయన స్వాతంత్ర్యోద్యమ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్‌నే ప్రభావితం చేసిన వ్యక్తి అని ముక్కామల నాగభూషణం వంటి పెద్దలు రాశారు. ఆయన గురించి చాలా చాలా కథలు ప్రచారంలో వున్నాయి. మరణించి అరవై ఎనిమిదేళ్లు గడిచినా(1938 జనవరి ఆరు) ఇప్పటికీ గ్రామసీమల్లో సైతం బలాఢ్యులను కోడిరామ్మూర్తితో పోల్చడం ఆయన సాధించిన ఖ్యాతికి అద్దం పడుతుంది. రామ్మూర్తి పంతులు తరానికి దండమూడి, కామినేని తరానికి మధ్య వ్యాయామ క్రీడల్లో ఒక ప్రధానమైన పరిణామం చోటుచేసుకుంది. కోడి రామ్మూర్తి పంతులు పూర్తి ప్రాచీనమైన సంప్రదాయ పద్ధతుల్లో తర్ఫీదు పొందినవారు. కానీ దండమూడి, కామినేని ఆధునిక బార్‌బెల్ పద్ధతుల్లో తర్ఫీదు పొందారు. వారిద్దరికీ గురువు కొల్లి రంగదాసుచౌదరి. రంగదాసుచౌదరి కూడా బలప్రదర్శనలివ్వడంలో దిట్ట. ఆయన ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షులుగా పనిచేశారు. ఢిల్లీలో 1951లో జరిగిన తొలి ఆసియా క్రీడల్లో కామినేని ఈశ్వరరావు కాంస్యపతకం సాధించారు. అదే క్రీడోత్సవంలో 'మిస్టర్ ఏసియా' పోటీల్లో రజత పతకం సాధించారు. 1963లో భారత ప్రభుత్వం ఈయనను అర్జున అవార్డుతో సత్కరించింది. ఈశ్వరరావు 1952(హెల్సింకి), 1956(మెల్బోర్న్) ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. రాజగోపాలరావు ఈ రెంటితో పాటు 1948(లండన్) ఒలింపిక్స్‌లో కూడా పాల్గొన్నారు. ఈ ఇద్దరితో పాటు ఆ కాలంలో వెయిట్ లిఫ్టింగ్‌లో వెలుగొందిన మరోపేరు ఆర్జా జనార్ధనరావు. ఆయన 1955లో భారతశ్రీ అవార్డును గెలుపొందారు. అవార్డులు, రివార్డుల సంగతి పక్కన బెడితే రాష్ట్ర వ్యాప్తంగా పండుగలు పబ్బాల్లోనూ ఇతరత్రా గ్రామోత్సవాల్లోనూ సంప్రదాయకంగా వస్తున్న సంగిడిరాళ్ల(గుండ్రటి రాతిగుళ్లు) పోటీలు ఈ వ్యాయామ క్రీడలో అప్పటి క్రీడాకారులు తయారవడానికి బీజమేసి ఉంటుందని భావించవచ్చు. ప్రత్యేకించి సంగిడిరాళ్ల వ్యాయామం విజయనగర ప్రాంతంలో ఎక్కువగా ప్రాచుర్యంలో ఉండడం తర్వాతి కాలంలో అక్కడినుంచి ఎక్కువగా వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణులు రావడం పరస్పర సంబంధం లేనివిగా భావించలేం.

వెయిట్ లిఫ్టింగ్‌తో పాటు మనం గర్వంగా చెప్పుకోగలిగిన క్రీడ ఫుట్‌బాల్. ఇందులో మన చరిత్ర వెలుగు చీకటుల రంగేళి. హైదరాబాద్‌లోనూ, మిగిలిన రాష్ట్రంలోనూ ఫుట్‌బాల్ చరిత్ర కృష్ణపక్షమే. రాష్ట్రంలోని అనేకప్రాంతాల్లో ముఖ్యంగా తీరాంధ్రంలో ఫుట్‌బాల్ తొలిదశలో ఒక వెలుగు వెలిగినా శాస్త్రీయ పద్ధతుల్లో ఎదగలేకపోయింది. ప్రసాద్ బ్రదర్స్, రఘుపతి బ్రదర్స్, కాట్రగడ్డ బ్రదర్స్, అత్తిలి బ్రదర్స్, గంగూలీ బ్రదర్స్, చిట్టి బ్రదర్స్ వంటి కుటుంబ నామధేయాలు తొలిదశలో పేరుగాంచాయి. విశాఖ, విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, గుంటూరుల్లో క్లబ్బులు కూడా ఏర్పడి ఆటకు ఒకింత ప్రోత్సాహం అందించాయి. ఈ ఘన వారసత్వం ఫలితంగానే 1975,1978 సంవత్సరాల్లో జరిగిన అఖిలభారత గ్రామీణ క్రీడోత్సవాల్లో ఆంధ్రజట్టు బంగారు పతకం సాధించగలిగింది. తర్వాత క్రమంగా ప్రాభవం తరుగుతూ వచ్చింది. ఇవాళ అన్నలు చెప్పుకోవడానికేమీ మిగలని స్థితి. ఇక హైదరాబాద్‌ది మరింత ఘనమైన చరిత్ర. జాతీయస్థాయిలో ఫుట్‌బాల్‌కు హైదరాబాద్ పర్యాయపదంగా భాసిల్లిన రోజులవి. సాంకేతికంగా కూడా ఉత్తమనైపుణ్యం సాధించి యావత్ ఆసియా ఖండం చేత శహభాష్ అన్పించుకున్న దినములవి. 1948 నుంచి 1960 వరకూ జాతీయస్థాయిలో హైదరాబాద్ జట్టు ఏకచ్ఛత్రాధిపత్యం కొనసాగింది. భారత ఒలింపిక్స్ జట్టులో మెజారిటీ సభ్యులు హైదరాబాద్ వాళ్లే ఉండేవారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో చూసినప్పుడు ముఖ్యంగా ఫుట్‌బాల్‌ను తాగి ఫుట్‌బాల్‌ను తిని ఫుట్‌బాల్‌ను శ్వాసించే యూరోప్, ఆఫ్రికాలతో పోల్చిచూసినప్పుడు టెక్నిక్ పరంగా గాని దేహదారుఢ్యం పరంగా కాని భారత ఆటగాళ్ల స్థాయి ఒకింత దిగువగానే ఉండేది. 1948లో కాళ్లకు బూట్లలాంటివి ఏమీ లేకుండా భారత ఆటగాళ్లు సన్నద్ధమైన తీరును యూరోపియన్ ప్రపంచం నివ్వెరపోయి చూసింది. యూరోపియన్లతో పోటీపడలేకపోయినా మిగిలిన ఆసియా దేశాల్లో మాత్రం ఎదురులేకపోవడంతో 1951 ఢిల్లీ ఏసియాడ్‌లో భారత్ స్వర్ణ పతకం సాధించగలిగింది. తర్వాత 1962 ఏసియాడ్‌లోనూ స్వర్ణం గెలుచుకుంది. క్రమేపీ బలహీనపడి 1970 ఏసియాడ్‌లో తృతీయ స్థాయికి చేరింది. తర్వాత ఇక కోలుకోలేదనుకోండి! నెమ్మదిగా ఇది ప్రధానంగా బెంగాల్ క్లబ్బులకు సంబంధించిన క్రీడగా స్థిరపడిపోయింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్ ఏ రహీమ్, ధనరాజ్, మొయినుద్దీన్, అజీదుద్దీన్, నూర్ మొహమ్మద్, లతీఫ్, రంగరాజ్, అహ్మద్ హుస్సేన్, బలరామ్, ఎస్ ఎ సలామ్, జుల్ఫికరుద్దీన్, హమీద్, హకీమ్, యూనస్ ఖాన్, కన్నన్, నయీముద్దీన్ భారత్ తరపున ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొన్నారు. వారి తర్వాత హైదరాబాద్ ఫుట్‌బాల్‌లో సోదిలోకి లేకుండా పోయింది. ఫుట్‌బాల్‌ను సీరియస్‌గా తీసుకుని ఆడేవారు కరువయ్యారు. యూరోపియన్ ప్రపంచం అందులో ప్రమాణాలను అమాంతంగా పెంచేసింది. దీంతో భాగ్యనగరాన గతంలో ఫుట్‌బాల్ కాంతులీనిన మైదానాలు సైతం ప్రధానంగా క్రికెట్‌కే పరిమితమైపోయాయి. అలాగే చదరంగంలో హైదరాబాద్ గాలిబ్ లాంటి ఆటగాడిని అందించింది. ఆయన శిష్యులు, ప్రశిష్యులు ఇవాల్టికీ జాతీయస్థాయిలో సంచలనాలు సృష్టిస్తూనే ఉన్నారు. బాల్ బ్యాడ్మింటన్‌ది ఒక వింతపరిస్థితి. జమ్మలమడక పిచ్చయ్య, ఎస్.ఎ. ఇక్బాల్ వంటి ఉద్దండులు ఇందులో ఉద్భవించినా తర్వాతర్వాత ఇది ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోవాల్సివచ్చింది. ప్రత్యేకించి పిచ్చయ్య దాదాపు మూడు దశాబ్దాల పాటు ఇందులో ఎదురులేని వీరుడిగా పేరుగాంచాడు. ఆయన పేరుతోనే బ్యాడ్మింటన్ బాట్లు కూడా వచ్చాయి. 70'లు 80'ల్లో బ్యాడ్మింటన్ ఆడిన వారికి ఆయన ఈ క్రీడలో ఎంతటి ప్రఖ్యాతి సాధించాడో ప్రత్యేకించి పరిచయం చేయాల్సిన అవసరం లేదు. అంతటి లెజెండ్ ఇవాళ వరంగల్‌లో ఒక దుకాణం

పెట్టుకొని 'అనామకంగా' రోజులు నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడడం క్రీడలను అధ్యయనం చేసేవారు ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకోవాల్సిన విషయం. ఆయన్ను భారత ప్రభుత్వం 1970లో అర్జున అవార్డుతో సత్కరించింది. తర్వాత 1975లో మరో మేటి బ్యాడ్మింటన్ ఆటగాడు ఇక్బాల్ కూడా అర్జున అవార్డు పొందారు. బాల్ బ్యాడ్మింటన్ గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కావడం అందులోనూ దక్షిణాదికి మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు పరిమితమై విస్తరించలేకపోవడం వల్ల ఒక కళాత్మకమైన క్రీడ ఇక్కడే ఆగిపోవాల్సివచ్చింది.

చెడుగుడు నుంచి కబడ్డీ దాకా

కబడ్డీది ఇంకా చిత్రమైన చరిత్ర. తెల్లవాళ్లు దీనిని కేవలం ఆటగానే చూడలేదు. దీని ద్వారా ఏదో జరిగిపోతుందని అనుమానించారు. స్వాతంత్ర్యోద్యమకారుల సంగమ స్థావరాలుగా కబడ్డీ పోటీలు తయారయ్యాయని, ఇక్కడ పోగయ్యే యువత మరింత చురుకుదనం సంతరించుకుని తమపైకి అస్త్రంగా మారుతున్నదని అనుమానించి కాబోలు 1931లో తెల్లదొరల ప్రభుత్వం దీన్ని నిషేధించింది. అయితే ఇది భారతీయుల జాతీయ క్రీడ అని మహాత్మాగాంధీ. నెహ్రూ, బోస్ లాంటి అతిరథ మహారథులు స్పష్టం చేశారు.(అప్పటికది అనధికార జాతీయ క్రీడ స్థాయిలో ఉండేది) భారత గ్రామసీమల్లో ఈ ఆట ఆడకుండా ఎవరూ అడ్డుకోలేరని సవాల్ కూడ విసిరారు. (కబడ్డీకి ఇంత సత్తా వుందా అనిపించవచ్చుగాని ఇవాళ ముంబైలో గణేశ్ చతుర్థి సందర్భంగానూ హోళీ సీజన్‌లోనూ శివసేన కబడ్డీ పోటీలను భారీస్థాయిలో వాడవాడలా నిర్వహించడం చూస్తే యువతలో వున్న చురుకుదనాన్ని వినియోగించుకోవడంలో కబడ్డీకి అటువంటి మార్మికమైన సత్తా ఏదో ఉండొచ్చని అర్థమవుతుంది.) చివరకు స్వాతంత్ర్య సమర యోధులు ఆనాడు రహస్యంగా ఈ ఆటను ఆడేవారంటే అప్పటికి మన దేశ క్రీడాసంప్రదాయాల్లో కబడ్డీది ఎంత ఉన్నత స్థానమో అర్థమవుతుంది. ఎర్ర ఏగాని ఖర్చుకాకుండా నలుగురు కలిసి ఎక్కడైనా ఆడుకోవడానికి వీలైన ఈ ఆట అసలు సిసలైన ప్రజాస్వామిక క్రీడ. మన దేశంలో రాజుల కాలంనుంచి ఆ మాటకొస్తే, 'ద్వాపర యుగపు కాలం నుంచి కూడా ఈ ఆట ఆడుకునేవారని మన పురాతన గ్రంథాలు, ఇతిహాసాలు తెలియజేస్తున్నాయి. గోపాలురతో గోవిందుడు ఈ ఆటను ఆడినట్టుగా భారతంలో ఉంది'. కాకపోతే దీన్ని ఇటీవలి వరకూ మనం చెడుగుడు అని పిల్చుకునే వారం. ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి ముందు చెడుగుడులో తిరుగులేనివారనిపించుకున్న తెలుగువారు అది కబడ్డీగా రూపాంతరం చెందాక ఆ స్థాయి ప్రతిభ చూపలేకపోయారనే చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే సూర్యదేవర అంకినీడు చెడుగుడు పితామహుడిగా పేరొందిన కాలంలో మనమందులో తిరుగులేని ఆధిపత్యంలో ఉన్నాం. గోకినేని సోదరులు, దాసరి రాములు, దాసరి సీతారామయ్య, హమీద్, తిలక్, సాలేఖాన్, కరీం, అవధాని, చెంచయ్య, పుచ్చా కృష్ణమూర్తి, గరికపాటి నాగేశ్వరరావు, సుబ్బులు, ధనుంజయరావు మొదలైన వారు చెడుగుడులో సాటిలేని ఆటగాళ్లుగా ఒక వెలుగు వెలిగారు. అత్యంత సరళంగా ఉండే చెడుగుడు కొత్త నిబంధనలతో కబడ్డీగా మారడాన్ని తీవ్రంగా ప్రతిఘటించిది కూడా ఆంధ్రులే. ఈ ప్రతిఘటన ఫలితమో లేక సరికొత్త నిబంధనలు అంతగా గ్రామసీమల్లోకి వెళ్లకపోవడం వల్లనో తర్వాత ఇది మనకబారింది. మహారాష్ట్ర, బెంగాల్‌లు దీని అభివృద్ధిని భుజాన వేసుకున్నాయి. ముంబై నగరంలో అయితే గణేశ్ చతుర్థి వంటి సందర్భాల్లో ఎక్కడ చూసినా భారీస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. తర్వాత్తర్వాత సర్వీసెస్, బిఎస్ఎన్ఎల్, రైల్వేస్ వంటి స్పాన్సర్ గజాలు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిందనుకోండి. అది వేరే కత. 1976లో జరిగిన జాతీయ మహిళా క్రీడోత్సవాల్లో రెండోస్థానం తప్పించి మనకు చెప్పుకోదగిన విజయాలేమీ లేవు.

తొలి మహిళామణి ములినీ

ఇవి కాక టేబుల్ టెన్నిస్, వాలీబాల్ వంటి క్రీడలు కూడా ఈ తొలిదశలో ఒక మెరుపు మెరిసి వెళ్లిపోయాయి. ముఖ్యంగా 1970-80 మధ్యకాలంలో రాష్ట్రం వాలీబాల్‌లో గణనీయమైన ప్రతిభచూపి జాతీయస్థాయిలో పేరుగాంచింది. ప్రఖ్యాత వాలీబాల్ క్రీడాకారుడు శ్యాంసుందర్‌లాల్ 1973లోనూ, ఎ.రమణారావు 1977లోనూ అర్జున అవార్డు సాధించారు. అదే దశాబ్దంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వాలీబాల్ క్రీడాకారిణి ములినీ రెడ్డి 1973లో అర్జున అవార్డు సాధించారు. మహిళల్లో తొలి అర్జున అవార్డు పొందిన క్రీడాకారిణిగా రికార్డుకెక్కారు. క్రీడల్లో మహిళలను ప్రోత్సహించే విషయమై వెనుకా ముందాడే రాష్ట్రంలో ఆమె ఎంతోమంది యువక్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలిచారు. మహిళలు ఆటల్లో రాణించడానికి చాలా ప్రతిబంధకాలు ఎదుర్కోవాల్సివున్న కాలమది. అయినా వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీల్లో రాష్ట్ర మహిళలు బాగా రాణించేవారప్పుడు. 1975లో జరిగిన అఖిలభారత గ్రామీణ కబడ్డీ పోటీల్లో రాష్ట్ర బాలికలు ప్రథమస్థానం సాధించారు. అదే ఏడాది షిమోగాలో జరిగిన జాతీయబాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర మహిళల జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్ర బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి గ్లోరియా జాన్సన్ ఆసియా క్రీడల్లో పాలుపంచుకుంది. 1976లో ఢిల్లీలో జరిగిన జాతీయ మహిళా క్రీడోత్సవాల్లో రాష్ట్ర వాలీబాల్, కబడ్డీ జట్లు రెండూ రెండవ స్థానం సంపాదించాయి. 1977లో బెంగుళూర్‌లో జరిగిన జాతీయ మహిళా క్రీడోత్సవంలో రాష్ట్ర టేబుల్ టెన్నిస్ బృందం ఛాంపియన్‌గా నిలిచింది. 80 ఫిబ్రవరిలో జరిగిన అంతర్‌రాష్ట్ర అథ్లెటిక్ పోటీలలో రాష్ట్రబాలికలు జూనియర్ ఛాంపియన్ షిప్ సాధించారు. ఖోఖోలో కూడా రాష్ట్ర క్రీడాకారులు ఫర్వాలేదనిపించారు. 1959-60లో విజయవాడలో జరిగిన తొలి జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలలో రాష్ట్రం ద్వితీయ స్థానం సంపాదించింది. 75లో బాలికలు రెండవస్థానాన్ని 76లో బాలురు ప్రథమస్థానాన్ని సాధించారు. (ఇంకా ఉంది)

(త్వరలో సిడిఆర్‌సి ప్రచురణగా రాబోతున్న ఎపి-50 లోంచి)

పోలవరం: ఉత్తర తెలంగాణ మరో సోమాలియా కానుందా ?

చిక్కుడు ప్రభాకర్

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలోనే అప్పటి ప్రభుత్వం గోదావరి జలాలను వినియోగించే నిమిత్తం (నేటి పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలంలోనే) శ్రీరామపాద సాగర్ పేరుతో ప్రాజెక్టు కట్టి ఆంధ్రప్రాంత ఆయకట్టు దాదాపు పదిలక్షల ముప్పైనాలుగువేల ఎకరాలకు సాగు నీరందించాలని, నూటయాభై మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. కాని దశాబ్దాలుగా ఆ ప్రాజెక్టు ప్రతిపాదనలు పెండింగ్‌లోనే వుండిపోయాయి. 1983 లో రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం విస్తృతంగా సర్వే చేసి 1985 లో కేంద్రజల సంఘానికి ప్రతిపాదనలు పంపింది. సరైన వివరణలు లేనందున 1987లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు కేంద్ర జలసంఘం తిప్పిపంపింది. 1990 లో మరో ప్రయత్నం జరిగినా, ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం ఆమోదం తెలుపలేదు.

ఇంతకాలం ఈ ప్రాజెక్టు పెండింగ్‌లో ఉండటానికి మూడు కారణాలు ప్రధానంగా చెప్పవచ్చు. 1. దాదాపు రెండు లక్షల మంది ప్రజలు, విశాలమైన అడవి ఇందులో ముంపునకు గురికావడం. 2. ఇంత భారీ ప్రాజెక్టుకు అవసరమయిన నిధుల కొరత. 3. గోదావరి పరీవాహకప్రాంతం ఇరవైశాతం కూడ లేని ఆంధ్రప్రాంతానికి ఈ ప్రాజెక్టు కట్టి నీరివ్వడం ద్వారా మిగతా ఎనభైశాతం నదీ పరీవాహక ప్రాంతమున్న ఉత్తర తెలంగాణలో అలజడి రేగుతుందని భావించడం. పై మూడు కారణాలలో మొదటి రెండు కారణాలే బలంగా ఈ ప్రాజెక్టు ఆగేందుకు దోహదపడ్డాయని చెప్పవచ్చు.

వ్యాఖ్య

కాని రెండు సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడింది. తెలంగాణలో పూర్తిగా వివాదస్పద ప్రాజెక్టులుగా పేరొందిన పోలవరం, పులిచింతలను ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాల కాలంలో నిర్మించాలని నిర్ణయించింది. గతంలో ఈ ప్రాజెక్టుల డిజైన్‌లు మార్చి, తాను కొత్త డిజైనులు చేసి కేంద్ర జలసంఘానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్ర జలసంఘం ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ఆర్థికసంఘం ఆమోదం కూడా పొందవలసి ఉంటుంది. అలాగే గిరిజన ప్రాంతంలోనైతే రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు ప్రకారం దేశ అధ్యక్షుడు గిరిజన కమిషన్ సలహా తీసుకుని ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే గిరిజన ప్రాంతంలోని ప్రాజెక్టు కడుతున్న స్థలంతో పాటు ముంపునకు గురవుతున్న ప్రాంతంలోని గ్రామాలు గ్రామసభలు జరిపి ప్రాజెక్టుకు అనుమతినిస్తూ తీర్మానాలు చేయవలసి ఉంటుంది. ప్రశాంత వాతావరణంలో ప్రజాభిప్రాయం సేకరించి రాష్ట్రపతికి ప్రభుత్వం పంపించవలసి ఉంటుంది.

వీటిలో ఏ నియమం కూడ పాటించని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన టెండర్ల ప్రక్రియ ముగించి ప్రాజెక్టు పనులు ప్రారంభించింది. వివాదస్పద ప్రాజెక్టు అయిన పులిచింతలలో విశాల సున్నపురాయి గనులు, తెలంగాణలోని, పల్నాడులోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతుండగా, పోలవరం ప్రాజెక్టువలన దాదాపు మూడు రాష్ట్రాలు వరుసగా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒరిస్సాలలోని పలుగ్రామాలు ముంపునకు గురవుతాయి. వరుసగా 276 గ్రామాల్లో 1,77,512 ప్రజలు; 16 గ్రామాలు 12,000 ప్రజలు; 11 గ్రామాల్లో 7000 ప్రజలు ఈ రాష్ట్రాలలో ముంపున బారిన పడుతున్నారని పభుత్వం అంచనావేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలలో తెలంగాణ జిల్లా అయిన ఖమ్మం జిల్లాలోనే కనీసం ఏడు మండలాలు, దాదాపు ఒకటిన్నర లక్షల మంది ప్రజలు ముంపునకు గురవుతారు. కాని ఒక్కసారి ఈ భారీప్రాజెక్టు నిండితే ఇంతకు రెట్టింపు ప్రాంతం ముంపునకు గురికావడం ద్వారా లక్షలాది గిరిజన ప్రజలు ముంపునకు గురవుతారని గతంలో భారీ నీటి ప్రాజెక్టులలో పనిచేసిన వారు చెబుతున్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం తన అంచనా ప్రకారం పరిహారం చెల్లిస్తానని ప్రకటిస్తూ ఈ నిపుణులు ఇస్తున్న ముంపు అంచనాను బుట్టదాఖలు చేసింది.

గోదావరి నదీ పరీవాహకప్రాంతం, జస్టిస్ బచావత్ అవార్డు, సామాజిక న్యాయం ఇలా ఒక్కో అంశాన్ని పరిశీలిస్తే గత కొన్నిరోజులుగా ప్రభుత్వాలు కొన్ని ప్రాంతాల పట్ల చూపెడుతున్న వివక్ష, కొన్ని ప్రాంతాలపై చూపెడుతున్న అపరిమితమైన ప్రేమ వలన కొన్ని ప్రాంతాలు వెనుకబడిన ప్రాంతాలుగానే చరిత్రలో మిగిలిపోవలసివస్తుందేమో అనే అనుమానం వస్తుంది.

మహారాష్ట్రలో పుట్టిన గోదావరి నది మనరాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాలో ప్రవేశిస్తుంది. నిజామాబాద్ తర్వాత అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల తర్వాత ఉభయ గోదావరి జిల్లాల ద్వారా 'అంతర్వేది' దగ్గర సముద్రంలో కలుస్తుంది. మన రాష్ట్రంలోకి ఈ నది ప్రవేశించిన తర్వాత ఉభయ గోదావరి జిల్లాలు మినహాయిస్తే మొత్తం పరీవాహక ప్రాంతం ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే ఉంటుంది. ఈ నది ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించిన తర్వాత ఉత్తర తెలంగాణ ప్రాంతంలో మంజీర, ప్రాణహిత, పెన్‌గంగ, శబరి, ఇంద్రావతిలాంటి ఉపనదులను

కలుపుకుంటుంది. ఈ ఉపనదులే కాక ఎన్నో పెద్ద, చిన్న వాగులు, వంకలు కలుపుకుంటుంది.

జస్టిస్ బచావత్ నాయకత్వంలోని గోదావరి జలాల ట్రిబ్యునల్ 1980 లో తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి జలాల వాట 1480 శతకోటి ఘనపుటడుగులు(టిఎంసి)గా నిర్ణయించింది. అంతకుముందే ఉత్తర తెలంగాణలో శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు (113 టిఎంసిల వినియోగం), ఆంధ్రప్రాంతంలో ధవళేశ్వరం లేదా సర్‌అర్థర్‌కాటన్ ప్రాజెక్టు (263 టిఎంసి ల వినియోగం) కలిపి గోదావరి నదిమీద కట్టబడినాయి. దాదాపు 80 శాతం గోదావరినది పరీవాహక ప్రాంతం కలిగిన ఉత్తర తెలంగాణలో ఒక్క శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు తప్ప, 100 టిఎంసిల నీరు వినియోగించగల ఒక్క ప్రాజెక్టు కూడ లేదంటే ఆశ్చర్యంకాదు, ఇది అక్షర సత్యం. ఇప్పటికే ఆంధ్రలో కనీసం 350 టిఎంసిల వరకు, తెలంగాణలో 300 టిఎంసిల వరకు అంటే దాదాపు 600 నుండి 700 టిఎంసి రెండు ప్రాంతాలు కలిపి మధ్యతరగతి, భారీ, చిన్నతరహా పంచాయత్‌రాజ్ పథకాల లాంటి చిన్ననీటి వనరుల ద్వారా వాడుకుంటున్నాం. ఇందులో ఎనభై శాతం నదీ పరీవాహక ప్రాంతం కలిగిన తెలంగాణ ప్రాంతం, ఇరవైశాతం పరీవాహక ప్రాంతం కలిగిన ఆంధ్రప్రాంతం సమానంగానే ఈ నది నీరు ఉపయోగించుకుంటున్నారు. ఇప్పుడైనా ఎనభైశాతం పరీవాహక ప్రాంతం కలిగిన తెలంగాణలోనే ఎక్కువమోతాదులో ఆయకట్టుకు నీరందించే ప్రయత్నం ప్రభుత్వం చేయాలి. కాని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అలా చేయడం లేదు.

ఎనభైశాతం పరీవాహక ప్రాంతం కలిగిన ఈ అయిదు జిల్లాల్లో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వేలాది గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. వేసవి కాలంలో కనీసం రక్షిత మంచినీరయినా దొరకక, కలుషిత నీరు తాగి అతిసారతో వేలాది ప్రజలు మరణిస్తున్నారు. మరణించేవారిలో ఎనభై శాతం గిరిజనులే. ఈ అయిదు జిల్లాలలోని మెజారిటి ప్రాంతాలలో భూగర్భ జలాలు దాదాపు 200 అడుగుల లోతుకు పడిపోయాయి. దాదాపు 60 పట్టణాలు, 2000 గ్రామాలు ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడినాయి. స్వాతంత్ర్యానికి పూర్వం తవ్విన చెరువులు, కుంటలు పూడిక నిండిపోయి ఇసుకమెట్టలుపేరుకపోయి వర్షాకాలంలో అతి తొందరలో చెరువులు కుంటలు నిండి కట్టలు తెగిపోతున్నాయి. ఆనాటి చెరువులు, కుంటలు నేటికీ పూడిక తీయకపోవడం ఈ ప్రభుత్వాల తెలంగాణ పై వివక్షకు మరో మచ్చుతునక మాత్రమే. ఫలితంగా రైతాంగం ఇటు ఖరీఫ్‌లోను, అటు రబీలోను సాగునీరందక పోవడం వలన పూర్తిగా ఇబ్బందులు పడుతున్నది. దీనికి తోడు గత పదిహేను సంవత్సరాలుగా అమలు అవుతున్న ప్రపంచీకరణ నూతన ఆర్థిక విధానాల ద్వారా విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల ధరలు పెరిగిపోయాయి. పైగా నకిలీ పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు కూడ మార్కెటులోకి విస్తృతంగా ప్రవేశించాయి. వాటిని అదుపు చేయగలిగే చిత్తశుద్ధి, నిజాయితీ కలిగే రాజకీయ వ్యవస్థకాని, అధికార యంత్రాంగం కాని లేకపోవడం, అరకొరగా పండిన ఉత్పత్తులకు సరియైన ధరలు లేకపోవడం వలన ఈ ప్రాంతంలోని వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేయబడింది. ఫలితంగా కనీసం అయిదువేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన జలయజ్ఞంలో పోలవరం, పులిచింతల ప్రాజెక్టులకిచ్చిన ప్రాధాన్యత, నిధుల కేటాయింపులు ఏ ఇతర ప్రాజెక్టులకివ్వలేదు. ఉత్తర తెలంగాణలో గోదావరి నది మీద నిర్మించుచున్న ప్రాణహిత - ఎల్లంపల్లి, దేవాదుల, దుమ్ముగూడెంలాంటి ఎత్తిపోతల పథకాలకు అరకొర నిధులు కేటాయించింది. ఈ ప్రాంతంలో అతి పెద్దదిగా భావిస్తున్న ఎల్లంపల్లి - ప్రాణహిత ఎత్తిపోతల పథకానికి మొదట 220 టిఎంసిల నీరుగా నిర్ణయించి తర్వాత 165 టిఎంసిలకే సర్వే చేయాల్సిందిగా ప్రభుత్వం జి.వో. విడుదలచేసింది. ప్రజాసంఘాల, మేధావుల, ప్రజాస్వామికవాదుల ఒత్తిడి వలన తర్వాత ఆ జీవో ఉపసంహరించుకుంది. ఇంకొకవైపు నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువ నీరు నిల్వ చేయగల డిజైన్ చేసి పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్ర జలసంఘానికి పంపింది. అలాగే గతంలో 9,000 కోట్ల రూపాయలుగా నిర్ణయించబడిన ఈ ప్రాజెక్టు వ్యయం తర్వాత 13,000 కోట్లుగా నిర్ణయించబడి నెలరోజుల క్రితం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో రు.16,712 కోట్లుగా పేర్కొన్నది. వ్యయం ఎంత పెరుగుతున్నా లెక్కచేయకుండా, నిధులు కేటాయిస్తూ కుడి, ఎడమ కాల్వలు, రాక్‌ఫిల్ డ్యాం టెండర్ల ప్రక్రియ ముగించి వరుసగా రు.1,774 కోట్లు, రు.1,590 కోట్లు, రు.883.99 కోట్లుగా నిర్ణయించి పనులు నడిపిస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు గురించి మూడుసార్లు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించింది. ఈ మూడు సమావేశాలు కేవలం మొక్కుబడిగానే జరిపి, ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యాన్ని మాత్రం ఫిబ్రవరి 14న నిర్వహించిన సమావేశంలో వివరించింది. మూడువందల ఇరవై అయిదు టిఎంసిల కొరకు ఉద్దేశించినదని చెప్పబడుతున్న పోలవరం ప్రాజెక్టు కేవలం ఏడులక్షల ఇరవై వేల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశ్యం కాదు, ఏకంగా ఇరవైమూడు లక్షల ఎకరాలకు నీరందించే ఉద్దేశ్యంతో ప్రాజెక్టు డిజైన్ చేసి నిర్మిస్తున్నది. ఈ విషయం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఆఖరు సారిగా ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో చెప్పాడు. కాని మొదటి విడతగా మాత్రం కేవలం 7.20 లక్షల ఎకరాలకు, రెండవ విడతగా 14 లక్షల ఎకరాలకు సాగనీరందిస్తామని ప్రభుత్వ ఉద్దేశ్యం చెప్పాడు. అన్ని నీళ్ళు ఎక్కడికి ఎలా అందిస్తారని నీటిరంగ నిపుణులడిగితే, నికర జలాలుకాదు వరద జలాలు ఉపయోగిస్తామని చెప్పాడు. ఈ విధంగా ప్రభుత్వం 23 లక్ష ఎకరాలకు సాగునీరు, 80 టిఎంసిలు రాయలసీమకు ఇవ్వడం, విశాఖపట్నంకు మంచినీరు ఇవ్వడం, ఉభయగోదావరిజిల్లాల సముద్ర తీరంలోని పరిశ్రమలకు నీరందించి, అలాగే ఉత్తరాంధ్రకు కూడ కొంత సాగునీరందించాలంటే ప్రభుత్వం ఇచ్చిన లెక్కప్రకారమయినా ఒక టిఎంసి నీరు

3,800 ఎకరాలు సాగుకు వినియోగం అయినా, దాదాపు ఎనిమిది వందల టిఎంసిల నీరు ఈ ప్రాజెక్టు ద్వారా ఉపయోగంలోకి వచ్చే తీరుగా ప్రభుత్వం ప్రాజెక్టును రూపొందించింది. అందులో భాగంగానే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు విశాలంగా తను అనుకున్న లక్ష్యం నెరవేర్చే దిశవైపు (85 మీటర్ల వెడల్పు, 8 మీటర్ల లోతు) ఆలోచించి తవ్వుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న వరద జలాలు లభ్యంకాకపోతే నికరజలాలనే వరదజలాలుగా వాడుకునే అవకాశం ఉన్నది. కొద్దిరోజులు పోయిన తర్వాత ఆ నికరజలాలయినా లేదా వరదజలాలయినా అది మా హక్కు అన్నట్లుగా ఆ ఆయకట్టు రైతాంగం ఉద్యమించేందుకు ప్రభుత్వమే అవకాశం కల్పించేటట్లుంది. మొత్తం మిగిలిన ఎనిమిది వందల టిఎంసిల నికర జలాలు ఆంధ్రప్రాంతం (ఇరవై శాతం నది పరీవాహక ప్రాంతం కలిగిన) ఉపయోగిస్తే రాబోయే రోజులలో (ఎనభైశాతం పరీవాహక ప్రాంతం కలిగిన) ఉత్తర తెలంగాణ ప్రజల నోట్లో మన్నుకొట్టే ప్రయత్నం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగ చేస్తున్నది. ఈ ప్రభుత్వ ప్రయత్నానికి మొత్తం రాజకీయ (అధికార, ప్రతిపక్ష) నాయకత్వం మద్దతిస్తున్నది. ఒక తెలంగాణ రాష్ట్ర సమితి మాత్రమే ప్రభుత్వ, మిగతా రాజకీయ పార్టీల అభిప్రాయానికి భిన్నంగా పోలవరంపై మాట్లాడుతున్నది. కాని ప్రాజెక్టు ఆపకలిగే స్థాయిలో ఉద్యమించడం లేదు.

పోలవరం ప్రాజెక్టుపై వివిధ రాజకీయ పార్టీల వైఖరి

సిపిఐ, బిజెపి ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ప్రకటించాయి. సిపిఎం మాత్రం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో డ్యాం వద్దని, డిజైన్ మార్చాలని, ముంపు బాధితులకు సరైన పునరావాసం కల్పించాలని సూచిస్తున్నది. రాష్ట్ర రాజధాని, ఢిల్లీలలో పోలవరం ప్రాజెక్టుకు ప్రజాభిప్రాయం తీసుకురావాలని, ప్రత్యామ్నాయం చూడాలని అంటూ రకరకాల వాదనలు ముందుకు తీసుకు వస్తున్నది. ఇటు ఎనభై శాతం పరీవాహక ప్రాంత ప్రజలను, అటు ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలనే కాక మొత్తం ప్రజలను గందరగోళపరచే విధంగా ప్రవర్తిస్తున్నది. తెలుగుదేశం పార్టీ శాసనసభలోను, అఖిలపక్ష సమావేశాలలోను ప్రాజెక్టును సమర్థిస్తూ నిర్ణయం తీసుకుంటూ, ఇంకొకవైపు తెలంగాణ జిల్లాలలో మాత్రం గోదావరి జలాలు ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోమంటూ పాదయాత్ర, బహిరంగసభ నిర్వహించి తన రెండునాల్కల ధోరణిని బయటపెట్టుకున్నది. ఒకవైపు తెలంగాణ ప్రాంతాన్ని ఎడారి చేసే పోలవరం ప్రాజెక్టుకు మద్దతు తెలుపుతూ ఇంకోకవైపు తమ గొంతులో ప్రాణముండగా గోదావరి జలాలు ఇతర ప్రాంతాలకు తరలించనివ్వమని ప్రగల్భాలు పలుకుతున్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసి లాంటి పార్టీలు కూడ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం చాలా శోచనీయం. తెలంగాణ ప్రాంతంలో ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని కోట్లాది ప్రజల మీద బలమైన ముద్రవేసిన విప్లవపార్టీలు (మావోయిస్టు, జనశక్తి) ఈ ప్రాజెక్టును వ్యతిరేకించినా, నిర్మాణానికి వ్యతిరేకంగా విశాల ప్రజానీకాన్ని ఉద్యమించేటట్లు ప్రోత్సహించడం కాని, విస్తృత ప్రయత్నం కాని ఇప్పటివరకు చేయలేదు. అక్కడక్కడ ప్రజా సంఘాలు, ఐక్య ఉద్యమాలు చేసినా, ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపే స్థాయిలో లేవు. ఫలితంగా మొత్తం ఉత్తర తెలంగాణ గోదావరి పరీవాహక ప్రాంత జిల్లాలు రాబోయే రోజులలో ఎడారిగా మారే ప్రమాదం ఉంది.

ఎనభైశాతం గోదావరి నదీపరీవాహక ప్రాంతం కలిగిన ఈ ఐదు జిల్లాల్లో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలు సుమారు 400 - 500 మీటర్ల ఎత్తు నుండి నిర్దేశిత ప్రాంతాలకు నీరందించాల్సివుంది. ఈ నీరును ఎత్తిపోసేందుకు కావలసిన విద్యుత్‌ను ఏ ప్రాతిపదికగా అందిస్తారు? ఇలా ఎంతకాలం అందిస్తారు? ఇలా ఎత్తిపోసిన నీరును రిజర్వాయర్‌లు కట్టి నిల్వచేసినా, ఆయాప్రాంతాలలోని చెరువులు, కుంటలు పూర్తిగా పూడికతో నిండిపోయి ఉన్నాయి. వాటికెలా పంపుతారు? చెరువులు, కుంటల పూడికతీసేందుకు నిర్దిష్ట కార్యక్రమం ఏమైనా ప్రభుత్వం దగ్గరవుందా? అనే విషయాలు ప్రభుత్వం ప్రజలకు చెప్పడం లేదు. ఇంత అస్పష్టమైన విధానాలతో ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వం భవిష్యత్‌లో ఈ పథకాల నిర్వహణ ఖర్చుకూడ రైతాంగమే భరించాలన్నట్లుగా వ్యవహరించదలచుకున్నట్లు అర్థం అవుతుంది. అపుడు తెలంగాణ రైతాంగం పరిస్థితి "మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లు" అవుతుంది . ఇప్పటికే ఈ ఎత్తిపోతల పథకాల సాగునీటి వినియోగం ఒక టిఎంసి కి నలభై వేల ఎకరాల సాగునీరు ఉపయోగించాలని తన జి.వో.లో రూపొందిస్తున్నది. ఇప్పటికే దేవాదుల ఎత్తిపోతల పథకం కింద పైనచెప్పిన విధంగా రూపొందించింది. పోలవరం ప్రాజెక్టు కింద 3,800 ఎకరాలు ఒక టిఎంసి ఉపయోగించగా, దేవాదులలో మాత్రం నలభైవేల ఎకరాలు ఒక టిఎంసితో సాగు చేసుకోవాలని మార్గదర్శకత్వం రూపొందించడంలోనే ప్రభుత్వ దమననీతి అర్థం అవుతున్నది. ఇంత దుర్భర పరిస్థితులలో తెలంగాణ రైతాంగానికి పూర్తిగా అన్యాయం చేస్తున్న ప్రభుత్వ విధానాలను సమర్థిస్తున్న మొత్తం రాజకీయ నాయకత్వాన్ని ఏమనాలి? చట్టప్రకారం, బచావత్ అవార్డు ప్రకారం ఎనభై శాతం పరీవాహక ప్రాంతానికి దక్కాల్సిన నీరును రైతాంగం ఉపయోగించుకునేట్లయినా, లేదా మెజారిటీ పరీవాహక ప్రాంత ప్రజల అవసరాలు తీరిన తర్వాతనయినా ఇతర ప్రాంతాలకు నీరందించాలని ప్రభుత్వం భావించడం లేదు. ఇతర పార్టీలు కూడా ఈ విషయాలు తెలియక కాదు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలిపేది. ఉద్దేశపూర్వకంగానే కోస్తాంధ్ర ప్రజలను అభివృద్ధి చేయడంతో పాటు, తెలంగాణ ప్రాంతాన్ని ఎడారిచేయడమే ఈ పార్టీల ఉద్దేశంగా అగుపడుతున్నది. గత నాలుగు దశాబ్దాల క్రితం కృష్ణా పరీవాహక ప్రాంతానికి సంబంధించిన విషయంలో కూడ ఈ విధంగానే అన్యాయం జరిగింది.

కృష్ణానది కర్ణాటక నుండి మనరాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. మహబూబ్‌నగర్ నుండి నల్లగొండ, కొంత రాయలసీమ, కొంత సర్కారు జిల్లాలలోపారుతుంది. కాని దాదాపు 68 శాతం పరీవాహక ప్రాంతం తెలంగాణలో వున్న కృష్ణానది నీరు

బచావత్ అవార్డు ప్రకారం 810 టిఎంసిల నీరు రాష్ట్రానికి లభించగా, తెలంగాణకు కేవలం మూడువందల టిఎంసిల నీరు కూడ అందడం లేదు. కాని 13 శాతం కూడలేని ఆంధ్రప్రాంతానికి ఒక్క నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా 388.4 టిఎంసిల నీరందించి తెలంగాణ ప్రాంతం మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి జిల్లాలను దుర్భిక్ష ప్రాంతాలుగా నాటి ప్రభుత్వాలు మార్చాయి. ఫలితంగా ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే లక్షలాది ప్రజలు సాగునీరులేక భూమి పడావు పెట్టి వలస కూలీలుగా జీవితం వెళ్ళబుచ్చుతుండగా, నల్లగొండ జిల్లాలో కనీసం ఐదువందల గ్రామాలు ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడుతున్నాయి. ఆ ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడిన ప్రజలు శరీర అంగాలు పనిచేయక జీవచ్ఛవాలుగా మారారు.

ఈరోజు కోస్తాంధ్ర జిల్లాలు కృష్ణానదిలోని నీటిని వాడుకోవడం తమ హక్కుగా భావిస్తూ, రెండవ పంటకు, మూడవ పంటకు పోలవరం ద్వారా గోదావరి జలాలను అందించాలని ఆ ప్రాంత రాజకీయనాయకత్వం, ప్రభుత్వం పట్టు బిగిస్తున్నాయి. ఫలితంగానే రాజశేఖరరెడ్డి రాబోయే మూడు సంవత్సరాలలో పోలవరం ప్రాజెక్టు కట్టితీరుతామని ప్రకటిస్తూ అందుకనుగుణంగా ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికగా ముందుకు తీసుకెళుతున్నాడు. అలాగే దశాబ్దాల తరబడి అభివృద్ధికి దూరంగా ఉన్న రాయలసీమ నుండి ఎదిగిన రాజశేఖర రెడ్డి తన ప్రాంత అభివృద్ధికి గోదావరి జలాలను పోలవరం నుండి తన పాలనలోనే అందించాలని దృఢసంకల్పంతో వున్నాడు. అందుకనే కేంద్ర జలసంఘం, గిరిజన మంత్రిత్వశాఖ, కేంద్ర ఆర్థికసంఘం, ఇంకా రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూల్‌లోని కొన్ని అధికరణలు ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతినివ్వకున్నా, పోలవరం ప్రాజెక్టు కట్టి తీరుతామని ప్రకటిస్తూ తెలంగాణ ప్రాంత ప్రజలకు గట్టి సవాలు విసురుతున్నాడు.

నేడు పోలవరం ప్రాజెక్టు గిరిజన ప్రజల మునుపు సమస్యతోపాటు, ఉత్తర తెలంగాణ గోదావరి పరీవాహకప్రాంత ప్రజానీకానికి సంబంధించిన జీవన్మరణ సమస్యగా మారింది. ప్రభుత్వం కడుతున్న ఈ డిజైన్ ద్వారా మొత్తం తెలంగాణ రాబోయే రోజులలో సోమాలియాగా మారడం ఖాయం. ప్రభుత్వం నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలలోని సారం శూన్యంగా అగుపడుతున్నది. నేతి బీరకాయలో నెయ్యిలేదనేది ఎంత వాస్తవమో ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా రైతాంగానికి సమగ్రంగా నీరందుతుందనేది కూడా అంతే వాస్తవం. ఈ రాజకీయ వ్యవస్థపైన, ఈ అధికార యంత్రాంగం పైన ఆధారపడితే దక్షిణ తెలంగాణ లాగానే ఉత్తర తెలంగాణ కూడ అన్యాయానికి గురవ్వడానికి రంగం పోలవరం ద్వారా సిద్ధం అవుతున్నది. ఇప్పటికీ ఆ పరిస్థితి మారకుండ అడ్డుకోవడానికి ఆ పరీవాహక ప్రాంత ప్రజానీకం సిద్ధపడాలి.

మన ముందున్నవి రెండే రెండు మార్గాలు 1. మొత్తం పరీవాహక ప్రాంత ప్రజానీకం ప్రభుత్వ, రాజకీయ కార్యక్రమాలు స్థంభింపజేసి, ప్రభుత్వం మీద ఒత్తిడి చేసి ప్రాజెక్టు నిర్మాణం ఉపసంహరించుకునేటట్లు చేయాలి. 2. ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలంలో ఆదివాసులకు తోడుగా ఇతర రైతాంగం నిలిచి ప్రభుత్వ చర్యను అడ్డుకోవాలి. ఈ రెండూ జరుగకుంటే ప్రాజెక్టు నిర్మాణం ఆపడం ఏ న్యాయస్థానం వల్లనో, రాష్ట్రపతి వల్లనో కూడ కాదు. ఎందుకంటే కోస్తాంధ్ర రాజకీయ నాయకత్వం అంత బలమైనది. ఒక బలమైన వర్గాన్ని ఢీ కొనాలంటే ప్రస్తుత పరిస్థితులలో పై రెండు మార్గాలే శరణ్యం. లేదంటే ఉత్తర తెలంగాణ మరో దక్షిణ తెలంగాణ లేదా సోమాలియాగా మారుతుంది.

గమనిక : ఈ వ్యాసంలో వాడిన గణాంకాలు 28-2-2005 న ప్రభుత్వం విడుదల చేసిన జి.వో.నం 34 నుండి, అలాగే రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు తన అఫిడవిట్‌లో రాసినవి, ఇతరత్రా సేకరించినవి. ❑

ఎన్నికల సర్వేలు ప్రజాభిప్రాయ సూచికలా?

కొణతం దిలీప్

యాభై తొమ్మిదేళ్ల ప్రజాస్వామ్య, స్వతంత్ర భారతావని ప్రస్థానంలో వెలుగులకన్నా నీడలే అధికం. ప్రజల చేతిలో రాజ్యాధికారం అని పేరు పెట్టుకున్న, ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఓ ఫార్స్‌గా మారి చాలాకాలమే అయింది. మితిమీరిన రిగ్గింగ్, దౌర్జన్యం, విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ, టిక్కెట్ కోసం నేరగాళ్ల, అక్రమార్కుల పోటీ వెరసి ప్రజల్లో రాజకీయాల పట్ల, ఎన్నికల పట్ల నిరాశా నిస్పృహలు. అయిదేళ్లకోసారి కొండొకచో ఇంకాముందే వచ్చే ఎన్నికల తిరునాళ్లు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం చేసే వివిధ పార్టీల అభ్యర్థులు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, ఎత్తుగడలు, చెవులు హోరెత్తిపోయే మైకుల జోరు, పాదయాత్రలు, ఇంకొంచెం ముందుకు వెళ్ళి పాదాభివందనాలు, బొట్టు పెట్టి మరీ ఓటు అడిగేవారు, మందు, మాంసం, నోటు ఇచ్చి ఓటు కొనుక్కునేవారు, కుల, మత సంఘాల పెద్దల తీర్మానాలు, కప్పదాట్లు, టిక్కెట్ రానివారి వీరంగాలు, వెన్నుపోట్లు, పోలింగ్ రోజు దౌర్జన్యం, రిగ్గింగ్, ఫలితాలు వచ్చేదాకా నరాలుతెగే ఉత్కంఠ. తీరా జయాపజయాలు వెల్లడయ్యాక ఓవైపు అంబరాన్నంటే సంబరాలు మరోవైపు విచారవదనాలు. 'డామిట్! కథ అడ్డం తిరిగిందంటూ' రకరకాల కుంటిసాకులు. ఓహ్! ఒక్కటేమిటి ఎన్నికల సమయం అన్ని రసాలు కలబోసిన వింత నాటకం.

ఎన్నికల్లో గెలుపు ఓటములు ప్రజల భవిష్యత్తే కాదు - అటు అభ్యర్థుల, పార్టీల రాజకీయ, ఆర్థిక భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయి. అధికార ప్రాప్తమా ? లేక అధోగతి పాలా ? తేల్చే ఈ ఎన్నికల్లో రాన్రానూ పోటీ తీవ్రమై పోతోంది. అధికారంలోకి వస్తే సకల వైభోగాలు అనుభవించే వీలుండడం, వేలకోట్ల రూపాయల ప్రభుత్వ ధనం చేతిలో ఆడే వెసులుబాటు, దాంట్లోంచి జేబులోకి వచ్చే పర్సంటేజీల ఆదాయం. వీటివల్లే ఎన్నికల్లో ఖర్చు కూడా నానాటికీ పెరుగుతోంది.

అయితే ఎంత ఖర్చు చేసినా ఎన్నికల ఫలితాన్ని ముందే బేరీజు వేయడం ఎవరికీ అంత సులభం కాని పని. అందుకే గత ఏడెనిమిదేళ్ళుగా మన దేశంలో ఎన్నికల ఫలితాలను ముందే ఊహించే ప్రజాభిప్రాయ సర్వేలు నిర్వహించడం ఊపందుకుంది.

విశ్లేషణ

సెఫాలజీ అంటే ఏమిటి ?

ఎన్నికల గురించి పరిశోధన, విశ్లేషణ చేసే శాస్త్రాన్నే సెఫాలజీ అంటారు. ఈ పరిశోధన చేసే వ్యక్తులను సెఫాలజిస్టులని వ్యవహరిస్తారు. దాదాపు 60 ఏళ్ళ వయస్సున్న సెఫాలజీ, ఎన్నికలనే సంక్లిష్ట పరిణామాన్ని అర్థం చేసుకోవడంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఒక రాజకీయ ప్రక్రియగా, ఒక చారిత్రక సన్నివేశంగా ప్రజా సమూహాల మనస్తత్వానికి ఒక సూచికగా - ఇలా ఎలక్షన్లను అవగతం చేసుకోవడంలో సెఫాలజీ భిన్న మార్గాలను ఆవిష్కరించింది.

1999 జాతీయ ఎన్నికల ముందు ప్రజాభిప్రాయ సర్వేలను ఎన్నికల కమీషన్ నిషేధించడం, తదనంతరం సుప్రీంకోర్టు ఆ నిషేధం చెల్లదని ప్రకటించడంతో ఈ సర్వేలపై విస్తృతంగా చర్చలు మొదలయ్యాయి. మళ్లీ 2004 జాతీయ ఎన్నికల సమయంలో డి.కె.ఠాకూర్ అనే వ్యక్తి ఎన్నికల ముందు జరిపే ప్రజాభిప్రాయ సర్వేలు, ఎన్నికల తర్వాత జరిపే ఎగ్జిట్ పోల్స్‌ను నిషేధించాలని లేదా నియంత్రించాలని దాఖలు చేసిన పిటిషన్‌కు స్పందిస్తూ సుప్రీంకోర్టు మూడు రాజకీయపార్టీలకు (కాంగ్రెస్, బిజెపి, టిడిపి) నాలుగు వార్తాపత్రికలకు (ది హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ టైమ్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్) అయిదు టెలివిజన్ ఛానెళ్లకు (సహారా, జీ, స్టార్, ఎన్‌డిటీవీ, టీవీ టుడే) గత నెల నోటీసులు పంపడంతో ఈ సర్వేల వ్యవహారం మళ్లీ తెరమీదకు వచ్చింది.

కొంచెం చరిత్ర :

ఎన్నికల సర్వేలకు దాదాపు డెబ్బై ఏళ్ల చరిత్ర వుంది. జార్జ్ గాలప్ అనే పెద్ద మనిషి 1936లో అమెరికన్ అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఒక శాస్త్రీయ ప్రజాభిప్రాయ సర్వేను నిర్వహించి ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ గెలుస్తాడని ప్రకటించాడు. అతని ఊహాగానం నిజం కావడంతో ప్రపంచానికి ఒపీనియన్ పోల్ (ప్రజాభిప్రాయ సర్వే) అనే కొత్త పద్ధతి పరిచయమైంది. 1950ల నాటికే అనేక ప్రజాస్వామ్య దేశాల్లో ఇటువంటి సర్వేలు నిర్వహించడం సర్వసామాన్యమైంది. మన దేశంలో కూడా గత ఏడెనిమిదేళ్ళుగా ప్రతీ ఎన్నిక ముందు అనేక సర్వేలు నిర్వహించబడుతున్నాయి.

ఎలా చేస్తారు ?

ప్రజాభిప్రాయ సర్వేలు చాలావరకూ వివిధ వార్తాసంస్థలు ఏదో ఒక పరిశోధనా సంస్థతో కలిసి నిర్వహిస్తుంటాయి. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, దాని క్రోడీకరణ పరిశోధనా సంస్థ చేస్తే, ఆ సమాచారాన్ని జన సామాన్యానికి తెలియచెప్పే పని వార్తా సంస్థ చేస్తుంది. 2004 జాతీయ ఎన్నికల సమయంలో ఇలా ఇండియా టుడే - మార్గ్, ఔట్‌లుక్ - సిఎంఎస్, ఎన్‌డీటీవీ - ఇండియన్ ఎక్స్‌ప్రెస్ - ఎసి నీల్సన్, జీటీవీ - టాలీమ్ కలిసి ఎన్నికల సర్వేలు నిర్వహించాయి.


ఎన్నికల సర్వేలో సాధారణంగా ఒక ప్రశ్నావళి సాయంతో ఓటర్ల అభిప్రాయాలు తెలుసుకుంటారు. ఒక నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో కొద్దిమందిని ఎన్నుకుని (నమూనా) వారిని ప్రశ్నించడం జరుగుతుంది. ఈ నమూనా ఎంత పెద్దదయితే సర్వే ఫలితాలు అంత కచ్చితంగా వస్తాయని నమ్మకం. ఓటర్లను ప్రశ్నించి జవాబులు నమోదు చేసుకునేవారిని ఇన్వెస్టిగేటర్లు లేదా ఎన్యూమరేటర్లుగా వ్యవహ రిస్తారు. వీరు సాధారణంగా జర్నలిజం, మార్కెటింగ్, మీడియా రంగాలకు చెందినవారై వుంటారు.

మన దేశానికి ఉన్న భిన్నత్వం రీత్యా ఇక్కడ ఎన్నికల సర్వే జరపడం అనేది కత్తి మీద సాము వంటిది. అనేకానేక భాషలు, మతాలు, కులాలు, ప్రాంతాలు ఉండడం వలన అందరికీ ఒకేవిధంగా అర్థమయ్యే ప్రశ్నలు రూపొందించడం చాలా కష్టమైన పని. అంతేకాదు ఇంత భారీ స్థాయిలో నమూనా సర్వే చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న పని కూడా.

ఎన్నికల్లో ఓటర్ల మనోభావాలు తెలుసుకోవడానికి రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థులు ఉవ్విళ్లూరడం సహజమే. అయితే ఓటర్ల నాడి సరిగ్గా పట్టుకోవడం అంత ఆషామాషీ వ్యవహారమేం కాదు. ఒక వ్యక్తి ఏ అభ్యర్థికి ఓటు వేస్తాడనేది అనేక అంశాలపై ఆధారపడి వుంటుంది. ఇందులో ముఖ్యమైనవి కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితి, మతం, స్థానిక లేదా ప్రాంతీయ ప్రభావాలు, మీడియా ప్రభావం, అభ్యర్థి చేసే ప్రచార ప్రభావం, స్థానిక అంశాలు లేదా సమస్యలపై ఓటరుకు ఉన్న దృక్పథం. ఇన్ని అంశాల సంక్లిష్ట సమ్మేళనం ఓటరు నిర్ణయం!

సర్వేల ఫలితాలను ఎలా అర్థం చేసుకోవాలి ?

'ఎన్నికల ఫలితాలను ఊహించడం అనేది చాలా సమ్మోహనకరమైన ఆట కానీ ఎన్నికలను విశ్లేషించడం మాత్రం చాలా గంభీరమైన వ్యవహారం' అంటారు 'ఇండియా డిసైడ్స్' అనే పుస్తక రచయితలు డేవిడ్ బట్లర్, అశోక్ లాహిరి, ప్రణయ్‌రాయ్. ఓటర్ల వద్ద నుండి వచ్చిన జవాబులను, అభిప్రాయాలను ఓట్లలోకి, సీట్లలోకి అనువదించడం కొంచెం కష్టమైన పనే. ఒక అభ్యర్థి లేదా పార్టీ 20 ఓట్లతో గెలుస్తుందని



సర్వే ఊహిస్తే సదరు అభ్యర్థి 200 ఓట్లతో గెలవడం కన్నా అదే అభ్యర్థి 20 ఓట్లతో గెలుస్తారని ఊహిస్తే 20 ఓట్లతో ఓడిపోవడం మెరుగైన సర్వే అనిపించుకుంటుంది. కానీ రాజకీయనాయకులకు ఓట్ల సంఖ్య, శాతం కన్నా గెలుపోటములే ప్రధానం కదా!

జోస్యాలు నిజమవుతాయా ?

ఎన్నికల సర్వేలు ఎంతవరకూ వాస్తవరూపం దాలుస్తాయి అనే దాంట్లో భిన్నాభిప్రాయాలు వున్నాయి. ఒకసారి ఈ జోస్యాలు కాస్త అటూఇటూగా వాస్తవ ఫలితాలవలె ఉంటుండగా కొన్నిసార్లు జయాపజయాలు ఊహించటంలో ఘోరంగా విఫలమవుతున్నాయి. 2001లో కేరళ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల విషయమే తీసుకుంటే, అక్కడ ఎన్నికలకు ముందు నాలుగు ప్రజాభిప్రాయ సర్వేలు జరిగాయి. దాదాపు అన్ని సర్వేలు కాస్త తేడాతో యుడిఎఫ్ కూటమి విజయం సాధిస్తుందని సూచించాయి. వాస్తవ ఫలితం కూడా అలాగే వుంది. గమ్మత్తైన విషయం ఏమిటంటే అదే సమయంలో పక్కనే వున్న తమిళనాడులో ఫలితాలను అంచనా వేయడంలో నాలుగింటిలో రెండు ప్రజాభిప్రాయ సర్వేలు విఫలమయ్యాయి. అవే సంస్థలు ఏకకాలంలో వేరువేరు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో

2001 అసెంబ్లీ ఎన్నికలు - సర్వే ఫలితాలు

పార్టీ	ఇండియా టుడే ఒఆర్‌జి - మార్గ్	ది వీక్ సోఫోర్స్ మోడ్	ఔట్‌లుక్ సిఎంఎస్	టైమ్స్ డిఆర్‌ఎస్	వాస్తవ ఫలితాలు
కేరళ					
యుడిఎఫ్	83 - 103	80 - 100	76 - 83	100	99
ఎల్‌డిఎఫ్	43 - 53	40 - 60	54 - 59	35	40
ఇతరులు	1 - 3	0 - 1	3	5	1
తమిళనాడు					
ఎఐఎడిఎంకె ఫ్రంట్	120 - 130	195 - 210	165 - 175	108 - 120	196
డీఎంకె ఫ్రంట్	105 - 115	20 - 35	56 - 68	109 - 121	37
ఇతరులు	2 - 5	0 - 5	2 - 6	5 - 7	1

2004 లోక్‌సభ ఎన్నికలు - ప్రజాభిప్రాయ సర్వే ఫలితాలు

సంస్థ	నమూనా	కాంగ్రెస్	ఎన్.డి.ఎ.	ఇతరులు
ఇండియా టుడే - మార్గ్	17,649 ఓటర్లు 98 నియోజకవర్గాలు 12,249 ఓటర్లు	105 - 115	330 - 340	95 - 105
ఔట్‌లుక్ - సిఎంఎస్	102 నియోజకవర్గాలు	159 - 169	280 - 290	--
ఎన్.డి.టీవీ - ఇండియన్ ఎక్స్‌ప్రెస్ - ఎసి నీల్సన్	45,478 ఓటర్లు 207 నియోజకవర్గాలు	163 +	287 - 307	--
జీ న్యూస్ - టాలీమ్	65 నియోజకవర్గాలు	196 +	265	--
వాస్తవ ఫలితాలు	----	220	185	137

వేరు వేరు విధంగా ఎందుకు ఫలితాలను ఊహించాయి అన్నది ఆలోచించాల్సిన విషయం. తమిళనాడులో ఏఐడిఎంకె ఫ్రంట్ విజయాన్ని ది వీక్ - సోఫోర్స్ మోడ్, ఔట్‌లుక్ - సిఎంఎస్ సంస్థలు ముందే ఊహించగా ఇదే సమయంలో ఇండియా టుడే - ఓఆర్‌జి-మార్గ్, టైమ్స్ - డిఆర్ఎస్ సంస్థలు మాత్రం అక్కడ ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాదని తేల్చాయి.

2004 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో కూడా అనేక సంస్థలు ప్రజాభిప్రాయ సర్వేలు నిర్వహించాయి. దేశవ్యాపిత సర్వేలు అన్నీ ఎన్‌డిఏ కూటమికి కాంగ్రెస్ కన్నా ఎక్కువ సీట్లు దక్కుతాయని అంచనాలు వేశాయి. రాష్ట్రంలో కూడా బిజెపి - టిడిపి కి మెజారిటీ వస్తుందని కొన్ని సంస్థల సర్వే ఫలితాలు సూచించాయి. (పట్టిక చూడండి). వాస్తవ ఫలితాలు ఈ సర్వేల జోస్యాల కన్నా చాలా భిన్నంగా వుండడం మనందరం చూశాం.

ఐర్లాండ్‌లో అంతే!

కొన్నాళ్ళ క్రిందటివరకూ ఐర్లాండ్‌లో ప్రజాభిప్రాయ సర్వేలు ఎన్నటికీ నిజం కావనేవారు. కారణం ఐరిష్ ప్రజలు ఎంత మర్యాదస్తులంటే వారు మనస్సులో వున్నది కాక ప్రశ్నించే వ్యక్తిని సంతోషపెట్టే జవాబులే ఇచ్చేవారట!

నేరం నాది కాదు

మనం ముందే అనుకున్నట్లు ఓటరు మనసులో ఏముందో తెలుసుకోవడం అంత సులభమైన పని కాదు. 2004 శాసనసభ ఎన్నికల ముందు ఇంటలిజెన్స్‌శాఖతో పాటు అనేక ప్రయివేట్ సంస్థలు వెల్లడించిన సర్వే ఫలితాలు వాస్తవానికి అంత దూరంలో ఎందుకు వున్నాయి ? అసలు ఈ సర్వేలు సూచించిన ఫలితాలు ఎంతవరకు నమ్మవచ్చు?

ఒక ప్రజాభిప్రాయ సర్వే వాస్తవానికి ఎంత దగ్గరగా లేదా దూరంగా వుంటుందన్నది ప్రధానంగా దిగువ అంశాలపై ఆధారపడి వుంటుంది :

(i) నమూనా సైజు : మొత్తం ఓటర్ల సంఖ్యలో ఎంతమందిని ప్రశ్నించారు అనేది చాలా ప్రధానమైన అంశం. సర్వే అనేది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి కొన్ని సంస్థలు కొద్దిపాటి నమూనాను తీసుకుని మొత్తం జనాభా మనోభావాలను ఊహించే సాహసం చేస్తుంటారు. ఇది తప్పు పద్ధతి.

(ii) నమూనాను తప్పుగా ఎన్నుకోవడం :

ఈమధ్య మీరు టీవీలో ఎస్ఎంఎస్‌ల సహాయంతో జరుగుతున్న సర్వేలు గమనిస్తున్నారా ? జార్జిబుష్ మన దేశానికి రావడం మంచిదా కాదా అని సదరు టెలివిజన్ ఛానెల్‌లో ఎస్ఎంఎస్ సర్వే నిర్వహిస్తే మెజారిటీ ప్రజలు (దాదాపు 75%) బుష్ రాక మనకు మేలు చేస్తుందని భావించారు. ఇది నిజంగా ఆశ్చర్యకర ఫలితమే. కానీ కొంచెం జాగ్రత్తగా ఆలోచిస్తే ఇలాంటి సర్వేలలో పాల్గొనేది ఎవరు? ఇంగ్లీష్ వార్తాఛానళ్లను చూసే ఒక ఎగువ మధ్యతరగతికి చెందినవారే ఇలాంటి సర్వేలలో పాల్గొంటారు. వారి అభిప్రాయం దేశ ప్రజలందరి అభిప్రాయంతో సమానం చేయలేం కదా ?

ఎన్నికల సర్వేలలో కూడా నమూనాను తప్పుగా ఎన్నుకొంటే ఫలితాలు తారుమారయ్యే అవకాశం వుంది.

ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ 2004

	టిడిపి +	కాంగ్రెస్ +
డిఆర్ఎస్	23	17
ఎన్‌డిటీవీ-ఇండియన్ ఎక్స్‌ప్రెస్ - ఎసి నీల్సన్	34	7
వాస్తవ ఫలితాలు	6	36

ఆంధ్రప్రదేశ్ శాసన సభ - 2004

	టీడీపీ +	కాంగ్రెస్ +
స్టార్ న్యూస్	126 - 138	141 - 153
ఎన్‌డీటీవీ-ఎసి నీల్సన్	92 - 117	180 - 205
వాస్తవ ఫలితాలు	49	226

దేశప్రజలలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాలలో వుండే నిరక్షరాస్యులు. సర్వే నిర్వహించేటప్పుడు కేవలం చదువుకున్న, ఉద్యోగం చేస్తున్న, పట్టణాలలోని ఓటర్లను ప్రశ్నించి ఇదే మొత్తం దేశ ప్రజల అభిప్రాయమనుకుంటే వప్పులో కాలేసినట్లే.

అయ్యబాబోయ్! అన్నిసర్వేలా?

ఫ్రెంచి వారికి అన్నిట్లోనూ కొంచెం 'అతి' చేయడం అలవాటు కాబోలు! 1987లో ఎలక్షన్లకు ఏడాదిముందు 860 రాజకీయ సర్వేలు నిర్వహించారట. అన్ని సర్వేలలో మిట్టరాండ్‌కే ఆధిక్యం లభిస్తుండడం చూసి అక్కడి కమ్యూనిస్ట్ పార్టీ పత్రిక ఎల్ హ్యూమనైట్‌కు చిర్రెత్తి 'ఎలక్షన్ల ఫలితాలు ఈ సర్వేలు నిర్ణయించేశాయి. ఇక ఎవరూ ఓటు వేయనక్కర్లేదు' అని వ్యాఖ్యానించింది.

(iii) సర్వే చేసిన సమయం :

ఎన్నికల ప్రక్రియ చాలా క్రియాశీలమైనది. అనుక్షణం పరిస్థితులు ఊహించనలవి కానంతగా మారుతుంటాయి. అందుకే ఎలక్షన్లకు ఎన్నిరోజుల ముందు సర్వే నిర్వహించారనేది చాలా కీలకమైన అంశం. పార్లమెంటుకు, శాసనసభకు ఇటీవల జరుగుతున్న ఎన్నికలు దశలవారీగా జరుగుతుండడంతో పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. మొదటి విడత ఎన్నికల సరళి గురించి వచ్చే వార్తలు, జరిగే ఘటనలు తదనంతరం జరిగే పోలింగ్‌పై విశేషంగా ప్రభావం చూపుతున్నాయి. 1991లో రాజీవ్ గాంధీ హత్యానంతరం జరిగిన పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి సానుభూతి ఓట్ల వెల్లువ స్పష్టంగా కనపడింది. అలాగే 2004 రాష్ట్ర శాసనసభలో మొదటి విడతలో టిడిపికి ఎదురుదెబ్బలు తగిలాయనే వార్తలు వెలువడ్డాయి. దీంతో మలి విడత పోలింగ్ నాటికే టిడిపికి ప్రతికూల వాతావరణం ఏర్పడింది.

(iv) ఓట్లు = సీట్లు

అన్ని ప్రజాభిప్రాయ సర్వేలు కొన్ని నియోజకవర్గాలను నమూనాగా ఎన్నుకుంటాయి. ఈ నియోజకవర్గాల్లో మళ్ళీ కొద్దిమంది ఓటర్లను నమూనాగా తీసుకుని వారిని ప్రశ్నించి ఆ జవాబుల ఆధారంగా ఒక్కో పార్టీకి వచ్చే ఓట్ల శాతాన్ని, సీట్ల సంఖ్యను అంచనా కడ్తాయి. అయితే భారత్‌లాంటి భిన్నత్వం వున్న దేశంలో కొన్ని నియోజకవర్గాల్లో సర్వే చేసి మొత్తం దేశ పరిస్థితిని ఊహించడం దుస్సాహసం. నియోజకవర్గాలు అన్నీ ఏకరీతిగా వుండవు కాబట్టి మొత్తం ఫలితాలను అంచనా కట్టడంలో చాలా ఇబ్బంది ఎదురవుతుంది. ఇక ఓట్ల శాతాన్ని బట్టి సీట్ల శాతాన్ని అంచనా వేయడం కూడా కొంచెం రిస్కుతో కూడుకున్న పనే. ఎందుకంటే నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య, వారి నిష్పత్తి వేరువేరుగా వుండడం వంటి కారణాల వలన ఓట్ల దామాషాలో సీట్లు వుండాలనే నియమం ఏమీ లేదు.

సర్వేలందు మంచి సర్వేలు వేరయా

అన్ని సర్వేలు ఒకేలా వుండవు. కొన్ని రాజకీయ పార్టీలే చేయించే సర్వేలు వుంటాయి. ఇలాంటప్పుడు తన క్లయింట్‌ని బాధపెట్టడం ఇష్టంలేకనో, లేక ప్రజలను అనుకూలంగా మలుచుకునేందుకో సర్వే సంస్థలు ఫలితాలను తారుమారు చేస్తాయి. తమ క్లయింట్‌కి నచ్చేలా వాటిని 'తీర్చిదిద్దుతాయి'. చాలాసార్లు ఇలాంటి పొరపాటు సర్వేల వల్లనే నాయకులు అహంకారంతో విర్రవీగుతారు. మన మాజీ ముఖ్యమంత్రి గారికి ఇలాంటి సర్వేలు చేయించడం గొప్ప సరదాగా వుండేది. చివరికి అవే అతని పుట్టి ముంచాయి. తెలివైన రాజకీయ నాయకులు సర్వే సంస్థల ఫలితాలు ఎలా వుండాలో ముందే నిర్దేశించరు. ఫలితాలు ప్రతికూలంగా వస్తే లోపం ఎక్కడ జరుగుతుందో తెలుసుకొని దానిని సరిదిద్దడానికి ఏం చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తారు.

ఓటరు చెప్పేదొకటి, మనవాడు రాసుకునేది మరొకటి :

సర్వే సంస్థలు చాలావరకు తాత్కాలిక సిబ్బందిపైనే ఆధారపడతాయి. వారికి రోజువారీ వేతనం చెల్లిస్తాయి. మన దేశంలో సర్వేలపై శిక్షణ పొందినవారు చాలా అరుదు. కేవలం ఎంబిఏ విద్యార్థులకు అదీ మార్కెట్ రిసెర్చ్‌లో భాగంగా సర్వేలు చేయడం కోర్స్‌లో భాగంగా వుంది. ఇతర చదువులు చదివిన యువతీ యువకులకు సర్వే పద్ధతులపై పెద్దగా అవగాహన లేదు. సర్వే సంస్థ ఇన్వెస్టిగేటర్లుగా ఎంచుకున్నవారికి క్షుణ్ణంగా శిక్షణ ఇస్తే తుది ఫలితం మెరుగ్గా వుంటుంది. ఓటరు చెప్పే జవాబులను సరిగ్గా అర్థం చేసుకోకపోయినా, ఓటరును ఎన్నుకోవడంలో సరైన జాగ్రత్తలు పాటించకపోయినా తుది ఫలితం వాస్తవదూరంగా వుంటుంది.

సర్వేల కున్న పరిమితులు అనేకం. రెండువైపులా పదునున్న కత్తి వంటిది ఎన్నికల సర్వే. శాస్త్రీయంగా నిర్వహించిన సర్వేలు అటు ఓటర్లకు ఇటు రాజకీయనాయకులకు ఎంతో విలువైన సమాచారం వెల్లడించగలవు. అదేసమయంలో అశాస్త్రీయంగా సర్వే నిర్వహించి అదే నిజమని భ్రమ పడితే భంగపాటు తప్పదు.

ఎన్నికలు సర్వేలు ఓటర్ల మనస్సుపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయి అనే అంశంపై కూడా చాలా చర్చ జరుగుతుంది. సర్వే ఫలితాలు విజయం సాధించబోయే అభ్యర్థి పట్ల ఓటర్లను మొగ్గుచూపేలా చేస్తాయనే వాదన ఒకటుంది. గెలిచే అభ్యర్థికి వేస్తేనే తన ఓటు సార్థకమవుతుందని లేకపోతే అది మురిగిపోతుందనే భావన కొంతమంది ఓటర్లలో వున్నమాట వాస్తవం. అదేసమయంలో ఓడిపోతాడనే ప్రచారం జరిగిన అభ్యర్థికి సానుభూతి ఓట్లు పడతాయనే నమ్మకం కూడా వుంది.

ఎవరి నమ్మకాలు ఎలా వున్నా, మన దేశ, రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో ఈ ప్రజాభిప్రాయ సర్వేల భవిష్యత్తు ఎలా వుండబోతుందో త్వరలో వెలువడే సుప్రీంకోర్టు తీర్పు తేలుస్తుంది. ❑

ఇరుగు-పొరుగు

నేపాల్ ప్రజల సమస్య రాచరికమా ? పేదరికమా ?

సుధాకర్ ఎస్.

నేపాల్‌లోని పది సంవత్సరాలుగా కొనసాగుతున్న సాయుధ పోరాట సమీక్షలో నేపాల్ మావోయిస్టు పార్టీ నాయకులు ప్రచండ గారికి కలిగిన కాంపిటీటివ్ పార్లమెంటరీ డెమోక్రసీ జ్ఞానోదయం అప్పుడే ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పేదరికంలో మగ్గిపోతున్న ప్రజానీకానికి కలవరం కలిగించే కొత్త సవాళ్ళను గుర్తు చేస్తోంది. ఆ జ్ఞానోదయాన్ని అన్ని ప్రపంచ దేశాల్లో కొనసాగుతున్న కమ్యూనిస్టు (మావోయిస్టు) ఉద్యమాలు ప్రధానంగా భారతదేశంలోని మావోయిస్టులు కూడా గీటురాయిగా పరిగణించాలని ప్రచండగారనడం కొంత విడ్డూరంగానూ వుంది.

మావో ఆలోచనా విధానమే నేటి మార్క్సిజం అని నమ్మే మిలిటెంట్ మావోయిస్టు ఉద్యమనాయకుల్ని కూడా ప్రపంచీకణ, పాశ్చాత్యీకరణల ప్రభావం ఇంతగా ప్రలోభానికి గురి చేస్తుందని కలలో కూడా ఊహించడం కష్టమే. ప్రజల్లో 'ఉమ్మడి' తత్వాన్ని, ప్రజాహిత రాజకీయ పార్టీల మధ్య నూతన ప్రజాస్వామిక 'ఐక్య' కార్యాచరణని ప్రతిపాదించిన మావో ఆలోచనావిధానానికి ప్రత్యామ్నాయంగా ప్రచండ గారు నేడు 'పోటీ' తత్వాన్ని (కాంపెటీటివ్ డెమోక్రసీ), బహు పార్టీ ప్రజాస్వామ్యాన్ని (మల్టీ పార్టీ డెమోక్రసీ) ప్రతిపాదిస్తున్నారు.

గత దశాబ్దకాలంగా పేదదేశాల్లోని ప్రజలు, పబ్లిక్ రంగ సంస్థలు ఆర్థిక ప్రగతిని సాధించడానికి ఈ 'పోటీ' తత్వాన్ని అలవరుచుకోవాలని ఊదరగొట్టిన ప్రపంచబ్యాంకు ప్రణాళికలు ఎన్నో కష్టనష్టాలతో నెలకొల్పుకున్న పబ్లిక్ రంగ సంస్థల్ని ఏ గతి పట్టించాయో మనం ప్రత్యక్షంగా చూస్తూనే వున్నాం. ఇప్పుడా పోటీతత్వాన్ని మావోయిస్టు ప్రచండగారు వెనుకబడ్డ దేశాల (సాయుధ పోరాటాలు బలంగా సాగుతున్న) ప్రజాస్వామ్య రాజకీయాలకు అన్వయించాలనడం నిజంగా సాహసమే. దానికి ప్రచండ గారు చూపిస్తున్న బూచీ నేపాల్ రాజు - రాచరిక వ్యవస్థ. రాజు - రాచరిక వ్యవస్థల స్థానంలో బహు పార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని (నేటి భారతదేశంలో లాగా) నెలకొల్పితే ప్రజల సమస్యల పరిష్కారానికి 'రాజకీయ' మార్గం ఏర్పడుతుందన్నది ప్రచండ గారి వక్కాణింపు. ప్రజలు కోరుకుంటే పార్లమెంటరీ వ్యవస్థతో పాటుగా రాచరికం కూడా కొనసాగవచ్చన్నది దానికి ముక్తాయింపు. ఈ రాజు-రాచరికం అనే బూచీల్ని చూపి నేపాల్ ప్రజల్ని తాత్కాలికంగానైనా మభ్యపెట్టడం సాధ్యమేమోగాని, ఐదు దశాబ్దాలుగా అదే మల్టీ పార్టీ డెమోక్రసీలో మగ్గిపోతున్న భారత ప్రజానీకాన్ని కూడా తమ సమస్యలకు పరిష్కారమార్గం అదే అని నమ్మమంటే నమ్మడం కష్టమే.

ఆచరణలో పాలకవర్గాలు ప్రజల సమస్యల్ని పరిష్కరించడంలో చిత్తశుద్ధిని కనబరచని ఏ వ్యవస్థలైనా చరిత్రలో ప్రజలు తిరస్కరించిన దాఖలాలు అనేకం. అది రాచరిక వ్యవస్థా? ప్రజాస్వామ్య వ్యవస్థా అన్నది చర్చకు మాత్రమే పరిమితం. భారతదేశంలో నెహ్రూకాలం (ఓల్డ్ కాంగ్రెస్) నాటి కాంగ్రెస్ పరిపాలనైనా, నిన్నటి బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఎ. పాలనైనా, నేటి యు.పి.ఎ. పాలనైనా ఆచరణలో రాచరిక పోకడలు లేవంటే నమ్మడం సాధ్యం కాదు. భారత్ వెలిగిపోతోంది వాజ్‌పాయ్‌కి బ్రహ్మరథం పట్టండి. ఇందిరమ్మ రాజ్యం - ఇంటింట సౌభాగ్యం. రాజీవ్ బాట, సోనియమ్మ అభయ హస్తం. ప్రియాంక త్యాగం. రాహుల్ రంగ ప్రవేశం. దేవెగౌడ 'కుమార' వ్యామోహంలో పునీతమైన మతాతీత సెక్యులర్ తత్వం. అంతా కాంపెటీటివ్ మల్టీ పార్టీ ప్రజాస్వామ్యమే. రాచరిక పోకడలు మచ్చుకైనా కనిపించవు. యాభై సంవత్సరాల మల్టీ పార్టీ డెమోక్రసీలో వర్తమాన భారతం ప్రగతిపథంలో దూసుకుపోతోందని, వ్యక్తి వికాసం వెల్లివిరుస్తోందని, ఆత్మన్యూనత (ఆత్మహత్యలు కాదు సుమా) మచ్చుకైనా కనిపించట్లేదని మల్టీప్లెక్స్ కార్పొరేట్ మార్కెట్ మాయాజాలంతో నలుమూలలా మార్మోగుతున్న నినాదాలు అర్థంగాక విలవిల్లాడుతున్న సగటు భారతీయుడికి కొత్తగా ప్రచండ గారు చేస్తున్న వికటాట్టహాసం ఎలా వినిపిస్తుందో వేచి చూడాల్సిందే.

నేపాల్‌లో ప్రచండ గారికి (దశాబ్ది పోరాట ఉత్సవాల సందర్భంగా) ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా సాక్షాత్కరించిన మల్టీ పార్టీ కాంపెటీటివ్ డెమోక్రసీని భారతదేశంలో మావోయిస్టులు కూలదోయడానికి దశాబ్దాలుగా అలుపెరుగని సాయుధపోరు కొనసాగిస్తుండడమే గాక నేపాల్ మావోయిస్టులకు అత్యంత ఇష్టులు కూడా. ఇరుపార్టీలకు తాత్విక పునాది మావో ఆలోచనా విధానమే. ఇద్దరి మధ్య కమ్యూనిస్టు తాత్విక ఐక్యత కూడా సమ్మతమే. త్యాగాల బాటలో 'కారిడార్' కసరత్తులు సరేసరి. ఇదంతా లౌక్యమా ! గందరగోళమా ! లోపభూయిష్టమా ! ఆచరణలో 'మిలిటెన్సీ' ఆయుధాలకే పరిమితం కావడం (ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనలకు బదులు) మూలంగా జరుగుతున్న అనర్థమా ! మావో ఆలోచనా విధానమే నేటి మార్క్సిజం అన్న సూత్రీకరణలో దాగిన ప్రమాదమా ! ప్రజా సమస్యల పరిష్కారంలో పదును కోల్పోతున్న ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనల పర్యవసానమా ! అన్నిటినీ మించి పట్టెడన్నం కరువైన పేద ప్రజల దౌర్భాగ్యమా ! చర్చనీయాంశాలే.

ఒప్రపంచంలో ఇప్పటి వరకూ కొనసాగిన అన్ని ప్రజా పోరాటాలకు, ఉద్యమాలకు ప్రధాన నేపథ్యం ఆకలి - అసమానత - పేదరికం. ఫ్రెంచి విప్లవకాలానికి పూర్వం నుండీ నేటి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల వరకు దోపిడీ - పోరాట రూపాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నప్పటికీ సారాంశంలో నేపథ్యం నేటికీ ఆకలి - అసమానత - పేదరికాలే. ఉధృతమైన ప్రజాపోరాటాల ద్వారా పేదరికాన్ని ఎంతో కొంత జయించిన దేశాలకు ప్రతీకలు రష్యా, చైనాలు. ఇరవయ్యవ శతాబ్దాంతం వరకు పేదరికాన్ని జయించడానికి పోరాటమే ఏకైక మార్గమని నమ్మిన వ్యక్తులు, శక్తులు కారణాలు ఏవైనప్పటికీ పరిమితంగానైనా ప్రజల సమస్యల పరిష్కారానికి నేడు ప్రపంచవ్యాప్తంగా 'శాంతి చర్చల ప్రక్రియను' ఒక ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించి ఆచరించడం జరుగుతోంది.

పేదరిక నిర్మూలనకు సాయుధపోరాటాన్ని ఏకైక మార్గంగా ఎంచుకొన్న ఉద్యమాలు, పార్టీలు చర్చల ప్రక్రియను ఒక ప్రయోగపూర్వక ప్రత్యామ్నాయంగా ఆచరించడానికి ముందుకు రావడం హర్షించదగిన విషయం. కానీ నేపాల్ ప్రచండ గారు పేదరిక నిర్మూలనకు కాంపెటీటివ్ మల్టీ పార్టీ డెమోక్రసీని ప్రత్యామ్నాయంగా ముందుకు తేవడం అభ్యంతరకర ప్రతిపాదన అనడం కన్నా సందేహాలకు తావిచ్చేదిగా ఉందన్నది చరిత్ర నేర్పుతున్న పాఠం. ప్రపంచ చరిత్రలో సాయుధ పోరాట ఉద్యమాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వైపు చూపు సారించిన ప్రతిసారీ దగాపడుతుందన్నది ప్రజలే. ఇప్పటివరకు ప్రపంచంలో ఎక్కడా మల్టీ పార్టీ ప్రజాస్వామ్యం పేదరికాన్ని పరిష్కరించడం కాదు కదా కనీసంగా ఆ దిశ వైపుగా చిత్తశుద్ధితో అడుగులేసిన దాఖలాలు లేవనే చెప్పొచ్చు. ప్రశ్నలడగడానికి కూడా పైసల్ని ఆశిస్తున్న కాంపెటీటివ్ ప్రజాప్రతినిధులకు కూడా పార్లమెంట్లు నిలయాలవుతున్న వైనం మనం చూస్తున్నదే. నేపాల్ పరిస్థితులు ప్రత్యేకమైనవని అనుకున్నప్పటికి అక్కడ రాచరికం నామమాత్రమే. పేదరికమే ప్రమాదకరమైంది. ఒక శతాబ్దం క్రితం ఉన్న రాచరికాన్ని ఇప్పుడు అక్కడక్కడ అరాకొరగా మిగిలిపోయిన రాచరికాలకు పోలికే లేదు. అవి ఈరోజు కాకపోయినా రేపటికి కూలిపోవాల్సినవే. నేపాల్ ప్రచండ గారైనా, మరొకరైనా సాయుధపోరాట క్రమంలో అనుకోని ఆటుపోట్లకు గురై తీవ్రంగా నష్టపోవడం జరిగితే ఆగి ఆలోచించుకోవడానికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. అలా ఆగి ఆలోచించుకోవటానికి రోజురోజుకు ప్రజలకు దూరమై విశ్వాసం కోల్పోతున్న ఆధునిక రాచరిక వ్యవస్థల్ని తలపించే పార్లమెంట్ భవంతులకన్నా శాంతి చర్చల ప్రక్రియలే సరైన వేదికలేమోనన్నది ఆలోచించాల్సిన విషయం.

సమాజ పరిణామ క్రమంలో ఉన్నతమైన సమాజ నిర్మాణం కొరకు శతాబ్దాలుగా కొనసాగుతున్న 'ఘర్షణ'లో అనేక పోరాట రూపాలు ఆచరణలోకొచ్చాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతిపాదింపబడుతున్న శాంతి చర్చల ప్రక్రియ కూడా ఆ ఘర్షణలో భాగమే. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా కొనసాగిన, కొనసాగుతున్న పథకాలైనా, బ్యాలెట్ అండతో కొనసాగుతున్న పథకాలైనా ఈ రెండింటి సమన్వయంగా 'చర్చల' వేదికల ద్వారా ప్రతిపాదించే ప్రణాళికలైన (శ్రీలంక ఒక బలమైన ఉదాహరణ), ప్రక్రియ రూపమేదైనా చిత్తశుద్ధి ప్రధానం. చిత్తశుద్ధి లోపిస్తే అది బుల్లెట్ అయినా, బ్యాలెట్ అయినా, చర్చల ప్రక్రియ అయినా ప్రజలకు ఒరిగేదేమి లేకపోగా మిగిలేవి అదనపు కష్టాలే. నేటి నేపాల్ పరిణామాలు, నిన్న మొన్నటి ఆంధ్రప్రదేశ్ శాంతి చర్చల్లో చోటుచేసుకున్న బాధాకర ఘటనలు అందులో భాగమే.

అంతర్జాతీయ స్థాయిలో మీడియా పరంగా గుర్తింపు పొంది, జాతీయస్థాయిలో వేలమంది మేధావులు, రాష్ట్రస్థాయిలో లక్షలాది మంది ప్రజలు కోలాహలంగా కదిలి ఆంధ్రప్రదేశ్ చర్చల ప్రక్రియను ఎంతో ఆశతో, మరెంతో ఘనంగా స్వాగతించారన్న విషయం మనందరికీ తెలిసిందే. అదేక్రమంలో చర్చల్లో ప్రధాన భాగస్వాములైన పాలకవర్గ పార్టీలు, ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహించిన ప్రతినిధులు, ఉద్యమనాయకులు చర్చల ప్రక్రియ పట్ల ఎంతటి నిర్లక్ష్యాన్ని, అసహనాన్ని ప్రదర్శించి మొత్తం ప్రక్రియను ఎంతగా భ్రష్టు పట్టించారో కూడా మనం చూసిందే. శరవేగంగా పెరిగిపోతున్న ఆకలి, అసమానత, పేదరికాల్ని అరికట్టడంలోనూ, అదేస్థాయిలో రోజురోజుకూ ఉధృతమవుతున్న సాయుధపోరాటాల్ని అణిచెయ్యడంలోనూ విఫలమవుతున్న పాలకవర్గాలు చర్చల ప్రక్రియను చారిత్రకంగా తమకు లభించిన (అధికారాన్ని పదిలం చేసుకోవటానికి) మరొక అవకాశంగా భావించి ఉపయోగించుకోవటానికి ప్రయత్నిస్తున్నారన్నది వాస్తవం. చర్చల ప్రక్రియపట్ల పాలకవర్గాలు చిత్తశుద్ధిని లేశమాత్రమైనా ప్రదర్శించకపోయినా, అపారమైన ఉత్సాహాన్ని మాత్రం ప్రదర్శించడం జరిగింది. చర్చల వైఫల్యంలో పాలకవర్గాల చిత్తశుద్ధిని ప్రశ్నించటంలో అందరూ పోటీపడ్డవారే. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనన్యమైన త్యాగాలతో మిలిటెంట్ సాయుధపోరాటాలకు నాయకత్వం వహిస్తూ చర్చలకు ప్రాతినిధ్యం వహించిన ప్రతినిధులు, పార్టీల నాయకులు, చర్చల క్రమంలో ప్రదర్శించిన అవగాహనారాహిత్యాన్ని కనీసస్థాయిలో కూడా ప్రశ్నించే సాహసం చేయలేకపోవడం దురదృష్టం. చర్చల ప్రక్రియలో సంయమనంతో కూడుకున్న భాగస్వామ్యాన్ని గాని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన నిర్దిష్ట ప్రణాళికల్నిగాని రూపొందించి ప్రతిపాదించడంలో ఉద్యమనాయకత్వం విఫలమవ్వడమేకాక కనీస చిత్తశుద్ధిని కూడా ప్రదర్శించకపోవడం మూలంగా ప్రజలు మరెన్నో అదనపు కష్టాల్ని కానుకలుగా సమర్పించుకోక తప్పలేదు.

ఉన్నతమైన సమసమాజ నిర్మాణానికి సుదీర్ఘంగా కొనసాగే ప్రయాణంలో చర్చల ప్రక్రియ కూడా ఒక పోరాటరూపంగా భావించి భాగస్వామ్యం వహించటమంటే చర్చల ప్రక్రియలో తమ వ్యూహం - ఎత్తుగడలన్నీ కూడా ప్రజల సమస్యల పరిష్కారమే గీటురాయిగా రూపొందాలి. అప్పటికే ప్రజలు పోరాడి సాధించుకున్న వాటికి చట్టబద్ధత కల్పించేదిశగా ఆ 'ఎత్తుగడలు' రూపొందాలి.

సమైక్య, ప్రాంతీయ వాదాలు - తెలంగాణ

ఎన్. వెంకటేశ్వర్లు

వ్యాఖ్య

ఉద్యమ రాజకీయాలు, ఎన్నికల రాజకీయాలు జమిలిగా సాగుతున్న రోజులివి. ఎన్నో అసమానతల ప్రాతిపాదికన వ్యవస్థీకృత మార్పుల కోసంగానూ, సామాజిక రంగాలలోని ప్రతిష్టంభనను ప్రజలపరంగా కొనసాగే అధిక్షేపణలు సూచిస్తాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమాల చరిత్రను రాజకీయ పక్షాలు పరివేష్టితం చేసుకున్న అనంతరం, ప్రజల ఆకాంక్షలు బలపడినాయా, నీరుగారినవా అనేది అంచనా వేసుకోవాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ విషయానికొస్తే ఈ ప్రాంతం రాజకీయుల పోషకత్వానికి పెట్టింది పేరుగా తయారు చేశారు. తనదైన ప్రత్యేక సంస్కృతితో విలసిల్లుతున్న తెలంగాణ పాలకుల 'చేతు'ల్లో ఎప్పుడూ ఓటమి చవిచూస్తున్న దుర్లభ చరిత్ర ప్రజాస్వామికవాదుల అనుభవంగా ఉండింది. పరాయిల కుట్రలకు లోనవుతూ అందరూ మనవాళ్లేనని నమ్మే కలివిడి, తెలంగాణీయుల జీవన విధానంలో భాగమవుతూ వస్తోంది. ఇదే అదనుగా నాటి నిజాంల నుండి నేటి ఆంధ్ర పాలకుల దాకా దగాలకు, ప్రజాప్రతినిధుల మోసాలకు గురవుతూ, తేరుకుంటూ పోరాట సంస్కృతిని మొక్కవోని ధైర్యంతో ప్రజలు నిలబెట్టుకుంటున్నారు. ప్రజల ఆకాంక్షలను పక్కకు తోసి, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన పిదప పదవుల పబ్బం గడుపుకుంటూ, సమైక్య మంత్రపు మైకంలో వలసవాద భావదాస్యంనకు లోనవుతూ విద్రోహులుగా మారడం మన కండ్ల ముందరి సత్యంగా ఉంది. లొటపెట పెదవులకు నక్కాశపడ్డట్టు ప్రజల నమ్మకాలు వమ్మవుతూనే ఉన్నాయి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర లక్ష్యసిద్ధి కోసం '60లలో ఉధృతమైన ఉద్యమం తెలంగాణ ప్రజా సమితి (టిపిఎస్) నుండి నేటి తెలంగాణ రాష్ట్ర సమితి వరకూ లక్ష్యసిద్ధిలో నాయకులే అనుమానితులు తప్ప, ప్రజల దృఢ సంకల్పిత అనేకానేక ఉద్యమ సంస్థల పుట్టుకలతో రెన్యువల్ కాబడుతూనే ఉంది. భాష వంకతో, బంధాల వంకతో, వెనుకబాటు తనం, పాలక వివక్షతలను చూపినపుడు ఇప్పుడే కళ్లు తెరుచుకున్నట్లు సమైక్యవాదులు అభివృద్ధి, ప్యాకేజీలను విరుగుడుగా చెప్పారు. తెలంగాణీయులు లెక్కలతో సహా చెప్పిన వివరాలు, కేటాయింపుల్లోని పక్షపాతాలు విశాలాంధ్రులకు నీళ్ల నములుట వంతయ్యింది. ఇకిప్పుడూ రంగులతో రాజకీయాలతో సంబంధం లేకుండా 'తెలంగాణం' జాతీయ స్థాయిలో కుస్తీలు పడుతున్నట్టూ కన్పిస్తుంది. ప్రజలు గెలుస్తారా, రాజకీయ సిద్ధాంతాల పేర జరుగుచున్న పంతాలు గెలుస్తాయా అన్నది ఇప్పుడేసుకోవాల్సిన ప్రశ్న.

దేశ స్వాతంత్ర్యానంతరం కొత్త రాష్ట్రాలు ఏర్పడటం కొత్తేమి కాదు. స్వాతంత్ర్య సమయంలో 14 రాష్ట్రాలుగా ఉన్న దేశం నేడు 28 రాష్ట్రాలుగా ఏర్పాటు జరిగింది.

మిగిలిపోయిన కష్టాల్ని పరిష్కరించే ప్రణాళికల్ని రచించగలిగేవిగా 'వ్యూహాలు' ఉండాలి. అప్పుడే చర్చల ప్రక్రియ పోరాటాలకు ఒక అర్థవంతమైన 'మజిలీల గానూ, పోరాడుతున్న ప్రజలకు 'వెసులుబాటు' తో కూడుకున్న ఫలితాల్ని అందించడంలోనూ విజయవంతం అవుతుంది. అలాకాక, ఆంధ్రప్రదేశ్‌లోగా శాంతి - స్వావలంబన పేరుతో అంతిమ పరిష్కారాలకు శాంతి చర్చల ప్రక్రియను వేదికగా మార్చడమంటే పాలకవర్గాలకు ఉద్యమ నాయకత్వాలకు మధ్య జరిగిన లోపాయికారి ఒప్పందాలకు ఆ వేదికల్ని దిష్టిబొమ్మలుగా మార్చడమే అవుతుంది. పనిలో పనిగా తమ తమ రాజకీయ ప్రచార ఆర్భాటాలకు, బంధుమిత్రులతో కలిసి అలాయిబలాయిగా సహపంక్తి భోజనాలకు చర్చల ప్రక్రియను 'మంజీర' మయంగా మార్చుకోవడంగానే మిగిలిపోతుంది. సూక్ష్మంగా పరిశీలిస్తే (శ్రీలంక శాంతి చర్చల ప్రక్రియ మినహాయించి) శాంతి చర్చల ప్రక్రియ ఇటు ఆంధ్రప్రదేశ్‌లో అడవి మీద అధికారాన్ని మరికొంతకాలం సజావుగా కాపాడుకునే 'ఎత్తుగడ' గానూ, అటు నేపాల్‌లో అడవికే పరిమితమైన అధికారాన్ని దొడ్డిదారిలో పోటీ ప్రజాస్వామ్యం పేరుతో పార్లమెంట్ వరకు పరుగులెత్తించే 'వ్యూహం'గానూ మార్చి ప్రజలకు అపచారం చేయడమేగాక చరిత్రలో మావో ఆలోచనా విధానానికి మచ్చగా కూడా మిగల్చటమే అవుతుంది. నేపాల్ ప్రచండగారు జ్ఞానోదయంతో భారత ప్రజల్ని కూడా నేర్చుకోమంటున్న పాఠం కూడా అదే.

ఏ ఇజాలెలా మారినా, సాయుధపోరాటం ఎజెండాగా కొనసాగుతున్న నేపాల్, భారతదేశంలాంటి సమాజాల్లో శాంతి చర్చల ప్రక్రియ ఎవరికిష్టమున్నా లేకున్నా మళ్ళీ బలంగా మనముందుకు రావడం తథ్యం. అది ప్రజల ఆకాంక్ష కూడా. భవిష్యత్తు చర్చల ప్రక్రియను ఆకలి - అసమానత - పేదరికాల్ని నిర్మూలించే పరిష్కారాల్ని వెదికే వేదికలుగా మలచటానికి అన్ని వర్గాల ప్రజలు ప్రధానంగా మేధావులు, రాజకీయ పార్టీలు సంయమనంతో ఆలోచించి వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమవుతోంది. ❑

రాష్ట్ర పునఃనిర్వాహణ సంఘం (ఎస్ఆర్‌సి-1) ఫజల్ అలీ కమీషన్ సూచనల మేరకు జరిగినవి కొన్ని రాష్ట్రాలు కాగా, సంస్కృతి, పాలనా సౌలభ్యం కోసం, భాషా ప్రాతిపదికన రాష్ట్రాలుగా ఏర్పడినవి కొన్ని రాష్ట్రాలు. ఈ రాష్ట్రాల ఏర్పాటులో వ్యక్తానువ్యక్తంగా అంతర్లీనంగా పాటించిన సూత్రాలు ప్రాంతాల వెనుకబాటుతనం, అభివృద్ధి ఆకాంక్షకు తోడుగా ప్రజాసంస్కృతి పరిరక్షణతో ముడిపడిన ప్రజాస్వామ్యయుత ప్రజల డిమాండ్లు మాత్రమేగాని, కేవలం భాషనే ప్రాతిపాదిక కాదు.

తెలంగాణ ఒక పోరాట వారసత్వం. నిత్య చైతన్యంతో ఉద్యమాలకు స్రవంతిలాంటిది. 1947 ఆగస్టు 15న దేశమంతా మూడు రంగుల పతాకం రెపరెపలాడినా, హింసతో, దోపిడీ పీడనలతో తెలంగాణీయులు కకావికలం చెందారు. బ్రిటిషోడి కుతంత్రాల్లో భాగంగా సంస్థానాధీశులకు సర్వాధికారాలు అప్పజెప్పి, కొట్లాటలకు పాదుజేసి కాలవవతల వేసింద్రు. 'ఆంధ్ర' అప్పటికే మద్రాను రాష్ట్రంలో భాగంగా మూడు రంగుల తేజంతో వెలుగారుతోంది. నైజాం అరాచక విభాగమైన రజాకార్ల దాష్టికాలతో పచ్చని తెలంగాణ జీవితాలు బుగ్గిపాలు అగుచున్నరోజులవి. దేశానికి స్వాతంత్ర్యం వస్తే నాకేం వస్తదని ప్రశ్నించేటి ప్రజలు ఉండనే ఉన్నారు. అనేక ప్రశ్నలు, కొన్ని సర్దుబాటు సమాధానాల మధ్య, అప్పటికే అందిపుచ్చుకున్న బోల్షివిక్కు విప్లవ చైతన్యంతో తెలంగాణీయులు సాయుధ పోరాటం చేశారు. సంస్థానాధీశులైన నిజాం దుష్టశక్తులతో హోరాహోరీగా పోరాటం సాగింది. నిజాం అనుంగులైన దేశముఖ్‌ల, జమీందారుల బూర్జువాజీ విధానాలకు సాయుధ పోరు చాలా వరకూ జవాబు చెప్పింది. స్వాతంత్ర్య పిపాస, అప్పటి పీడక పాలకుల నుండి విమోచననే లక్ష్యంగా ఆడ-మగ, చిన్న-చితకా, కులం-మతం, రంగు-రాజకీయం భేదభావాలు లేని ఒక సామాజికోద్యమం తెలంగాణ సాయుధ పోరాటం. ఆఖరిగా వచ్చిన రాజ్యాంగ బలగాలు అప్పటికే పట్టుచితికిన నిజాం, రజాకార్ల ముఠాలను దాసోహపరుచుకున్నాయి. తెలివిడితో సంస్థానాధీశులు శర్తులతో లొంగి, తెలంగాణంలో పీల్చిపిప్పిజేసి కూడ బెట్టుకొనిన సంపదలతో 'స్వేచ్ఛ'గా పక్కకు దొలిగారు. ఫలితంగా 1948, సెప్టెంబరు 17 కల్లా తెలంగాణంలో హైద్రాబాద్ రాష్ట్ర అవతరణ మిలటరీ నాయకత్వంలో నెలకొంది.

తరువాత హైద్రాబాద్ రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరుచుకున్నాం. ప్రజాస్వామ్యయుత అంగాలతో పరిపాలనా సాగింది. ఆనాటికీ 'ఆంధ్ర' శబ్దమైనా వినని తెలంగాణ పల్లెలు కోకొల్లలు.

1953 కల్లా పొట్టి శ్రీరాములు నిరహార దీక్ష, మరణానంతర పర్యవసనాల వలన ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగింది. అచ్చంగా నేటి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రతిపాదిత అంశాలైన అసమ అభివృద్ధి, విద్యా, ఉద్యోగ, నీళ్లు, నిధుల కేటాయింపుల్లో జరిగిన పక్షపాత వైఖరియే ఆనాటి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు వెనుక అసలు కారణం. అప్పటికే రాష్ట్రంగా కొనసాగుతున్న తెలంగాణాను తమ రాష్ట్ర ఏర్పాటులో భాషను ఒక ప్రతిపాదిత అంశంగా ఆంధ్ర, విశాలాంధ్ర, సూడో సమైక్యవాదులు తీసుక రాకపోవడం ఇక్కడ గమనార్హం!

తెలంగాణలో సమృద్ధిగా ఉన్న నీళ్లు, నిధులు, ప్రకృతి వనరులూ, పాలనా అవస్థాపనా సౌకర్యాలు ఆంధ్రపాలకుల కండ్లల్లో పడ్డాయి. బ్రిటీష్ వారి వలసవాద రాజకీయాలను ఔపోసనపట్టిన ఆంధ్రనాయకులు, పాలకులూ, ప్రయోజనాలు దక్కించుకోవడంలో పాలక, ప్రతిపక్ష రంగూ, రాజకీయాలకతీతంగా, భావదాస్యంలో పేరు గడించిన తెలంగాణకు చెందిన బూర్జువాజీ అగ్రవర్ణాలను, ప్రాబల్య వర్గాలను తోడుచేసుకొని తెలంగాణలో తిష్ట వేయడానికి, వనరుల తస్కరణకు ఉపాయాలు వేశారు. అప్పుడే 'భాష' తెర మీదికి వచ్చింది. తదుపరి 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ విశాలాంధ్రగా, ఆంధ్ర అధికార విస్తరణ (సామ్రాజ్యవాదంతో పోల్చదగిన)కు సంకేతమయ్యింది.

మృగ్యమవుతున్న తెలంగాణ జీవితాలకు పథకాల, హామీలలోని డొల్లతనం వల్ల ప్రయోజనం కలుగకపోగా, నష్టమే ఎక్కువగా వాటిల్లిందనుటకు 'తెలుగుదేశం' హయాంలో ఏర్పరిచిన గిర్‌గ్లానీ కమీషన్ రిపోర్టునే పరాకాష్టగా చెప్పుకోవాలి.

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటులో పొట్టి శ్రీరాములు నిరాహార యుత చావును గొప్ప త్యాగంగా భావించే వలస పాలకులు, వారి భావదాస్య అనుంగులు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం వేలాది మంది ప్రాణత్యాగం చేస్తే వారి లక్ష్యాన్ని గుర్తించక పోగా వేర్పాటువాద అర్థంలో రాజకీయ విశ్లేషణలు చేయడం ఏపాటి రాజనీతి పరిణతియో సమైక్యవాదులను ప్రశ్నించి తీరాలి.

రాజ్యాంగయుతంగా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఏర్పడిన అనేకానేక ఉద్యమ సంస్థలను వానికి దన్నుగా నుండిన రాజకీయాలోచనాపరులను, కవులను, కళాకారులను వలస పాలకులు మట్టు బెడ్తున్నారు. 1971లో అశేష ప్రజానీకం ఇచ్చిన పది పైచిలుకు పార్లమెంటరీ సీట్లను గాని, 2004 సాధారణ ఎన్నికలలోని ఐదు పార్లమెంటరీ, 26 అసెంబ్లీ సీట్లు (టిఆర్ఎస్ కు చెందిన) గాని, ప్రజలను మభ్యపెట్టి అత్యధిక పార్లమెంటరీ, అసెంబ్లీ స్థానాలను గెలుపొందిన ఎన్నికల తీర్పులోని తెలంగాణ ప్రజల ఆకాంక్షలను విశ్వాసంలో తీసుకొనని దగాకోరు రాజకీయాలను ప్రజలు ఏమనుకోవాలి?

జాతీయ, రాష్ట్ర రాజకీయాలలో ఒక వెలుగు వెలుగుతుం దనుకుంటున్న కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, వామపక్ష జాతీయ రాజకీయ పార్టీలూ, ఎన్.సి.పి, ఆర్.జె.డి, ఆర్.ఎల్.డి, జె.ఎన్.ఎన్, జె.డి (యు) మరియు ప్రపంచబ్యాంకు ముద్దుబిడ్డ అనదగ్గ తెలుగుదేశం లాంటి ప్రాంతీయ పార్టీల రంగుల రాజకీయరాట్నంలో ఇప్పుడు 'తెలంగాణ' చిక్కుకుంది. ఏరుదాటేదాక జోరు మల్లయ్య, ఏరుదాటాకా బోడ మల్లయ్య అన్నట్లూ, ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తీరుస్తాం, వారుస్తాం అంటూ గద్దెనెక్కిన రాజకీయ పక్షాలు, అవి నెరవేర్చడంలో సాచివేత వైఖరి అవలంభించడంలోని 'అసలు రాజకీయాల'ను ప్రజలు అర్థం చేసుకోవాలి. పదవి, నాయకుడు,

రాజకీయం వరుసలలో ప్రజల ఆకాంక్షల కంటే, పదవియే ప్రమాణంగా కొనసాగుతున్న సమకాలీన రాజకీయాలివి.

భారతీయ జనతా పార్టీ విషయానికొస్తే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా 'కాకినాడ తీర్మానం' చేసి, ఒక్క ఓటు రెండు రాష్ట్రాలు అనే మరో రాజకీయ తీర్మానాన్ని నినాదం చేశారు. ఎన్.డి.ఏ కూటమి పాలనా కాలంలోనే బి.జె.పి జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్‌లను వరుసగా బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి వేరుచేసి రాష్ట్రాలుగా ప్రకటించారు. కానిప్పుడు ఆంధ్ర లాబీయింగ్‌కు తలొగ్గి తెలంగాణపై తమ వాణి మార్చుకొని 'అభివృద్ధి' వంతపాటనందుకున్నారు. ప్రజలను దగా చేయడంలో రాజకీయ పక్షాలకు సంబంధించినంత వరకు కాస్త ముందువెనుకలను పక్కకు పెడితే బి.జె.పికి తక్కువేం తీసిపోమన్నట్లు యు.పి.ఏ కూటమితో జాతీయ స్థాయిలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ, 2004 సాధారణ ఎన్నికల ముందు అసాధారణమైన రీతిలో టిఆర్‌ఎస్‌ని ఏర్పాటుచేసి, ప్రజల ఆకాంక్షల మేరకు సెకండ్ ఎస్.ఆర్.సి. ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తామని నమ్మబలికి, అట్టి దానిని తమ 'రాజకీయ విధానం' (మానిఫెస్టో)గా ప్రకటించినట్టు చేసుకొని కేంద్ర, రాష్ట్రాలలో మరో ఐదేండ్లకు గాను ప్రభుత్వాలను ఏర్పాటుచేసింది.

అప్పటి వరకూ హరోహరంగా తెలంగాణ సాధిద్దామనిన నాయకులు పదవుల గాడిలో హామీలను విస్మరిస్తున్నారు.

ఇప్పటి వరకూ చరిత్రను పరిశీలిస్తే పాలక, ప్రతిపక్ష అన్న తేడా, సిద్ధాంత బేధాలు లేకుండా తెలంగాణ విషయంలో ఒకే వైఖరి కలిగి ఉన్నాయి. ఇక బోల్ష్‌విక్ విప్లవ నేపథ్యంలో ఏర్పడినట్టు చెప్తున్న భారత కమ్యూనిస్టు పార్టీలు కొన్ని, తెలంగాణ వెనుకబాటు వెనుక వీరి నిర్లిప్త రాజకీయాలు గుర్తించక పోవడం గురిగింజ సామెతే అవుతుంది. నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాధించిన ఘనమైన చరిత్రను సొంతం చేసుకొన్న ఉమ్మడి కమ్యూనిస్టులు, దశాబ్దాల తరబడి ప్రజాతంత్ర వ్యవస్థలో సైతం నిజాం కాలంనాటి గోడు, అవే డిమాండ్లు, అదే ఉద్యమ స్ఫూర్తి కమ్యూనిస్టులను కదిలించకపోవడం ఒక విషాదంగా చెప్పాలి. మార్క్సిస్టు సిద్ధాంత వ్యాకరణంగా చెప్పుకొనే ఏ గతితార్కిక, చారిత్రక భౌతికవాద చలన సూత్రాలకు కేవలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విరుద్ధమో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ లాంటి పార్టీల వారి కపట కమ్యూనిస్టు భావాలు తేటతెల్లం చేస్తాయి. 'కమ్యూనిస్టుల' మాటల వెనుక ఆంధ్ర లాబియింగ్‌కు, అగ్రవర్ణ పెత్తందారీ భావాలున్న నాయకత్వం కింద పనిజేసే భావదాస్యమే తప్ప, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించడంలో అభివృద్ధికరమైన మార్క్సిస్టు అభ్యంతరం ఏమీ లేదనడం లోకవిదితం.

ఈ నేపథ్యంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే ప్రధాన 'అజెండా'గా చేసుకొని 2001లో ఏర్పడ్డ టిఆర్ఎస్ ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వివిధ రంగు-రాజకీయాలకు చెందిన అసమ్మతి నాయకులతో, అన్ని రాజకీయ పక్షాల వలనే ఆధిపత్య కులాలకు నిలయం ఇది. టిఆర్ఎస్ రాజకీయ పక్షంగా ఏర్పడక ముందు అదే లక్ష్యంతో సాగిన ప్రజా సంఘాలకు చెందిన ఉద్యమ కార్యకర్తలు, నాయకులు దీనిలో భాగంగా ఉన్నారు. ఒకనాటి టిడిపి స్థాపన దాని రాజకీయ లక్ష్యాల కంటేను కరిష్మా నాయకుని చుట్టూరా పదవుల కోసం కాంగ్రెస్ నుండి వలసలు చోటు చేసుకుంటే, టిఆర్ఎస్ తెలంగాణనే కరిష్మాగా చేసుకొని కాంగ్రెస్, టిడిపి, బిజెపి, వామపక్షీయుల వలసలకు నిలయంగా మారింది. మార్పు కోరదగినదే అయినప్పటికీ పదవి ప్రమాణంగా, లక్ష్యశుద్ధి లేకుండా జరిగే వలసలు అనుమానింపదగినవి. టిఆర్ఎస్ శ్రేణుల్లో మేధావి, యువజన వర్గాలు కొనమెరుపు మాత్రమే. ప్రజలే 'విశ్వసనీయ' తెలంగాణ మద్దతుదారులుగా ఉంటున్నారు. కుల, ధన బలాల లక్షణాలతో రాజకీయపక్షాలు ఓట్ల కోసంగానే తమ మానిఫెస్టోలను ప్రకటించుకొని, సీట్లొచ్చాక రాజధానుల్లో విలాసంగా గడపడం ప్రజల అనుభవంగా ఉంది. ప్రజాస్వామ్యయుత రాజకీయ నిర్మాణంలేని పార్టీగా టిఆర్ఎస్‌కు దీనిలో ఎంతమాత్రం మినహాయింపులేదు.

తెలంగాణకు కట్టుబడి ఉంటున్నామని కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్‌లు వంతులవారీగా చెప్పుకుంటూనే పార్లమెంట్‌లో మెజారిటీ ఉన్నా 'బిల్లు' ప్రవేశపెట్టడంలో వెనుకంజవేయడం, ఇంకొన్నాళ్లు 'తెలంగాణ'ను తమ స్వార్థరాజకీయాలలో భాగం చేసుకోవడం గానీ లేదా తమ అసలు రంగు-రాజకీయాలు బట్టబయలు అవుతాయనే భయంగాని ఉన్నట్టుగా ప్రజలు అనుమానించవలసి వస్తుంది.

తొంభైల నుంచి ప్రబలంగా అమలవుతున్న నూతన ఆర్థిక విధానాలలో భాగంగా స్కాంలు, కమీషన్‌లు, గుడ్‌విల్‌లు, పర్సెంటేజీలు, పర్సులు, సూట్‌కేస్‌లకు ఆలవాలమైన పార్టీలు తదనుగుణమైన రాజకీయ విధానాలు ఏర్పరుచుకొని, పదవుల కోసం టెంట్‌లు, ఫ్రంట్‌లు కడతారే గాని ప్రజల ఆకాంక్షల కోసం అంతగా ఆతురత పడ్డట్టూ చరిత్ర లేదు.

ఇలా బహిర్గత రాజకీయాలు (సరళీకరణ పద్ధతిలో) ఒకటిగా, అంతరంగిక రాజకీయాలు (ప్రవేటీకరణ పద్ధతిలో) మరొకటిగా, మొత్తంగా గ్లోబలైజేషన్ నీడలో రాజకీయ పక్షాల పడగలు ప్రజల పైనున్నాయి. ఇక తేల్చుకోవాల్సింది మనమే. ❑

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడ అంతే. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

- సంపాదకులు

పాఠశాలల రేషనలైజేషన్ - బాధ్యత తప్పించుకునే ఎత్తుగడ

జి. రాంమోహన్

విధాన విమర్శ

రాష్ట్ర ప్రభుత్వ చొరవతో నేడు జరుగుతున్న పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియను పైపైన చూసేవారికి న్యాయమే అనిపించినా విద్యారంగంలోని మార్పులను అధ్యయనం చేస్తున్నవారికి అసంతృప్తిని మిగిలిస్తోంది. ప్రభుత్వం తనకు వీలైన కేసులన్నింటిలోనూ పాఠశాలల, ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌ను చేపడుతూ సాధ్యమైన అన్ని సందర్భాలలో వాటి విలీనాన్ని చేపడుతోంది. విద్యామంత్రి ఎన్. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ 1,200 పాఠశాలల్లో 10మంది కంటే తక్కువమంది విద్యార్థులు వున్నారని అందువల్లే రేషనలైజేషన్‌ను చేపడుతున్నామని పేర్కొంది. ఇలా విద్యార్థుల సంఖ్య కుచించుకుపోవడానికి గల కారణాలను అన్వేషించి తగు చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం నేడు ఈ విధాన అమలుకై జీ.వో. 103ను ప్రవేశపెట్టింది. ఇది బాధ్యతల నుండి తప్పుకోవడానికి ముందస్తు చర్య తప్ప వేరు కాదని గుర్తుంచుకోవాలి. సాధారణంగా నేటివరకూ పారిశ్రామిక సంస్థలలోని శ్రామికశక్తిని కోత విధించటంలో ఉపయోగించే పదజాలాన్ని ఇందులో వినియోగించటమే. ఈ ప్రక్రియ వెనుక వున్న తిరోగామి భావనను సూచిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 45, పదిహేను సంవత్సరాలలోపు పిల్లలందరికీ (1961 లోపే) ఉచిత, కచ్చితమైన విద్యను అందించాలని నిర్దేశించింది. కానీ ఈ హక్కును అమలు చేయటలో మనం నేటివరకూ దరిదాపులలో లేము. ప్రపంచంలోని నిరక్షరాస్యులలో నేటికీ సగంమంది మన దేశంలోనే వున్నారు. దేశస్థాయిలో విద్యారంగ స్థితిని పరిశీలించి దాని ప్రభావం రాష్ట్రంపై ఎలా వుందో చూద్దాం. నేడు అక్షరాస్యతను విద్యకు ప్రామాణికంగా దిగజార్చుతున్నారు. 2002లో అక్షరాస్యతా శాతంలో (15 నుండి ఎగువ వయసుగల వారిలో) దక్షిణకొరియా 98, చైనా 91, వియత్నాం 90, ఫిలిప్పైన్స్ 89 శాతం కాగా భారత్‌లో అది కేవలం 61 శాతం మాత్రమే.

ప్రపంచంలోని 30 శాతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మనవారేనని మనం బడాయి పడుతున్నా 2005 యు.ఎన్.డి.పి. (ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం) నివేదిక మనల్ని మానవాభివృద్ధిలో 177 దేశాలలో 127వ స్థానంలో వుంచుతోంది. మానవ అభివృద్ధి సూచిక జీవితకాలం, వయోజన విద్య, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నతవిద్యలో స్థూల నమోదు, తలసరి ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయిస్తారు. 2005 నివేదిక భారతదేశం, చైనా, శ్రీలంకలను వరుసక్రమంలో 127, 85, 93వ స్థానాల్లో వుంచుతోంది. ఈ నివేదిక అభివృద్ధి శాతం తక్కువగా వున్నా బంగ్లాదేశ్ మానవాభివృద్ధిలో వేగిర ప్రగతిని సాధించిందని దానిపై ప్రశంసల వర్షం కురిపించింది. మనల్ని జి-8 దేశాల సరసన చేరి సభ్యత్వం పొందమని తాయిలాలు చూపుతుండగానే మన దేశంలో దానికి తగ్గట్టుగా పేదరికంలో తగ్గుదల లేదు. 60 శాతం పాఠశాల నమోదులో మనం 131వ స్థానంలో వున్నాం.

1965లో కొఠారి కమీషన్ జి.డి.పి.లో 6శాతం విద్యకై ఖర్చు చేయాలని సిఫారసు చేసింది. కానీ అది నేటివరకూ అత్యధికంగా 3.2 శాతానికి, అత్యల్పంగా 2.7 శాతానికి పరిమితమైంది. జి.డి.పి.లో 6 శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి 2004-05 బడ్జెట్ కేటాయింపులు రు.1,86,517 కోట్లు వుండాల్సి వుంటుంది. వాస్తవంగా ఆ ఏడాది అన్ని సామాజిక సేవల కేటాయింపులు మిళితం చేసినా విద్యారంగానికి చేయాల్సిన 6శాతం కేటాయింపులకు తక్కువగానే ఉండినాయి. అన్ని ప్రజాస్వామ్య దేశాలలో పాటించే కామన్ స్కూల్ విధానాన్ని చర్చలల్లో అసలు పరిగణనలోనికి తీసుకోవడం లేదు. ఈ పద్ధతిలో ఒక ప్రాంతంలోని విద్యార్థులు ఆ పరిధిలోని పాఠశాలకే వెళ్ళాల్సి వుంటుంది. మనం నకలు నమూనాగా తీసుకుంటున్న అమెరికాలో ప్రైవేట్ పాఠశాలలు లేవు. మన దేశ రాజ్యాంగంలో విద్యను ప్రాథమిక హక్కుగా కాక ఆదేశిక సూత్రాలలో భాగం చేశారు మన రాజ్యాంగ నిర్మాతలు. దీనిని సవరణతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఎ ప్రాథమిక హక్కుగా గుర్తించింది. 2003లో ఇలా గుర్తించినా హక్కుగా అమలు చేసే బాధ్యత ఎవరిపై వుందో సరైన స్పష్టత లేదు. ఈ బాధ్యత కేంద్రం, రాష్ట్రం, పంచాయతీ, మున్సిపాలిటీ లేదా తల్లిదండ్రులదా అనే అంశంపై స్పష్టత లేదు. దీని అమలుకై తదనుగుణంగా ఎటువంటి చట్టాలు లేవు.

పరిస్థితి ఇలా వుండగా విద్యాబాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుంటున్న సూచనలు అన్నిచోట్లా వున్నాయి. మహానగరాలు, పట్టణాలలోనే కాక గ్రామీణప్రాంతాలలోనూ ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒకవైపు కేటాయింపులను తగ్గిస్తూ అతికొద్ది సంఖ్యలో 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' పేరిట ఉన్నత ప్రమాణాలు గల సంస్థలను స్థాపిస్తూ మరోవైపు అర్థమనస్కంగా పెక్కుమధ్య రకపు విద్యాసంస్థలు 1985లో రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం తరువాత పుట్టుకొచ్చాయి. సరళీకరణ విధానాల తత్వానికి తగినట్టుగానే కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పేరును 'మానవ వనరుల మంత్రిత్వశాఖ'గా పేరు మార్చి ఇనుము, బొగ్గు మొదలగు ఇతర వస్తువుల సరసన మానవులను చేర్చేశారు. 1991లో నూతన ఆర్థిక విధానాల ప్రారంభంతో ఈ ప్రక్రియ మరింత వేగిరమైంది. థాయ్‌లాండ్‌లోని

జోమెటీన్, డకార్ సమావేశాలు కేవలం కంటి తుడుపు చర్యలు మాత్రమే.

దేశస్థాయిలో విద్యారంగ స్థితి ఈరకంగా ఉండగా రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యా పరిస్థితి ఎలా వుందో పరిశీలిద్దాం. ఆదర్శంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో 30 శాతాన్ని విద్యకు కేటాయించాలి. 2005-06 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ రు.55,331.30 కోట్లు కాగా విద్యకు రు.5350.45 కోట్లతో కేవలం 11 శాతాన్ని కేటాయించారు. 2004-05 గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని 92,768 పాఠశాలలకుగాను అంతే సంఖ్యలో పాఠశాలకు నల్లబల్లలు, భవనాలు లాంటి ప్రాథమిక సౌకర్యాల లేమి వుంది. కనీసం నల్లబల్లలు లేని పాఠశాలలు 8,529. కొద్దికాలం క్రితం వాటి కల్పనకై కేంద్రస్థాయిలో ఒక పథకాన్ని ప్రారంభించిన అంశాన్ని మనం గుర్తుంచుకోవాలి. 6805 పాఠశాలలకు భవనాలు లేకపోవడం మూలాన వారిపై బలవంతపు 'శాంతినికేతన్' అమలవుతోంది. భారీ, స్వల్ప మరమ్మత్తులు అవసరమైన తరగతి గదులు వరుసగా 3,600, 6,194. మొత్తం 1,35,02,075 పిల్లల జనాభాలో 1,09,043 మంది నమోదుకాగా, 25,42,032 మంది పాఠశాల విద్యకు దూరంగా మిగిలిపోయారు. కానీ ప్రభుత్వం మాత్రం 4.23 లక్షల మంది మాత్రమే విద్యకు దూరంగా వున్నారని పేర్కొంటోంది. రాష్ట్రంలో నేడు 59,418 మంది విద్యావాలంటీర్లు వుండడం అంతేమంది అర్హతలు గల ఉపాధ్యాయుల కొరతను సూచిస్తోంది. ఇలాంటి స్థితిలో 2001లో ఆంధ్రప్రదేశ్ 61.11 శాతంతో అక్షరాస్యతలో 28వ స్థానంలో ఉండటం (పురుషులు మహిళలు అక్షరాస్యతా రేట్లలో వరుసగా 70.85 శాతం, 51.17 శాతం వుండినారు) ఆశ్చర్యదాయకం కాదు. వారు 10వ తరగతి చేరే సమయానికి 2003-04 సంవత్సరంలో విద్యను వదలుతున్న వారి శాతం 66.70 శాతం. ఒకవైపు నమోదు కాని పిల్లలు ఉండగా ప్రభుత్వం పాఠశాలల్లో తగిన సంఖ్యలో పిల్లలు లేరని అంటోంది. దీని పర్యవసానాలు ఒక నమూనాగా హైదరాబాద్‌ను పరిశీలించి అర్థం చేసుకుందాం.

1980లో హైదరాబాద్‌లో 6,200 మంది ఉపాధ్యాయులు ఉండగా నేడు కేవలం 4,900 మంది మాత్రమే వున్నారు. నాడు 128 ఉన్నత పాఠశాలలకు గాను 1625 మంది అధ్యాపకులుండగా 158 ఉన్నత పాఠశాలలకుగానూ అధ్యాపకుల సంఖ్య 1400 మందికి పడిపోయింది. అవి భాషా మాధ్యమాలు స్థాయిలల్లో 466 ఖాళీలకు గానూ 469 పాఠశాల అసిస్టెంట్ పోస్టులు పదోన్నతుల మూలంగా ఖాళీగా మిగిలాయి. 2000 సంవత్సరానికి మునుపు ప్రతి ఉన్నత పాఠశాలలో ముగ్గురు పాఠశాల అసిస్టెంట్‌లు ఉండేవారు. నూతన నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలకు ఐదుగురు అసిస్టెంట్‌లు వుండాల్సి వుండగా విద్యార్థుల లేమి మూలంగా ఉపాధ్యాయులు అధికంగా వున్నారని ప్రభుత్వ వాదన. కానీ పెరుగుతున్న పట్టణాలలో నేడు 800 వాడలలో 500 మురికివాడలల్లో అధికారిక అంచనాల ప్రకారమే ఎటువంటి పాఠశాలలు లేవు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో ప్రభుత్వం అద్దెలు చెల్లించనందున పాఠశాల మూతపడింది.

ప్రభుత్వం నేడు పరిపాలనా ఖర్చులు తగ్గించుకునేందుకై 65 పాఠశాలలను విలీనం చేయాలని అంటోంది. ఇలా చూడడానికి న్యాయంగానే కనిపించినా వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. ఉదాహరణకు ముషీరాబాద్‌లో అయిదు ప్రభుత్వ పాఠశాలలు (ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల, బోలక్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల) ఒకే ఆవరణలో వున్నాయి. పరిపాలనా విభాగం ఒకే భవనం నుండి పనిచేస్తున్న మూడు పాఠశాలలను విలీనం చేయబూనుకుంటోంది. ఇక్కడ దాస్తున్న విషయం ఏమంటే ఈ పాఠశాలలు తాత్కాలిక ప్రాతిపదికపై నగరంలోని వివిధ భాగాల నుండి పాఠశాల భవనం లాంటి ప్రాథమిక అవసరాలు కూడా లేనందున తరలించారు. ఆయా ప్రాంతాలలో భవనాలను నిర్మించటం లేదా వాటిని అద్దె ప్రాతిపదికపై సమకూర్చుకొని వాటిని తరలించటం చేపట్టకుండా ప్రభుత్వం వాటిని విలీనం చేయటానికే పూనుకుంటూ కాగితాలపై మాత్రం నూతనంగా పాఠశాలలు తెరవాల్సిన ప్రాంతాలను చూపుతోంది. భవనాలను అద్దెకు సమకూర్చుకోవడం లేదా నిర్మించటం అనే ప్రక్రియను నేటికీ ప్రారంభించనే లేదు. ప్రభుత్వ జీ.వో. నెం. 32 ప్రకారం ప్రతి చదరపు అడుగుకు కేవలం రూ. 5 ను అద్దెగా నిర్ణయించారు. మార్కెట్ ధరలతో పోల్చినప్పుడు ఇది అతి స్వల్పం. వీటిలో అనేక పాఠశాలలు ఈ అతితక్కువ అద్దెల మూలంగానే వాటి యాజమాన్యాలు వాటిని అద్దెకు ఇవ్వడానికి విముఖత చూపటంతో తరలించడం జరిగింది. వీటిలో కొన్నింటిని ఆయా భవనాలు శిథిలావస్థలోనికి చేరటంతో తరలించారు. విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయ తరలింపులు, పదోన్నతులను ఏకకాలంలో చేపట్టడం ఉపాధ్యాయుల హాజరుపై తీవ్రమైన ప్రభావం చూపగలదు. పాఠశాలల మధ్య దూరం పెరగడం మూలంగా బాలిక విద్యపై తీవ్రంగా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం వుంది. 2001-02 సంవత్సరంలో 7,351 నూతన ప్రాథమిక పాఠశాలలను 13,673 మంది ఎస్.జి.టి. పోస్టులను రెండు సంవత్సరాలలో నియమించి ఎటువంటి ప్రాథమిక సౌకర్యాలు లేని కారణంగా తాత్కాలికంగా సమీపంలోని పాఠశాలల్లో ప్రారంభించారు. నేడు వాటినన్నింటిని విలీనం చేస్తున్నారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా నేడు 15,000 మంది అధ్యాపకులను రేషనలైజేషన్ చేసి ఉపాధ్యాయులను తరలించారు. అందులో భాగంగానే 6,000 పాఠశాలలను మూసివేశారు.

విస్తృతంగా ఉన్న గ్రామీణ పాఠశాలల్లో భారతదేశం అధిక వ్యయంతో కూడిన పాఠశాల వాతావరణాన్ని భరించలేదని అనేకమంది వాదన. ఆర్థికంగా వాస్తవిక దృష్టిని పాటించాలనే వాదనతో పారా టీచర్లు లేదా విద్యా వాలంటీర్లను ఉపయోగించుకోవాలంటుంది. అయితే ఆ కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలు మాత్రం నిధులిచ్చే ఏజెన్సీలను మెప్పించేందుకై బ్రహ్మాండమైన కాగితాలపై ముద్రిస్తారు. అనేక సందర్భాలలో ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవటాన్ని సమర్థించుకునేందుకు 'సంఘానికి సాధికారత', 'వికేంద్రీకరణ'

లాంటి పదజాలాన్ని విద్యా హామీ పథకం లాంటి వాటిలో వినియోగిస్తున్నారు. తద్వారా విద్యా సౌకర్యాన్ని అందుబాటును సమానత్వాన్ని దూరం చేస్తున్నారు. రెగ్యులర్ పాఠశాలల స్థానే అనియత విద్య ప్రత్యామ్నాయ పాఠశాలల ప్రారంభాన్ని ప్రభుత్వం యోచిస్తోంది. ఒక విద్యార్థి విద్యా అవసరాలను ఇవి పరిపూర్తి చేయగలవన్న భావనే సరైనదైతే రాష్ట్రంలో నేడు పుట్టుకొస్తున్న కార్పొరేట్ పాఠశాలల స్థానే వీటిని స్థాపించవచ్చు. దీనికి ఏకైక సరైన ప్రత్యామ్నాయం అన్ని ప్రజాస్వామిక దేశాల బాటలో కామన్ స్కూల్ విధానాన్ని చేపట్టడమే. మనం 2015 సంవత్సరాంతానికి అందరికీ విద్య అనే మరో బ్రహ్మాండమైన మిలీనియం అభివృద్ధి లక్ష్యాన్ని పరిపూర్తి చేయగల దరిదాపుల్లో లేమని స్పష్టమవుతుంది. ఇలాంటి ఘోర పరిస్థితుల్లో మనం విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థలో భాగంగా విజ్ఞాన సమాజాన్ని నిర్మించే స్థితిలో ఉన్నామా? ❑

(6 వ పేజీ తరువాయి)

వివిధ అభివృద్ధి స్థాయిల్లో వున్న 250కి పైగా భాషలున్న దేశంలో మనం తగవు పడవలసింది దేశానికి అధికార భాషా హోదా, ప్రాచీనతా హోదా కావాలని కాదు. ఈ భాషలన్నింటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, మాతృభాషలోనే విద్యాబోధన, పరిపాలనతో సహా సకల వ్యవహారాలు సాగాలని. భారతరాజ్యాంగ చట్టాన్ని ఒక్క హిందీలోనే తర్జుమా చెయ్యటానికి 55 ఏళ్ళు తీసుకున్న పాలకుల నుండి మనమిలాంటి విధానాన్ని ఆశించలేం.

ఆంధ్రప్రదేశ్ విడిపోయి రెండు రాష్ట్రాలేర్పడినా, లేక మూడు రాష్ట్రాలేర్పడినా, తెలుగులోనే విద్యాబోధన, పరిపాలనా, మిగిలిన జీవన వ్యవహారాలు సాగాల్సే ఉంటుంది. దానితోపాటు తెలంగాణాలో ఉర్దూ, ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారి భాషలు కూడా ఉంటాయి. మాతృభాష అన్న నియమం వీరందరికీ వర్తిస్తుంది.

ఇలాంటి విధానాన్ని నేటి పాలకులు అనుసరించ నప్పుడు, పోరాడి సాధించుకోవాలి. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి జోహుకుమంటున్న నేటి దళారీ పాలకులు ఇటువంటి విధానాలు అమలు జరపనప్పుడు, ఇలాంటి భాషా విధానాన్ని అమలు జరపగల వ్యవస్థ నిర్మాణం కోసం పోరాడాలి. మాతృభాషా నినాదం అలాంటి పోరాటానికి మానసిక సంసిద్ధతను కలుగజేసే అంశాల్లో ఒకటిగా వుంటుంది. కాగా మాతృభాషా పరిరక్షణ అంటే సమైక్య ఆంధ్రప్రదేశ్ పరిరక్షణగానూ, తెలంగాణా ప్రాంతీయ ఆకాంక్షలకు వ్యతిరేకమైనదిగానూ ఎలా ఉంటుందో రుక్మిణిగారు వివరిస్తే తెలుసుకుంటాను. రుక్మిణిగారు ఈ పని చేయకపోగా, ఎలాంటి ఆధారాలూ చూపకుండా తెలుగు భాషా పరిరక్షణ అంటే రవిబాబుకి సమైక్య ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ అని నిర్ధారించారు. మరోచోట ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు వ్యతిరేకమని ప్రజలలో అపోహ ఉందంటూ నిందారోపణను 'ప్రజాస్వామీ'కరించారు.

విమర్శలో ఇది ఏ విలువలను పాటించకపోవడమే. ఇది విచారకరమే కాదు గర్హనీయం కూడా. వ్యక్తులనూ, సంస్థలనూ పేర్కొని ఆరోపణలు చేసేటప్పుడు (తెలియకకాదు. ఈ వ్యాసంలో ఈ విషయాన్ని రుక్మిణిగారే పేర్కొన్నారు) బాధ్యతగా రాయాలి. సరిగ్గా ఈ వ్యాసంలో ఈ బాధ్యతారాహిత్యమే సాగింది. రవిబాబుగారిపైనే కాదు. తెలకపల్లి రవిగారి విషయంలో కూడా ఇదే చేశారు. మావోయిస్టు పార్టీ గురించి ఆయన అభిప్రాయం సుస్పష్టమే. ఆయన దానిని అతివాద దుస్సాహసిక వాదమంటున్నారు. ప్రత్యేక తెలంగాణా పట్ల ఆయన వైఖరి స్పష్టమే. ఆ స్పష్టమైన అభిప్రాయాలు కలిగి ఉన్నందున ఆయనను ప్రజా వ్యతిరేకి అని అన్యాపదేశంగా ముద్ర వేయడం (అభిప్రాయాలలోని తప్పొప్పులను చర్చించుకోవచ్చు ఎంత ఘాటుగానైనా), అదీ ప్రజలనుకుంటున్నారని వంక చెప్పి, ఇది నిజాయితీ హీనత కాదా?

రుక్మిణిగారు ఎలాగూ స్టాలిన్ పేరు ఎత్తారు గాబట్టి స్టాలిన్ చెప్పిన విషయాలను మళ్ళీ చెప్పాల్సి వస్తోంది. జాతీయ ఉద్యమాలకు ద్వంద్వ (ప్రగతిశీల, ప్రగతి నిరోధక) స్వభావం ఉంటుందనీ, నేటి సామ్రాజ్యవాదం - కార్మికవర్గ విప్లవాల యుగంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక, దోపిడీవర్గ వ్యతిరేక స్వభావానికి లోబడిన జాతీయ ఉద్యమాలు మాత్రమే ప్రగతిశీల పాత్ర పోషిస్తాయనీ, వాటికి మార్గదర్శకత్వం కమ్యూనిస్టు పార్టీ అందించాలని స్టాలిన్ చెప్పారు.

విప్లవ అవగాహన (లేదా ఆచరణ)లను గురించి మాట్లాడుతున్న రుక్మిణిగారికి తెలంగాణా ప్రజల జాతీయ ప్రజాస్వామిక ఆకాంక్షలకూ, కెసిఆర్ నాయకత్వంలోని టిఆర్ఎస్ లేవనెత్తుతున్న ప్రత్యేక రాష్ట్ర నినాదానికి తేడా తెలియదని భావించలేము. టిఆర్ఎస్, ఆ కోవలోని ప్రత్యేక రాష్ట్ర వాదులూ లేవనెత్తుతున్న ప్రాంతీయ వైషమ్యాలను వ్యతిరేకించటాన్ని జాతీయ ప్రజాస్వామిక ఆకాంక్షలను వ్యతిరేకించే వారిగా చిత్రించటం లక్ష్యరహితంగానే సాగుతున్నదా? లేదంటే, ఏ విప్లవ అవగాహనతో సాగుతున్నది? రుక్మిణిగారు ఆత్మావలోకనం చేసుకోవటమవసరం.

వ్యక్తులపైనా, సంస్థపైనా నిరాధార నిందారోపణలు చేసిన వ్యాసం ప్రచురించినందున, అది కలిగించే అపోహలు సరిదిద్దవలసి ఉన్నందున ఈ లేఖను ప్రచురించవలసిందిగా కోరుతున్నాను.

- జగన్
చల్లపల్లి

యాభైయేండ్ల నిర్లక్ష్యం తెలంగాణా నీటి సమస్యలు

ఆర్.విద్యాసాగర్‌రావు

సమైక్యాంధ్రలో మిగిలిన రంగాల మాట ఎలా వున్నా నీటిరంగంలో మాత్రం తెలంగాణా ఘోరంగా వంచింపబడింది. హైదరాబాద్ ప్రభుత్వం రూపొందించిన అప్పర్ కృష్ణా పథకం (ఈనాటి ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలు) భీమా పథకం, తుంగభద్ర ఎడమకాలువ పొడిగింపు పథకాలతో పాటు, పోచంపాడులను (శ్రీరాంసాగర్ ప్రాజెక్టు) యధాతథంగా అమలుచేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృతకృత్యమవక పోవడం, చిత్తశుద్ధితో తెలంగాణాకు రావలసిన నీటివాటా గురించి బచావత్ ట్రిబ్యునల్ ఎదుట సమర్ధంగా వాదించి సాధించలేక పోవడంతో తెలంగాణా పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా అయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడకుండా, హైదరాబాద్ ప్రభుత్వం కొనసాగుంటే ఈవేళ హైదరాబాద్ నగరానికి ఆల్మట్టి డ్యాం నుంచి సులువుగా త్రాగునీరు అంది ఉండేది. మహబూబ్‌నగర్ జిల్లా కరువు కాటకాల నుండి బయటపడి వుండేది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్నాటక ఏర్పడడంతో ఆ రాష్ట్రం అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, తుంగభద్ర ఎడమకాలువను తమ రాష్ట్ర ప్రయోజనాల కనుగుణంగానే మార్చుకోవడం జరిగింది. భీమా పథకం పట్ల కర్నాటక ఆసక్తి చూపలేదు. అదేవిధంగా పోచంపాడు విషయంలో మహారాష్ట్ర అడ్డం పడటంతో అది కూడా హైదరాబాద్ ప్రభుత్వం తలపెట్టినట్టు అమలుకాలేదు. ఆంధ్రప్రదేశ్ హయాంలో పూర్తయిన నాగార్జునసాగర్ ఆంధ్ర పాలకుల కుతంత్రాలకు బలయ్యి 132 శతకోటి ఘనపు అడుగుల వినియోగం కావలసిన తెలంగాణా భూములు ప్రభుత్వం లెక్కలలోనే 90 శతకోటి ఘనపు అడుగుల నీరు గ్రావిటీ మార్గంగా, 10 శతకోటి ఘనపుటడుగుల నీరు లిఫ్ట్ మార్గంగా వినియోగమవాలని నిర్దేశించడంతో తీవ్ర అన్యాయానికి గురయ్యాయి. ఈసందర్భంగా అనేక ప్రశ్నలు మన మనసుల్లో ఉద్భవిస్తాయి.

అనలు ప్లానింగ్ కమిషన్ ఆమోదం తెలిపిన నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ఎడమ కాలువ నీటిలో నూజివీడు ప్రాంతం సాగవ్వాలని ఉందా? లేకపోతే నాగార్జునసాగర్ ఎడమకాలువ అలైన్‌మెంట్ మార్చిన కారణం ఏమిటి ? అది ఎవరి ప్రమేయంతో జరిగింది? కేటాయించిన 20 టిఎంసిల ఎడమ కాలువ నీరు ఈవేళ ఆంధ్రప్రాంతానికి 32 టిఎంసిలుగా ఎలా మారింది? ఇకపోతే నాగార్జునసాగర్ నుండి కృష్ణా డెల్టాకు నిర్ధారించిన నీటి మొత్తం ఎంత? అది ప్రతి సంవత్సరం అనుభవించేది ఎంత? అసలు నాగార్జునసాగర్ జలాశయం నిర్వహణ ప్రధానంగా ఎడమ, కుడి కాలువల క్రింద సాగయ్యే ఆయకట్టుకోసం ఉద్దేశింపబడిందా లేక కృష్ణా డెల్టా అవసరాలకు, ఆపైన విద్యుదుత్పాదనకోసం రిజర్వ్ చేయబడిందా? తేనెటీగల్లా ముసిరే ఈ సందేహాలు ఒక్క నాగార్జునసాగర్ విషయంలోనే కాదు ఇతర ప్రాజెక్టులకు సంబంధించి కూడా ఉన్నాయి. శ్రీశైలం కేవలం విద్యుత్తు ఉత్పాదనకోసం డిజైన్ చేయబడ్డదన్నమాట నిజం కాదా? అలాంటప్పుడు చెన్నైకి త్రాగునీరు అన్న ముసుగులో ప్రారంభమై, తెలుగు గంగ, శ్రీశైలం కుడిగట్టు కాలువ, ఇంకా ఎస్కేప్ ఛానల్ ఇలా ఇష్టమొచ్చినట్టే కృష్ణ నీరు తరలించే అనేక పథకాలను రూపొందించబడడం వెనక ఉద్దేశ్యం ఏమిటి? అదే ఊపుతో మొదలెట్టిన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ పరిస్థితి ఏమిటి? శ్రీశైలం ఎడమగట్టు నుండి ప్రారంభం కావలసిన సొరంగం మాటేమిటి? కేంద్ర జలసంఘం నుండి అనుమతి పొందిన భీమా ఎత్తిపోతల పథకం ఎందుకు నత్తనడక నడుస్తోంది? కల్వకుర్తి, నెట్టంపాడు ప్రభుత్వం పథకాలను ఏదో మిషపై ఎందుకు కాలడ్డుతోంది?



కొత్త పుస్తకం

కృష్ణా డెల్టా మూడో పంటకు డెల్టా స్టెబిలైజ్ చేయడానికి పనికొచ్చే పులిచింతల డ్యాం మూలంగా నల్లగొండ జిల్లాలోని సాగర్ ఆయకట్టు కొంతమేరకు మునగటం అబద్ధమా? అలాంటప్పుడు ఈ డ్యాం వస్తే తెలంగాణాకు లాభం అని బుకాయించడం ఎంత దారుణం?

1.02 లక్షల ఎకరాల కోసం ఉద్దేశించిన జూరాల కేవలం 60 వేల ఎకరాలకు మాత్రమే నీరందించడం నిజమా, అబద్ధమా ? కేవలం కర్నాటక దయాదాక్షిణ్యాలపైన ఆధారపడ్డ రాజోలి బండ డైవర్షన్ పథకం మూలంగా ఎన్ని ఎకరాల మహబూబ్‌నగర్ జిల్లా భూములు సాగవుతున్నాయి ? కర్నాటక పీడ సరిపోదన్నట్టు సుంకేశుల ఆనకట్టకు నీరు రావడం లేదని రాయలసీమ సోదరులు ఆగ్రహించి తమ ప్రతాపాన్ని రాజోలిబండ ఆనకట్టపై చూపడం గతంలో జరిగిందా, లేదా? కృష్ణ పరిస్థితి ఇలా ఏడిస్తే గోదావరి సంగతేమిటి? శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వితీయ దశ, వరద కాలువ పూర్తవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందా? కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించిన ఈ పథకాలకే అతీగతీ లేనప్పుడు, ఎలాంటి అనుమతి లేని ఎల్లంపల్లి పథకం ఇప్పట్లో పూర్తవుతుందని ప్రభుత్వం నమ్ముతోందా? అసలు ఆ పథకానికి ఇండిపెండెంట్ ఆయకట్టు ఉందా? లేకుంటే ఆ పథకం లబ్ధి వ్యయ నిష్పత్తి పరీక్షలో ఎలా నెగ్గుతుంది? అసలీ విషయాన్ని ప్రభుత్వం ఎన్నడైనా సీరియస్‌గా ఆలోచించిందా? ఇచ్చంపల్లి గురించి తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వం ఇంకా ఎన్నాళ్ళు ప్రజలను మభ్యపెడ్తుంది? ఆ పథకం ఉన్నట్టా, లేనట్టా?

దేవాదుల పరిస్థితి ఏమిటి ?

ఇలా అడుగుతూ పోతుంటే ఈ ప్రశ్నలకు అంతం ఉండదు. నేటికీ సరైన జవాబూ దొరకదు. తెలంగాణా గురించి పచ్చి నిజాలు అంటూ ఏమైనా ఉన్నాయి అంటే ఇవి. అలాగే సమస్యలకు పరిష్కారమార్గాలు కూడా ఇవే.

ఒకటి : తెలంగాణా + 100 నుంచి + 600 మీటర్ల ఎత్తులో వుంది. తెలంగాణాకిరువైపులా రెండు గొప్ప నదులు కృష్ణా, గోదావరి ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లుంది దాని పరిస్థితి. కృష్ణా నదిలో 68 శాతానికి పైగా నీరందజేసే తెలంగాణాకు వినియోగం మాటొస్తే అందులో సగం కూడా లేదు. గోదావరి నదిలో 80 శాతానికి పైగా పరీవాహక ప్రాంతం కలిగిన తెలంగాణాలో వినియోగం మాటకొస్తే అంతంత మాత్రమే.

రెండు : కృష్ణా నదిలోని నికర జలాలలో ఆంధ్రప్రదేశ్ వాటా 811 శతకోటి ఘనపు అడుగులు. ఈ నీరు ఇప్పటికే పూర్తి వినియోగంలో ఉంది. కనుక తెలంగాణా వాసులు ఉద్యమాలు నడిపో, పోట్లాడో, నికర జలాలలో ఇప్పుడనుభవిస్తున్న దానికంటే ఎక్కువ నీరు సాధించగలమనుకుంటే అది అయ్యే పని కాదు. అంటే కృష్ణా జలాల్లో తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని భర్తీ చేయడం దాదాపు అసాధ్యం. ఇకపోతే అదనపు జలాల గురించి ఇప్పుడిప్పుడే తేల్చి చెప్పడం కుదరదు. కొత్త ట్రిబ్యునల్ కృష్ణానదిలో ఆంధ్రప్రదేశ్ వాటా పెంచితే ఆ పెంచిన వాటాలో తెలంగాణాకు ఏమైనా దొరకవచ్చు. అది తదుపరి విషయం నందోరాజా భవిష్యతి.

మూడు : ప్రభుత్వం లెక్కల ప్రకారం గోదావరిలో ఇంకా వినియోగమవవలసిన నీరు 680 శతకోటి ఘనపు అడుగులు. ప్రభుత్వం తలపెట్టిన స్కీంలో ఇచ్చంపల్లికి 85 శతకోటి ఘనపు అడుగుల నీరు, అదనంగా 60 శతకోటి ఘనపు అడుగుల నీరు ఆవిరి కోసం (ఇచ్చంపల్లి జలాశయం నుండి) తెలంగాణా వాటా కింద చూపబడింది. భారీ ప్రాజెక్టులో ఈ 145 శతకోటి ఘనపు అడుగులకు మరో 73 శతకోటి ఘనపు అడుగులు కేటాయించారు. అంటే తెలంగాణా భారీ ప్రాజెక్టుల కోసం 218 శతకోటి ఘనపు అడుగులను కేటాయిస్తే ఒక్క పోలవరం కోసమే 315 శతకోటి ఘనపు అడుగులు కేటాయించారు. తెలంగాణాకు ఏదైనా న్యాయం జరగాలంటే గోదావరి నీటిలో అధిక శాతాన్ని వాటాగా పొందాలి. భారీ ప్రాజెక్టులకు ఇప్పుడు కేటాయించిన 218 శతకోటి ఘనపు అడుగులకు అదనంగా మరో 232 శతకోటి ఘనపు అడుగుల నీరు కేటాయించడం తప్పనిసరి. వెరసి 450 శతకోటి ఘనపు అడుగుల నీరు కనీసంగా తెలంగాణ సాధించుకోవలసి ఉంటుంది. అలా సాధించుకున్న నీటిని గోదావరి, కృష్ణ బేసిన్లలో ఉపయోగించవలసి వుంటుంది.

నాలుగు : తెలంగాణాలో సాగుకు యోగ్యమైన భూమి 50 లక్షల ఎకరాలకు పైగా ఉందని అంచనా. ఈ భూమికి అవసరమయ్యే 450 శ.కో.ఘ. అడుగుల నీరు ప్రాణహిత, ఇంద్రావతిలలో లభ్యమవుతుంది. ఎన్‌డబ్ల్యుడిఏ (కేంద్ర ప్రభుత్వం వారి సంస్థ) వారి అధ్యయనంలో గోదావరి నది నుండి 500 శ.కో.ఘ. అడుగుల నీటిని ఎత్తిపోతల ద్వారా నాగార్జునసాగర్‌కు మళ్ళించవచ్చని తేలింది.

మార్గమధ్యంలో కొంత నీటిని శ్రీరాంసాగర్ కమాండ్‌కి అందివ్వడం ద్వారా మిగిలిన నీటిని శ్రీరాంసాగర్ జలాశయంలో ఆదా చేసి మెట్టభూములకు అందచేయవచ్చు. నాగార్జునసాగర్‌కి చేరే గోదావరి నీటితో సాగర్ ఆయకట్టు, కృష్ణా డెల్టా నిక్షేపంగా సాగవుతుంది.

ఎన్‌డబ్ల్యుడిఏ వారు ప్రతిపాదించిన స్కీంలలో ఎగువ కాలువ, దిగువ కాలువలున్నాయి. ఎగువ కాలువ నాగార్జున సాగర్‌కు లిఫ్ట్ ద్వారా, దిగువ కాలువ పులిచింతలకు గ్రావిటీ ద్వారా నీరు తరలించే ప్రతిపాదన ఉంది. ప్రత్యామ్నాయంగా మరో ప్రతిపాదనలో ఎగువ కాలువను మూసీవరకు, దిగువ కాలువను నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ వరకు తీసుకెళ్ళేటట్టు చూపడం జరిగింది. కీ.శే. శ్రీరామకృష్ణయ్యగారి పథకంలో ప్రాణహిత నీటిని గోదావరి, పెద్దవాగులపై బ్యారేజీలు కట్టి, ఎత్తిపోతల ద్వారా కృష్ణ, గోదావరి మధ్యగల రిడ్జ్‌కి తీసుకెళ్ళి అక్కడ్నుండి మెట్ట భూములకు వాలు మార్గంగా నీటిని సరఫరా చేయడం ఉంది. ఇలా అనేక పథకాలున్నాయి. వాటిని అధ్యయనం చేసి ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేయవలసి వుంటుంది.

ఏదిఏమైనా, తెలంగాణాకు సాగునీరు, తాగునీరు పుష్కలంగా లభించాలంటే గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా మళ్ళించడం తప్ప మరో మార్గం లేదు. 'నీరు-మీరు' లాంటి పథకాలు స్థానిక సమస్యలను తీర్చేవే గాని దీర్ఘకాలిక కరవు నివారణ పథకాలు కావు. అయితే ఈ ఎత్తిపోతల పథకాలు అమలు జరగాలంటే ముందు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలి. ఆ తరువాత అధ్యయనాలు చేబట్టాలి. అవసరమైన విద్యుత్తు లభించాలి. నిర్మాణానికి, నిర్వహణకు సరిపడా డబ్బు ఉండాలి. ఇది సుదీర్ఘకాలిక ప్రణాళిక. లఘుకాలిక ప్రణాళికలో భాగంగా జూరాల, రాజోలిబండ స్కీంలను పూర్తిగా ఆపరేషనలైజ్ చేయాలి. ఎస్‌ఎల్‌బిసి సొరంగాన్ని ప్రారంభించాలి. పులిచింతల విషయంలో తెలంగాణ రైతుల మనోభీష్టాన్నెరిగి నడుచుకోవాలి. నాగార్జున సాగర్‌లో తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి. శ్రీరాంసాగర్ ప్రథమ, ద్వితీయ దశ, వరద కాలువ పనులు వేగిరం పూర్తి చేయాలి. దీర్ఘకాలిక ప్రణాళికలైనా, లఘుకాలిక ప్రణాళికలైనా ప్రభుత్వం పైన వత్తిడి లేకుండా అమలు కావు. ఇది నూటికి నూరుపాళ్ళు యథార్థం.

తాజా సమాచారం :

తెలంగాణా మెట్టభూములకు సాగు నీరందించేందుకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ వారి ఆధ్వర్యంలో రిటైరైన ఇంజనీర్లు రూపొందించి గోదావరి జల వినియోగ సమగ్ర ప్రణాళికను ప్రభుత్వం అంగీకరించి సర్వే కోసం ఆదేశాలిచ్చింది. ❑

నీళ్లు - నిజాలు (వ్యాసాల సంకలనం) - ఆర్.విద్యాసాగర్‌రావు, రు.100, ప్రతులకు : ఎం.కోదండరాం, అధ్యక్షులు, తెలంగాణ విద్యావంతుల వేదిక, 3-4-142/6, బర్కత్‌పుర, హైదరాబాద్

కులంపై మరోసారి విలువైన చర్చ

మానేపల్లి

పుస్తక సమీక్ష

వర్గ నిర్మూలనకు, కుల నిర్మూలనకు సంబంధం లేదనలేం గాని, వర్గ నిర్మూలన కాకుండా కేవలం కులం మాత్రమే నిర్మూలన కాదు. కాగా వర్గ నిర్మూలన తరువాత కూడా స్థానిక సమాజాల్లో వున్న కుల భావనపై మరింత లోతయిన పోరాటం చెయ్యాలి. ఇది ఒక దీర్ఘకాలిక పోరాట సమస్య. ఇది ఒక స్థూలమైన మార్క్సిస్టు అవగాహనతో చెప్పుకున్న విషయం.

మార్క్సిజాన్ని అంగీకరించి అభిమానించే మిత్రులు 2000 ఆగస్టులో గుంటూరు లెఫ్టిస్టు స్టడీ సర్కిల్‌గా ఏర్పడ్డారు. వారు హైదరాబాదు నుంచి కూడ చిన్న చిన్న పుస్తకాలు ప్రచురించనారంభించారు. 2005 చివరికి ముప్ఫయికి పైగా చిన్నా పెద్దా విలువైన పుస్తకాలు వేసి, మార్క్సిజంపై వివిధ కోణాల్లో చర్చకు వీలు కల్పిస్తున్నారు. ఉర్సులాశర్మ గారు 'కులం'పై రాసిన వ్యాస సంపుటికి ఎం.సంజీవరెడ్డిగారి తెలుగు అనుసరణ (ఆగస్టు 2005) - కులాన్ని వివిధ సామాజిక, మానవ శాస్త్రవేత్తల దృష్టిలో తులనాత్మక అధ్యయనంగా వెలువడింది.

కులం, జాతి, వర్ణం - ఈ పదాలు వేరువేరు సాంకేతికార్థాలు ఇస్తాయి. కాని నిజ జీవితంలో, వాడుక భాషలో - ఇవన్నీ కలగలిసిపోతాయి. బహుశా మానవ సమాజంలో కూడా ఇవన్నీ కలగలిసి వుండాలి. బుద్ధుడే మార్క్స్ కంటే ముందు కులాన్ని వ్యతిరేకించాడని కొందరు ఇప్పటికీ నమ్ముతున్నారు. భారతదేశంలో కూడా అన్ని రాష్ట్రాల్లో భాషా భేదాలు గల ప్రాంతాల్లో, మైదాన, కొండ ప్రాంతల్లో ఈ కుల అంతరాలు ఒకలా లేవు. కులాల అంతరాలుగా కాక ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల వెలుగులో పరిశీలిస్తే కొంత చీకటి తొలగుతుంది.

మరొక్క విషయం - ఈ సామాజిక స్థిరీకరణను తెలియజేసే పదాలు ఏ రెండు భాషల్లో సమానార్థాల్లో ఉండి ఉండవు. ఉర్సులాశర్మ - మహిళ గనుక ఆమె స్త్రీవాద కోణంలో కులాన్ని పరిశీలించారా అనే ప్రశ్నకు, ఈ వ్యాసాల్లో ఎక్కడా ఆస్కారం కనిపించదు. ఇండెన్, వైట్‌హెడ్, డర్క్స్ - మొదలైన మేధావుల అభిప్రాయాలను చర్చిస్తూ కులానికి మతం పునాదిగా భావించడం, రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకపోవడంలోని లోపాలను ఎత్తి చూపారు. మాక్స్ వెబర్, సెలెస్టిన్ బౌగ్లేల అభిప్రాయాలు వివరంగా చర్చించారు. గెయిల్ ఆమ్‌వెట్ - ఒకే కుల సమాజంలోని వైరుధ్యాలను పేర్కొన్న తీరునూ వివరించారు. నాల్గవ అధ్యాయాన్ని అస్పృశ్యతా సమస్య చర్చించడం కోసం కేటాయించారు. ఒక కులం మరొక కులంగా పరివర్తన చెందడానికి గల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యాల్ని మరొక అధ్యాయంలో చర్చించారు.

తాను వివరించిన అభిప్రాయాలను, చేసిన చర్చను ఉర్సులాశర్మ గారు పదేపదే పునస్సమీక్షించుకోవడం ద్వారా - తన భావాల్ని మరింత నిశిత పరిశీలనకు గురి చేశారు.

ఇటీవల వెలువడిన పుస్తకాలన్నిటికంటె లెఫ్టిస్టు స్టడీ సర్కిల్ వారి ఈ ప్రచురణ - భిన్నంగానూ, విశ్లేషణాత్మకంగానూ, మార్క్సిస్టు భావజాలానికి దగ్గరిగానూ ఉంది. వివిధ ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తున్న వారు, స్టడీ సర్కిల్స్ నిర్వహిస్తున్న వారు, అధ్యాపక, విద్యార్థి, ఉద్యోగసంఘాలవారు తప్పక చదవదగిన పుస్తకం. తమ ఆచరణకు గీటురాయిగా ఉపయోగించదగిన పుస్తకం.

(వివిధ సామాజిక, మానవ శాస్త్రవేత్తల దృష్టిలో 'కులం' - తులనాత్మక అధ్యయనం - ఉర్సులాశర్మ, అనుసరణ : ఎం.సంజీవరెడ్డి - లెఫ్టిస్టు స్టడీ సర్కిల్ ప్రచురణ : 112 పేజీలు, రూ. 35. విశాలాంధ్ర, ప్రజాశక్తి, మైత్రి, దిశ, నవయుగ, మణి బుక్‌స్టాల్స్‌లలో ప్రతులు లభిస్తాయి) ❑

వచ్చే సంచికలో ....

- **సామ్రాజ్యవాద విశ్లేషణలో మైలురాయి హారీ మాగ్డాఫ్** - **ఎన్.వేణుగోపాల్**
- **ఎన్ని అంతస్తులు నిర్మించినా వీరి అంతస్తు పెరగదా?** - **డా.సోమరాతి భిక్షపతి**
- **కొత్త రాజకీయ పదజాలం** - **ప్రొ.వాసిరెడ్డి భాస్కరరావు**
- **పేదరికాన్ని పెంచిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్**

(హైదరాబాద్‌లో 2006 మే మొదటివారంలో జరగనున్న ఎ డి బి గవర్నర్ల వార్షిక సమావేశం సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

కొత్త సామాజికశాస్త్ర పత్రిక 'సమాజ'

కె. సీతారామారావు, పి. నర్సింహారావు

కొత్త పత్రిక

సామాజిక వాస్తవికతకు స్పందించడం, ఈ వాస్తవికతలను మార్చే కృషిలో భాగంగా భావవ్యక్తీకరణకు వేదికలను, పత్రికలను సృష్టించుకోవడం, సమాజ అధ్యయన పద్ధతులను, పరిశోధనాసక్తిని పెంపొందించుకోవడం, సామాజిక మార్పు కవసరమయిన, నూతన విలువలు, చైతన్యం, దృక్పథాలు, విజ్ఞానాన్ని విస్తరింపజేయడం, ఇవన్నీ మానవుడు ఒక సామాజిక వ్యక్తిగా ఎదిగే క్రమంలో తన బౌద్ధిక పరిణతిని, మేధాశక్తిని విస్తరింప చేసుకొనే క్రమంలో భాగం.

మానవ సమాజ పరిమాణంలో 'విజ్ఞానం' రెండు శాఖలుగా విడివడి అభివృద్ధి చెందింది. ఆ విజ్ఞాన రూపాలే ప్రకృతి - భౌతిక శాస్త్రాలు, సాంకేతిక విజ్ఞానం; సామాజిక శాస్త్రాలు, సాహిత్యం, కళలు. ఈ రెండు విజ్ఞాన శాఖలు కూడా మానవ నాగరికతా వికాసంలో మానవుడు తన శ్రమ శక్తికి భావనా శక్తిని జోడించి ఆచరణలో సాధించిన సాధారణ అనుభవాల క్రోడీకరణ ద్వారానే అభివృద్ధి చెందినవి. ప్రకృతి - భౌతిక శాస్త్రాలు, సాంకేతిక విజ్ఞానం ప్రకృతి శక్తులను లొంగదీసుకొని, మానవుని ఉత్పాదక శక్తి, సామర్థ్యాలను ఇనుమడింపచేసి, సమాజంలో ఉత్పత్తిని అధిక స్థాయిలో పెంచడానికి తోడ్పడుతాయి. అయితే ఉత్పత్తి శక్తుల సామర్థ్యం వల్ల నిరంతరం పెరిగే ఉత్పత్తి పరిమాణాన్ని, ఫలితాలను సమాజంలో సమంగా, న్యాయబద్ధంగా పంపిణీ చేయడానికను కూలమైన ప్రజాస్వామిక చైతన్యాన్ని, విలువలను, వాతావరణాన్ని సృష్టించి ప్రజల్లో వ్యాపింప చేయడం; విధాన రూపకల్పన కవసరమైన సాధారణ సామాజిక భావనలను, నియమాలను పరిశోధించి, వివరించాల్సిన బాధ్యత సామాజిక శాస్త్రాలదయింది.

సామాజిక వాస్తవికత, సంబంధాలు, మార్పుకు సంబంధించిన విశ్లేషణ ప్రకృతి - పదార్థ స్వభావ పరిశోధన కన్నా అత్యంత క్లిష్టమైనది. సామాజిక శాస్త్రజ్ఞుడి ప్రయోగశాల సమాజం, పరిశోధించి అర్థం చేసుకోవాల్సిన విషయం మానవ సంబంధాలు. ఇక్కడ పరిశోధకుడు, పరిశోధితాంశం ఒకే స్వభావం కలిగి ఉండడంవల్ల పరిశోధనా పద్ధతి, అన్వేషణా రీతులు మరింత క్లిష్టతరమయ్యే అవకాశమున్నది. మానవ నాగరికతా సౌధానికి పునాది అయిన తాత్విక జిజ్ఞాస ఆధారంగా అభివృద్ధి అయిన సామాజిక శాస్త్రాలు సమాజ సంస్కృతీ సాగరతీరాలను దాటిపోవడం సాధ్యంకాదు. అంతేగాకుండా సామాజిక శాస్త్ర పరిశోధనకు ఏది మంచి, ఏది చెడు? ఏది న్యాయం ఏదికాదు? ఏది ఉత్తమ జీవిత విధానం? ఏవి అనుసరణీయమైన నైతిక విలువలు? ఏది ఉత్తమ సౌందర్య దృష్టి? ఏది ఉత్తమ రాజకీయ వ్యవస్థ? వంటి నిరపేక్ష - సాపేక్ష విలువలకు సంబంధించిన ప్రశ్నలు ఏ సమాజంలోనైనా, ఏ కాలంలోనైనా నిరంతరం వెంటాడుతునే ఉంటాయి. పరిశోధకుడి స్వీయాత్మకతకు అతని ఆలోచనలకు, అభిప్రాయాలకు వెలుపల ఉండే సామాజిక వాస్తవికతకు మధ్య నిరంతర సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. బాహ్యాత్మక సామాజిక వాస్తవికతను, స్వీయాత్మక ఆలోచనలను అనుసంధానించి, సమన్వయుమెనర్చి సామాజిక వైరుధ్యాలను విశ్లేషించి పరిష్కారాలను సూచించే నేర్పరితనం సామాజిక శాస్త్రజ్ఞుడి సాధారణ అనుభవం మీదనే గాక సృజనాత్మకతపై ఆధారపడి ఉంటుంది.

ఏ సామాజిక భావనలైనా, సిద్ధాంతాలైనా శూన్యం నుండి ఆవిర్భవించవు. అంటే ఎలాంటి సామాజిక సిద్ధాంతాల కైనా పునాది సామాజిక ఆచరణ. సామాజిక ఆచరణ అనే భావనను విశాల అర్థంలో అన్వయించుకోవాలి. సామాజిక ఆచరణ అంటే ; ఒకానొక చారిత్రక సమయంలో ఉత్పత్తి, పునరుత్పత్తి, పంపిణీ పునాదిగా గల సమాజాల్లో ఉన్నటువంటి వివిధ వర్గాల మధ్య నుండే సామాజిక సంబంధాలు, ఆ సంబంధాల్లో అనివార్యంగా తలెత్తే ఘర్షణ, ఆ ఘర్షణను ఆసరాగా చేసుకొని రూపొందే వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రక్రియలు; సంస్కృతి, భావజాలం, వ్యవస్థలు, సాహిత్య - కళారూపాలు; వీటిలో నిరంతరం మార్పులు తీసికొని రావడానికి మానవులు చేసే చైతన్యవంతమైన, సామూహిక ప్రయత్నం; ఇవన్నీ సామాజిక ఆచరణలో భాగమవుతాయి. ఈ సామాజిక ఆచరణకు చెందిన వివిధ అంశాలే వివిధ సామాజిక శాస్త్రాలకు పునాదులవుతాయి. ఏ సమాజంలోనైనా సామాజిక శాస్త్రాల నిత్య నూతనత్వం అనేది నిరంతరం చలన శీలంగా ఉండే సామాజిక ఆచరణను ఎంత ప్రతిభావంతంగా, సమర్థవంతంగా గుణాత్మకంగా ప్రతి ఫలింప చేస్తాయనే అంశం మీద ఆధారపడి ఉంటుంది.

సమాజ సమష్టి శ్రమలో భాగమైన భావాలు, ఆలోచనలు, అభిప్రాయాలు ఏ ఒక్కరి స్వంతం కావు. వాటిని తమ స్వంతమని ప్రకటించుకోకుండా వాటి సామూహిక తత్వాన్ని గుర్తించగలగడం సమాజంలో తమ నైతిక బాధ్యతను గుర్తించడమే అవుతుంది. ఈ దృష్టితో పరిశీలిస్తే సమష్టి కృషి ఫలితమైన సామాజిక సంపదను సమాజపరం చేసే కృషిలో సామాజిక శాస్త్రజ్ఞుడి బాధ్యత ఎంతో ముఖ్యమైనది. సామాజిక వైరుధ్యాల అవగాహనలో, పరిష్కారంలో అస్పష్టంగా నున్న ప్రజల జ్ఞానాన్ని, చైతన్యాన్ని స్పష్టీకరించడంలో సామాజిక శాస్త్రజ్ఞుల బాధ్యత ప్రముఖమైనది. అతివేగవంతంగా మారుతున్న సమాజాల్లో సామాజిక పరిశోధన, సామాజిక శాస్త్రజ్ఞులు ప్రముఖమైన, కీలకమైన పాత్ర నిర్వహించే అవకాశాలున్నవి.

సామాజిక శాస్త్రాల అధ్యయనం వల్ల, సమాజ సంబంధాల విశ్లేషణ కారణంగా విస్తరించే విజ్ఞానం, విలువల మూలంగా వ్యక్తి ఆలోచనలు మరింత పరిణితం, మానవీయత మరింత విశాలం, వివేచనాశక్తి మరింత నిశిత మవ్వాలని, వ్యక్తులు సామాజిక వ్యక్తులుగా పరిణమించాలని మా ఈ కృషి లక్ష్యం. సామాజిక శాస్త్రాల అధ్యయనానక్తిని పెంచడం, పరిశోధనకున్న సామాజికావశ్యకతను విస్తృత పరచడం, నూతన అధ్యయన పద్ధతుల ఆవిష్కరణ, సామాజిక మార్పు కనుగుణమైన బౌద్ధిక వాతావరణాన్ని, సిద్ధాంతాలను, విలువలను వ్యాప్తి చేయడం మొదలైనవి ఈ 'సమాజ' కృషికి సంబంధించిన ఇతర లక్ష్యాలు. ఆచరణ పునాదిగా గల సామాజిక సిద్ధాంతాల పరిజ్ఞానం నుండి నిర్దిష్ట సామాజిక ఆచరణను అవగాహన చేసుకోవడం, విశ్లేషించడం, ఆ అనుభవం నుండి తిరిగి మళ్ళీ సామాజిక సిద్ధాంతాలను, విజ్ఞానాన్ని పునర్నిర్మించుకోవడం, పటిష్టం చేసుకోవడం ఈ 'సమాజ' కృషిలో అంతర్భాగం. వివిధ సామాజిక శాస్త్రాల్లో ముందుకొస్తున్న ధోరణులను, అధ్యయన పద్ధతులను సులభశైలిలో పరిచయం చేస్తుందీ 'సమాజ'. వివిధ సామాజిక శాస్త్రాల్లో సమకాలీన నూతన పరిశోధనా విషయాలైన రాజకీయార్థికం, చరిత్ర రచనా సిద్ధాంతాలు, సమకాలీన రాజకీయాల విశ్లేషణ, సామాజిక చైతన్య రూపాలైన సమాజ - సాహిత్య సంబంధాల విశ్లేషణ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సామాజిక మార్పు, అభివృద్ధి సమస్యలు, రైతాంగ, గిరిజన ఇతర సామాజిక ఉద్యమాలు, గ్రామీణాభివృద్ధి సమస్యలు, ఆర్థిక రంగం - వ్యవసాయం, పరిశ్రమలు, పారిశ్రామిక సంబంధాలు, కార్మికోద్యమాలు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ, వ్యవస్థా సిద్ధాంతాలు, రాజ్యం - ఉద్యోగి స్వామ్యం - అభివృద్ధి, సమాజ ప్రగతి - స్త్రీ సమస్య, ప్రజా విధాన అధ్యయనం, విద్యా విధాన ధోరణులు మొదలైన అనేక విషయాలపై 'సమాజ' సమగ్ర దృక్పథంతో గూడిన వ్యాసాలను, పరిచయాలను, సమీక్షలను మీకందిస్తుంది. సమగ్ర దృక్పథంతో గూడిన క్షేత్రాధారిత పరిశోధనను, అధ్యయనాలను ప్రోత్సహించడమేగాక ఆహ్వానిస్తుందీ 'సమాజ'.

భారత దేశంలోని ప్రాంతాల భాషా వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొంటే ప్రాంతీయ భాషల్లో సామాజిక శాస్త్రాల విజ్ఞానం అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని గుర్తించక తప్పదు. వివిధ ప్రాంతాల్లోని సామాజిక సంబంధాల్లో వస్తున్న మార్పు తీవ్రతను, వేగాన్ని, దిశను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే ప్రజల జీవనాన్ని అత్యంత సమీపం నుండి పరిశీలించాలి. ఈ విధంగా పరిశీలించడం పరిశోధకుడు ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకోవడంపై ఆధారపడి ఉంటుంది. ప్రజల మాతృభాష మాధ్యమంగా పరిశోధనలు జరిగితేనే సామాజిక మార్పును సమగ్రంగా, అన్ని దృక్కోణాలనుండి అవగాహన చేసుకోవడం సాధ్యమవుతుంది. కాబట్టి ప్రాంతీయ భాషల్లో సామాజిక శాస్త్రాల అధ్యయనాన్ని, పరిశోధనను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సామాజిక వాస్తవికతతో ఎంతో సన్నిహిత సంబంధం, ఎంతో జీవితానుభవం, సామాజిక శాస్త్రాల అధ్యయనం, పరిశోధన పట్ల ఎంత ఆసక్తి ఉన్నా భాష ప్రతిబంధకం కావడం వల్ల భావ వ్యక్తీకరణ క్లిష్టమవుతున్నది. ఈ ప్రతిబంధకాన్ని అధిగమించాలంటే ఆయా ప్రాంత ప్రజల స్వభాషలో అధ్యయనాన్ని, పరిశోధనను, వ్యక్తీకరణను ప్రోత్సహించడం అవసరం. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, నేర్పరితనాన్ని, ప్రతిభను; పరిశోధన, సామాజిక విజ్ఞాన విస్తరణ పట్ల మళ్ళించడానికి ఈ పత్రిక కృషి చేస్తుంది. ఈనాడు తెలుగులో ఎన్నో సాహిత్య పత్రికలున్నాయి. కాని ప్రత్యేకంగా సామాజిక శాస్త్రాల విజ్ఞానం, పరిశోధన పై కేంద్రీకరించే పత్రిక ఒక్కటి గూడా లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొంటే సామాజిక శాస్త్రాల అధ్యయనం కోసం ప్రత్యేకంగా ఒక పత్రిక అవసరం.

ఈ 'సమాజ' త్రైమాసికగా సంవత్సరంలో నాలుగు సంచికలు ప్రచురింపబడుతాయి. ప్రతి సంచిక దాదాపు నూరు, నూటా ఇరవై ఐదు పేజీలకు మించదు. విషయ ప్రాధాన్యతను బట్టి అప్పుడప్పుడు ప్రత్యేక సంచికలు గూడా ప్రచురిస్తాము. దృక్పథాత్మక వ్యాసం, పరిశోధనాత్మక వ్యాసం, సమాజ - సాహిత్య సంబంధాలు (విశ్లేషణాత్మక వ్యాసం), పాఠ్యాంశ వ్యాసం, అనువాద వ్యాసం- ఇవి 'సమాజ' లోని ప్రధానమైన శీర్షికలు. ఇవి గాక పుస్తక సమీక్ష లేదా పరిచయం, పరిశోధనా నివేదికల వ్యాసాల సంక్షిప్త సారం (Ph. D/M.Phil dissertations and other reports) డేటా కాలం (ప్రభుత్వ సంఘాలు, సెమినార్లు, ఇతర అధ్యయన విషయ కార్యకలాపాలకు చెందిన రిపోర్టులు) చర్చ, అభిప్రాయాలు, సామాజిక శాస్త్రాల సిద్ధాంతాలు/భావనలు/ శాస్త్రజ్ఞుల సంక్షిప్త పరిచయం మొదలైనవి ఇతర శీర్షికలు.

సామాజిక శాస్త్రాల బౌద్ధిక వాతావరణం లోకి కొత్తగా ప్రవేశిస్తున్న ఈ 'సమాజ'ను సహృదయంతో ఆహ్వానించండి. తగినంత ఆర్థిక - హార్థిక సహాయ సహకారాలందించండి. ఈ 'సమాజ'ను పటిష్టం చేయడానికి, నూతన భావాల అన్వేషణకు మీ సమయం, బౌద్ధిక శ్రమ మాకవసరం. విరివిగా రచనలు పంపించండి. విస్తృతంగా రచనను, కొత్త రచయితలను ప్రోత్సహించండి. ఈ సమష్టి కృషిలో మీరూ భాగస్వాములు కండి. 'సమాజ' నిలదొక్కుకొని వికసించేందుకు తోడ్పడండి.


వివరాలకు :

'సమాజ',
కేరాఫ్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ & హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్,
కాకతీయ యూనివర్సిటీ, విద్యారణ్యపురి,
వరంగల్ - 506 009

ఒక దళారీ పశ్చాత్తాపం - పుస్తక పరిచయ సభ

కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్ - జాన్ పెర్కిన్స్ అంతరంగ కథనాన్ని కొణతం దిలీప్ తెలుగులోకి 'ఒక దళారీ పశ్చాత్తాపం'గా అనువదించారు. అప్పటికే వీక్షణం లోనూ, నెట్‌లోనూ, కొన్ని పత్రికల్లోనూ పుస్తకం గురించి చదివి, విని, ఆసక్తితో ఎదురుచూస్తున్న పాఠకులకు అమెరికా అధ్యక్షుడు అణు ఒప్పందాలకై దేశంలో అడుగుపెడుతున్న తరుణంలో ఈ పుస్తకం అందింది.

పుస్తక పరిచయ సభ మార్చ్ 4, 2006 శనివారం సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం (మినీహాల్), హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. వీక్షణం పత్రిక గురించి, వీక్షణం పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ (సిడిఆర్‌సి) లను శ్రోతలకు పరిచయం చేస్తూ, సిడిఆర్‌సి కార్యదర్శి సి.వనజ వక్తలను ఆహ్వానించారు. సభకు కె.ఆర్.చౌదరి (రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త) అధ్యక్షత వహించారు. వీక్షణం ప్రధాన సంపాదకులు వి.హనుమంతరావు పుస్తకాన్ని ఆవిష్కరించి పుస్తకం గురించి మాట్లాడారు. అనువాదం చాలా సరళంగా వుందని దిలీప్‌ని అభినందించారు. అంతకుముందు రోజే బుష్ రాష్ట్రంలో పర్యటన జరిపి వెళ్ళడం, సరిగ్గా అలాంటి సందర్భంలోనే ప్రపంచబ్యాంకు దుర్మార్గాలను బహిర్గతం చేసే ఈ పుస్తకం వెలువడడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బుష్ పాదం వలన మలినమైన తెలుగునేలను కడగడానికేనేమో గత రాత్రి వర్షం కురిసిందని వ్యాఖ్యానించారు. పుస్తకంలోని ఆసక్తి కలిగించే వాక్యాలను ఉల్లేఖిస్తూ ప్రసంగించారు.



ఆవిష్కరణ సభలో వి.హనుమంతరావు, ఎన్.వేణుగోపాల్

తరువాత వీక్షణం వర్కింగ్ ఎడిటర్, సిడిఆర్‌సి డైరెక్టర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడారు. వ్యాపారం పేరుతో వచ్చిన వాస్కోడిగామా నుండి తరువాత వచ్చిన బ్రిటిష్ వైస్రాయ్, గవర్నర్ జనరల్‌లు, ఏజెంట్‌లు ఇవ్వాల్టి అంతర్జాతీయ ద్రవ్యసంస్థ కన్సల్టెంట్‌ల వరకూ జెండాలు మారినా దేశాన్ని దోచుకుపోయే ఎజెండా ఒకటేనని చెప్పారు. నిస్సిగ్గుగా సామ్రాజ్యవాద దేశాలు మరీ ముఖ్యంగా అమెరికా, అభివృద్ధి చెందుతున్న పేదదేశాలపై ఎటువంటి కుట్రలను అమలు చేస్తోందో అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే సాధికారిక కథనంగా పేర్కొన్నారు.

బి.వి. రాఘవులు సిపిఐ(ఎం) - రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ కొన్ని నెలల క్రితమే ఇంటర్నెట్‌లో ఈ పుస్తకం గురించి చదివినట్లు చెప్పారు. అప్పుడే ఆ పుస్తకాన్ని తెలుగు అనువాదంగా తేవాలని అనుకున్నప్పటికీ పుస్తకాన్ని సేకరించలేకపోయినట్లు చెప్పారు. పుస్తకాన్ని సేకరించి, అనువదించిన వీక్షణం పబ్లికేషన్స్‌ని అభినందించారు. పుస్తకం టైటిల్ ఇంగ్లీష్ టైటిల్‌కు సమానార్థం ఇవ్వడం లేదని అభిప్రాయపడ్డారు.

సురవరం సుధాకర్‌రెడ్డి ఎం.పి.(సి.పి.ఐ.) మాట్లాడుతూ, బుష్ వచ్చిన సందర్భంగా దేశవ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ కోటిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ నిరసన తెలిపారని అన్నారు. ఇంకా వివిధ పద్ధతుల్లో నిరసన తెలిపినవారెందరో వున్నారన్నారు. ఇప్పుడున్న ఆర్థిక, సామాజిక వాతావరణంలో వీక్షణం పబ్లికేషన్స్ తరపున ఇటువంటి పుస్తకం రావడం ముదావహమని పేర్కొన్నారు. అనువాదకుడు కొణతం దిలీప్‌ను అభినందించారు.

సభలో పాల్గొన్న వక్తలకు, శ్రోతలకు వీక్షణం పబ్లికేషన్స్ తరపున కొణతం దిలీప్ కృతజ్ఞతలు తెలియజేశారు. పుస్తకం అనువదించడానికి పురికొల్పిన గద్దె ఆనంద్‌స్వరూప్ గారికి, ఇలాంటి వాస్తవాలను మనముందుంచిన జాన్ పెర్కిన్స్‌కు, సహకరించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలియచేశారు. ❑

కొత్త పుస్తకాలు









- **జండర్ స్పృహ** - ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రతిఫలనాలు. సంపాదకత్వం: కాత్యాయనీ విద్మహే, యూనివర్సిటీ ఆర్ట్స్&సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రచురణ, 492+56 పేజీలు, 1/8 డెమీ, రు.180.
ప్రతులకు : నవోదయ బుక్ హౌజ్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్ - 500 027.

- **దృష్టి - దృశ్యం** - తెలుగులో సాహిత్య విమర్శ - పరిశోధన - కేతవరపు రామకోటిశాస్త్రి - జిజ్ఞాస ప్రచురణలు, 188+16 పేజీలు, 1/8 డెమీ, రు.50. ప్రతులకు : నవోదయ బుక్‌హౌజ్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్ - 500 027.

- **రెండో ప్రపంచయుద్ధంలో రష్యా** - తోలేటి జగన్మోహనరావు - సూర్య ప్రచురణలు, 294+10 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : సూర్య ప్రచురణలు, ఫ్లాట్ నం. 21, సూర్య సరోజ్ అపార్ట్‌మెంట్స్, హుడా కాంప్లెక్స్, హైదరాబాద్ - 500 035.

- **ప్రాణం ప్రణవం** - నానీలు - డా.ఎం.విజయశ్రీ, కౌండిన్య ప్రచురణలు, 50+6 పేజీలు, 1/8 డెమీ, రు. 30,
ప్రతులకు : ఎం. విజయశ్రీ, ఫ్లాట్ నం. 504, జగన్నాథ్ రెసిడెన్సీ, స్ట్రీట్ నం.6, విద్యానగర్, హైదరాబాద్ - 500 044

- **బహుళజాతి కంపెనీల లాభాల వేట.. భారత దేశంలో బిపిఒ లు** -బి. ప్రదీప్, భారతకార్మికసంఘాల సమాఖ్య ప్రచురణ-16 పేజీలు, రు.5, ప్రతులకు : ఐఎఫ్‌టియు కార్యాలయం, మార్క్స్ భవన్, ఇం. నెం. 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ - 500 044.


- **పాచికలు** - ముస్లిం స్త్రీల కథలు - షేక్ హుస్సేన్ సత్యాగ్ని - నసల్ కితాబ్ ఘర్ ప్రచురణ - 88 పేజీలు, 1/8 క్రౌన్, రు.40, ప్రతులకు : ఫాతిమా హుస్సేన్, 7/782, మోచంపేట్, కడప - 516 001.

- **కుల నిర్మూలన - విద్య** - సి ఎస్ సాగర్ - పిడిఎస్‌యు ప్రచురణ 80 పేజీలు, 1/8 డెమీ, రు.25,
ప్రతులకు : పిడిఎస్‌యు రాష్ట్ర కార్యాలయం, మార్క్స్ భవన్, ఇ.నెం. 658, విద్యానగర్, 7వ లైన, హైదరాబాద్ - 500 044.

- **భవిష్యత్ సోషలిజం - రెండు వ్యాసాలు** - జాన్ బెలామీ ఫాస్టర్ (అను:రావు కృష్ణారావు, డా.పిఎస్ ప్రకాశరావు), హారీ మాగ్‌డాఫ్, ఫ్రెడ్ మాగ్‌డాఫ్ (అను: డి.వెంకటేశ్వర్లు), లెఫ్టిస్ట్ స్టడీసర్కిల్ ప్రచురణ, 64 పేజీలు, 1/8 డెమీ, రు.20,
ప్రతులకు: లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి.రాధాకృష్ణమూర్తి, 5-85-4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు-522 002

- **సహస్ర చంద్ర దర్శిని** - స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ జైనిమల్లయ్య గుప్త 80వ జన్మదినోత్సవ ప్రత్యేక సంచిక, సంపాదకులు: డా.తూర్పు మల్లారెడ్డి, సామ మల్లారెడ్డి, సామాజిక అధ్యయన వేదిక ప్రచురణ, 162 ప్లస్ 18 పేజీలు, 1/4 క్రౌన్, రు.25, ప్రతులకు: సామాజిక అధ్యయన వేదిక, భువనగిరి- 508 116

- **కాంగ్రెసు చరిత్ర - మొదటి సంపుటం (1885-1935)** - భోగరాజు పట్టాభి సీతారామయ్య- 684 ప్లస్ 22 పేజీలు, 1/8 రాయల్, రు.450, ప్రతులకు: ప్రాచీ పబ్లికేషన్స్, 3-3-859/1/ఎ, ఆర్యసమాజ్ ఎదుటి సందు, కాచిగూడా, హైదరాబాదు - 500 027







ఆంధ్రప్రదేశ్ : నాడు - నేడు

ఆంధ్రప్రదేశ్‌లో భూకమతాల వివరాలు

	1956			2000-2001		
రైతు తరగతి	కమతాల సంఖ్య (లక్షలలో)	సాగయే భూమి (ల.హె.)	సరాసరి కమతం (హె)	కమతాల సంఖ్య (లక్షలు)	సాగయే భూమి (ల.హె.)	సరాసరి కమతం (హె)
సన్నకారు	16.38	8.16	0.5	70.23	31.04	0.44
చిన్నరైతు	7.75	10.0	1.29	25.18	35.65	1.42
దిగువమధ్య	7.11	29.04	4.08	5.01	28.55	5.7
పెద్ద రైతు	3.69	39.48	10.7	0.66	10.8	16.34
మొత్తం	42.46	103.37	2.43	115.32	143.99	1.25

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానపంటల ఉత్పాదకత (కిలోలు/ హెక్టారుకు)

పంట	1956-57	1970-71	1980-81	1990-91	2000-01	2004-05
వరి	1163	1359	1991	2442	2936	3111
జొన్నలు	441	377	527	715	914	1030
సజ్జలు	491	516	652	728	1038	868
మొక్కజొన్న	557	1344	2262	2086	2996	3142
రాగులు	967	795	965	1166	1210	1267
పెసర్లు	181	301	320	277	354	351
మినుములు	252	474	460	681	704	605
కందులు	272	305	194	214	427	456
శనగలు	286	340	298	642	1138	1012
ఉలవలు	183	255	191	390	259	383
వేరుశనగ	914	785	660	947	1145	891
ఆముదాలు	190	204	100	251	344	388
నువ్వులు	218	206	166	199	204	180
పత్తి	57	45	198	288	277	316
పొగాకు	840	648	968	1122	1903	1258
చెరకు	8178	7959	7859	7281	8277	7506
మిర్చి	643	728	920	1665	2211	3164

(టన్నులలో)

ఆంధ్రప్రదేశ్‌లో ఎరువుల వినియోగం

సంవత్సరం	నత్రజని	భాస్వరం	పొటాష్	మొత్తం
1970-71	208.4	66.9	17.9	293.2
1980-81	399.9	130.1	45.4	575.4
1990-91	1068.1	424.2	127.5	1619.8
2000-01	1362.0	663	209	2175
2002-03	1055.0	434	203	1673
2003-04	1139.0	474	240	1853

మూలం : డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, హైద్రాబాద్

వ్యవసాయ మార్కెట్ కమిటి, హైద్రాబాదు

కూరగాయల మార్కెట్, హైద్రాబాద్ :

హైద్రాబాదులో ఈ క్రింద చూపిన కూరగాయల మార్కెటులను రైతుల సౌకర్యార్థము అన్ని నిర్మాణపు పనులతో నిర్మించనైనది.

1. గుడిమల్కాపూర్ (9) ఎకరాలలో
2. బోయినపల్లి (23) ఎకరాలలో
3. యల్.బి. నగర్ (9) ఎకరాలలో

ఉన్నది. మార్కెట్ యార్డులో ఈ క్రింద చూపిన విధముగా అభివృద్ధి నిర్మాణపు పనులు చేపట్టడము జరిగినది.

1. కమీషన్ దుకాణములు సముదాయము
2. త్రాగునీటి సౌకర్యము
3. మరుగుదొడ్లు (సులభ్ కాంప్లెక్స్)
4. సిమెంట్ రోడ్లు
5. విద్యుత్తు లైట్లు
6. ఫలహార శాల
7. రైతు విశ్రాంతి గృహము
8. కార్యాలయ భవనము
9. రైతులకు సూచనలకు మైకు ద్వారా ప్రకటనలు
10. బహిరంగ వేలము ప్లాట్‌ఫామ్
11. పాన్ దుకాణములు
12. రైతు ధరలు తెలిపే బోర్డులు
13. ఉల్లిపాయల గోదాములు
14. వర్మి కంపోస్టు యూనిట్లు

పై కూరగాయల మార్కెట్ లలో పై విధములైన సౌకర్యములను కలుగజేసి, మార్కెట్ కమిటి వారు ఇటు రైతు సోదరులకు, అటు వ్యాపారులకు మార్కెట్ చట్టము 1966 లోని అంశములను అమలుపరిచి, సేవలు చేయుచున్నది. ఇంకను రాబోవు నెలలో నాబార్డు వారి ఆర్థిక సహాయంతో గుడిమల్కాపూర్‌లోని కొత్త మార్కెట్ యార్డులో పూల మార్కెట్టు సముదాయము కూడా ఏర్పాటు చేసి, అందుకు కావలసిన సౌకర్యములనే దాదాపు 2.85 లక్షల విలువతో పనులు చేపట్టడము జరుగుతున్నది. దీని పర్యవసానముగా హైద్రాబాదు చుట్టు ప్రక్కల గ్రామముల రైతులకు ఎంతో సౌకర్యము కలుగబోవుచున్నది.

24/02/06

వ్యవసాయ మార్కెట్ కమిటి, హైద్రాబాదు.

No. AMCH/A/R.II/23-2005-06/2371

PRINTED BOOK
RNI Regn. No. APTEL/2003/11482 Published on 27-03-06 Postal Regn. No. LII/RNP/H-HD 1029/2004-06

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 55843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Working Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency,
3-6-394, Road No. 3, Himayatnagar, Hyderabad - 500 029.